తిరుగు ప్రయాణం

నల్లాల లక్ష్మిరాజం

కథల సంపుటి



తిరుగు ప్రయాణం

తెలంగాణ కథల సంపుటి

నల్లాల లక్ష్మిరాజం

తెలంగాణ కథావేదిక &
ఆం.ప్ర. బీసి, ఎస్సీ, ఎస్టీ రచయితల, కళాకారుల,
మేధావుల ఐక్యవేదిక తరఫున

విశాల సాహిత్య అకాడమీ ప్రచురణ

2-2-186/53/5, బాగ్ అంబర్‌పేట్,
హైదరాబాద్-500 013 (ఆం.ప్ర.)
ఫోన్: 040-31036987

THIRUGU PRAYANAM
TELANGANA KATHALA SAMPUTI
(RETURN JOURNEY - Telangana short stories)
Social History of Telangana in short stories

894.8273

by
NALLALA LAXMIRAJAM
(Dr. B.R. Abedkar National Fellowship Awardee)

Vill & Post : TAKKALLAPELLY,
Mdl : Jagtial-505 454, Dist : Karimnagar. (A.P.)
Ph : 08724-224114

Edited & foreword by B.S. Ramulu Social Philosopher

Publication No. 41 First Edition : 2003

Cover Design :
Sai Digital Photo Creations, Jagtial. Ph : 08724-226686

For Copies :
VISHALA SAHITYA ACADEMY
2-2-186/53/5 Bagh Amberpet,
Hyderabad-500 013, A.P.
Ph : 040-31036987

6-2-157, Mission Compound,
Jagtial-505 327. Dist . Karimnagar. A.P.
Ph : 08724-230056

A C. No. 81910
-500 044.
C 24166

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి
ఆర్థిక సహాయంతో ముద్రించబడినది.

printed at Karshak Art Printers, Hyd. Ph : 040-27618261

Type setting at : **PALLAVI GRAPHICS**, Jagtial-505 327.

Rs. 30/- $: 5/- (in Out side India)



కీ॥శే॥ నల్లాల రాజనర్సయ్య గారు

(జననం :1930 మరణం : 18-6-2001)

అంకితం ...

నాన్న ! మన జీవితాలు వడ్డించిన విస్తరి కాదు !
అడివంతా తిరిగి ఆకులు తెచ్చి
కుట్టటానికి పుల్లలు ఏరుకొచ్చి
అన్ని సమకూర్చుకొని అన్నం తయారయేలోగా
ఆకలే చచ్చిపోయింది !!
తిందామనుకునేలోపు మనిషివే చచ్చిపోయినవ్

మన దళితుల జీవితాలంతా ఇంతే
బ్రతుకు పొడుగున కష్టాలు కన్నీళ్ళే, కుళ్లు కులంతో హేళనలు అవమానాలే
అయినా, ఒకరికి సలాం కొట్టకుండ
ఆత్మాభిమానంతో జీవించినావు
ఆత్మ గౌరవం కోసం కొట్లాడినావు

కనులు మూసి మాకు దూరమైన
నీ నిండైన రూపం మా కండ్లల్లో ఎప్పుడూ కదులుతూ ఉంటుంది
గుండెల నిండ నీ జ్ఞాపకాలే
అప్పుడప్పుడు వచ్చే ఒక్కో కన్నీటి బొట్టు నిండ నీ జ్ఞాపకాలే
మరణం నిన్ను మా నుంచి దూరం చేసినా
నీ ఆశయాన్ని వేరు చేయలే
ఆ ఆశయం కోసం ....

మీ చిన్న కుమారుడు
నల్లాల లక్ష్మిరాజం

విషయ సూచిక

	నా కథల వెనుక కథ		5
	రచయిత పరిచయం - డా॥ జె. రమణయ్య		9
	నూతన శతాబ్ది యువ వైతాళికుడు లక్ష్మీరాజం - బి.ఎస్. రాములు		11
	తెలంగాణా కథా కెరటం నల్లాల లక్ష్మీరాజం - డా॥ కాలువ మల్లయ్య		23
1.	తిరుగు ప్రయాణం (సుప్రభాతం - వీక్లీ)	....	27
2.	రాజవ్వ కొడుకు (నేటి నిజం - దిన పత్రిక)	....	35
3.	దొమ్మరి గంగడు (మాభూమి - దిన పత్రిక)	....	44
4.	మావూరి ముచ్చట్ల (నేటినిజం - దిన పత్రిక)	....	49
5.	పునరావృతం (దళితజ్యోతి - మాస పత్రిక)	....	59
6.	భలే బామ్మర్ది (ఇంటర్నెట్ లో వచ్చినది www.thats telugu.com)	....	68
7.	యమపురిలో ఒకరోజు (సుప్రభాతం - వీక్లి)	....	78
8.	పడగ నీడలో పావురాలు (దళితజ్యోతి - మాస పత్రిక)	....	86
	అభిప్రాయాలు	....	95
	అవార్డులు	....	97
	అభినందనలు	....	100

నా కథల వెనుక కథ ...

కవితలు రాయడమన్నా, పాటలు రాయడమన్నా, కథలు రాయడమన్నా నాకు చిన్నప్పటి నుండి ఎంతో ఇష్టం. ఏవో తోచినవి రాస్తూ స్నేహితులకు చూపించేవాన్ని, మూలకు పడేసేవాన్ని. సాహిత్యం పట్ల మక్కువతో కాలేజి చదివే రోజుల్లో యండమూరి లాంటి పాపులర్ రచయితల పరిచయాల కోసం హైదరాబాద్ వెళ్ళాను. సాధ్యంకాక తిరిగి వచ్చాను. మా గ్రామంలో "టైం ఎంతవుతుంది పటేల" అని ఓ బిసి అతను ఓ పటేల్‌ను టైం అడిగినందుకు "నన్ను టైం అడుగుతావుర, నీకెంత కావురంరా" అంటూ ఆ బిసి అతన్ని ఆ పటేలు గొడ్డును బాదినట్లు బాదిన సంఘటనలాంటి ఎన్నో సంఘటనలను కళ్లారా చూసి 1987 సం।లో అంబేడ్కర్ యువజన సంఘం నిర్మాణం చేసి దళితులను, బిసీలను చైతన్యవంతులను చేస్తూ కుల పీడనను, అగ్ర కులాల దౌర్జన్యాన్ని ఎదిరిస్తు, అంబేడ్కర్ యువజన సంఘంలో జిల్లా కార్యవర్గ సభ్యులుగా కొనసాగుతున్న సమయంలో కొందరు అగ్ర కులస్తులు కుట్ర పన్ని నాకు హాని చేయచూసారు. అది గమనించి నన్ను నేను రక్షించుకొనుటకు చదువు మధ్యలో ఆపేసి నాకిష్టం లేకపోయినా పోలీసు డిపార్ట్‌మెంట్‌లో కానిస్టేబుల్‌గా చేరవలసి వచ్చింది. నేను ఉద్యోగంలో చేరిన మూన్నెల్లకు మా గ్రామంలో వినాయకుని ఊరేగింపులో దప్పు కొట్టుకుంటు ఎగురుతున్న ఓ దళితుడి కాలు ఓ క్రిస్టియన్ అబ్బాయికి తగిలినదని అగ్రకులస్తులు, దళితులను పంచాయితికి పిలిపించి పశువులను కొట్టినట్లు ఉరికించుకుంటు కొట్టారు. దళిత సోదరులు కరీంనగర్ ట్రేనింగ్‌లో ఉన్న నావద్దకు వచ్చి ఏడ్చుకుంటు చెప్పారు. నేను రెక్కలు తెగిన పక్షిలా విలవిలలాడిపోయాను... ఉద్యోగంలో చేరిన తర్వాత, పై చదువులు చదవాలన్న కోరిక నెరవేరలేదు. పోలీస్ ఉద్యోగంలో చేరడంతో ఊబిలో కూరుకుపోయినట్లయింది. బయటి సామాజిక విషయాల పట్ల ఆలోచించే తీరికా, పరిస్థితులు ఉండవు. పైగా ఎన్నో దుస్సంఘటనలు చేదు అనుభవాలను మిగిల్చాయి. నా చదువు, ఉద్యమం సక్రమంగా సాగి ఉంటే బి.ఎడ్. చేసి ఉపాధ్యాయున్ని అయి ఉండేవాన్ని.

నాలో ఉన్న సాహిత్య అభిరుచి నెరవేరక నిరాశగానే మిగిలిపోయింది. సాహిత్యం పట్ల ఉన్న అభిమానంతో ఒకసారి జగిత్యాలలో జరిగే బి.యస్. రాములు గారి జన్మదిన వేడుకకు హాజరైనాను. కాని బి.యస్. రాములు గారితో పరిచయం కాలేదు. కారణం మొహమాటం, చొచ్చుకపోయే మనస్తత్వం కాకపోవడం. 1999 జనవరి 12న ప్రముఖ కవి అలిశెట్టి ప్రభాకర్ సంస్మరణ సభకు హాజరయినాను. అట్టి సభలో పలువురు కవులు సాహితివేత్తలు తమ తమ కవితలను వినిపించారు. నేను అప్పటికప్పుడే నా గుండె లోతుల్లో ఎప్పుడు రగిలే వేదనను (110 పేజిలో) కవితగా రాసి మిత్రుల ప్రోత్సాహంతో చదివి వినిపించగా అట్టి సభకు అధ్యక్షత వహించిన బి.యస్. రాములు గారు అమితానందంతో చప్పట్లు కొట్టారు. సభ ముగిసిన తరువాత బి.యస్. రాములు గారు నన్ను పరిచయం చేసుకొని ఒకసారి ఇంటికి రమ్మని చెప్పినారు. బి.యస్. రాములు గారి చప్పట్ల బలంతో ఎన్నో కవితలు, పాటలు

రాసాను. మా గ్రామంలో నాటుసారా తాగి చనిపోయిన యువకుల పట్ల స్పందించి సామాజిక అంశాలతో కూడిన "జిబిరాజ్ జిందాబాద్" అనే నాటికను రాసి నేను, జగిత్యాలకు చెందిన చెన్న రాము నటించి గ్రామస్తులను చైతన్య వంతులను చేసి వారి సహకారంతో నాటుసారాను నిర్మూలించాము. నేను వీలు చేసుకొని ఒకరోజు బి.యస్. రాములు గారి ఇంటికి వెళ్లినప్పుడు బి.యస్. రాములు గారు ఎంతో ప్రేమతో సాహిత్యంలోని ఎన్నో విషయాలు చెప్పి యువ కథకుల కోసం రాసిన "కథా సాహిత్య అలంకారశాస్త్రం కథల బడి"ని, తాను రాసిన మరెన్నో పుస్తకాలను ఇచ్చి పంపించినారు. వాటిలో అప్పటి వరకు నేను ఎప్పుడు చదువని కథలను జీవితాలను చదివి తబ్బిబ్బయిపోయాను. బి.యస్. రాములు గారు ఇచ్చిన ప్రోత్సాహంతో ఎన్నో కథలు రాసి చూపించాను. కాని బి.యస్. రాములు గారిలా రాయలేదు. చూపించిన కథలను బాగున్నవి అంటు పత్రికలకు పంపించుమని అడ్రస్‌లు ఇచ్చినారు. అయితే బి.యస్. రాములు గారు ఇంకా నానుండి ఏదో వెలికి తీయాలనే చూస్తున్నారని నాకు అర్థమైంది. అదేమిటో కూడా అర్థమైంది. అలిశెట్టి ప్రభాకర్ వర్ధంతి సభలో దళిత కాన్సెప్ట్ పై అంత మంచి కవితను వినిపించిన లక్ష్మిరాజం దళిత కాన్సెప్ట్ పై కథలు ఎందుకు రాస్తలేడు? అని అనుకుంటున్నాడని నాకు అర్థమైంది. అర్థమైనప్పటికి నేను వ్రాయలేదు. ఒకరోజు "లక్ష్మిరాజం నీ బాల్యాన్ని, హాస్టల్ జీవితాన్ని కథగా రాయి" అని అన్ని రోజులుగా తనలో ఉన్న అభిప్రాయాన్ని బయటపెట్టారు. అప్పటిదాక నేను రాసిన కథలన్ని జనరల్ కథలే. ఊహ తెలిసినప్పటి నుండి దళితుడిగా ఎన్నో అనుభవిస్తు చిన్న వయసులోనే అంబేద్కర్ సంఘం నిర్మించి దళితులకు జరిగే అన్యాయాలను ఎదుర్కొంటూ, అగ్ర కుల ఆధిపత్య భావజాలాన్ని ఎదిరించి, ఆత్మ గౌరవం కోసం పోరాటం చేసిన నేను వందలాది కథలు రాసేందుకు. గ్రామీణ దళితుల, బిసీల జీవితాల పట్ల ఎంతో అవగాహన ఉండి కూడా మరి ఆ కథలు ఎందుకు రాయలేక పోతున్న? అని నన్ను నేను ఎన్నో సార్లు ప్రశ్నించుకున్నాను.

కథ రాయడం, కవిత పాట రాసినంత సులభం కాదు. కథలో ఎన్నో పాత్రలు, ఎన్నో సంఘటనలు సృష్టించాలి. కథలో ఆ పాత్రలు ఎదుర్కొనే కష్టాలను అవమానాలను బాధలను నేను అనుభవిస్తున్నట్టుగా ఫీల్ కావాలి, ఫీల్ అవుతూ అనుభవించాలి. అలా అయితేనే కథ రాయగల్గుతాము లేకుంటే రాయలేము. అంటే... మర్చిపోయిన బాధలను మళ్ళీ గుర్తుకు తెచ్చుకోవాలి, గుర్తుకు తెచ్చుకొని మళ్ళీ బాధపడాలి. ఆక్సిడెంట్‌లో గాయం అయితే సంవత్సరం పాటు ఆ గాయాన్ని ఆక్సిడెంట్ దృశ్యాన్ని తలచుకుంటు బాధపడినట్లు. జయం మనదేరా సినిమా అసిస్టెంట్ డైరెక్టర్, రచయిత అయిన గోపిని కరుణాకర్ తాను రాసిన "కానగపూల వాన" కథా నేపథ్యంలో "కడుపొస్తే ఎంత బాగుండు! ఆ నొప్పులేమిటో తెలుస్తాయి గదా! అని చిన్నప్పుడు అనుకునేవాన్ని, ఇప్పుడు కథలు రాస్తూ ఉంటే ఆ నొప్పులు అనుభవానికొస్తున్నాయి! బిడ్డ ఎంతనో కథ కూడా అంతే.! కడుపులో పడినప్పటి నుండి కాగితం మీద పెట్టేంతవరకు ప్రాణం నెమ్మదిగా ఉండదు. ఒక కథ రాయడమంటే తల్లిగా ఒక బిడ్డకు జన్మనిచ్చినట్టు" అంటాడు. అంటే బిడ్డ కడుపులో పడి తల్లిని నిలకడగా ఉండనీయకుండ నెమ్మదిగా కూర్చోనీయకుండ, మూడో నెలలో తల తిరిగి వాంతులు అయినట్లు, ఏడో నెలలో కాళ్ళతో తన్నటం మొదలు పెట్టినట్లు, తొమ్మిదో నెలలో తల్లి కడుపు నుండి బయట పడినట్లుగా, ఒక

కథ, రచయిత మెదడులో నుండి బయటకొస్తుంది. కథ రాయడమే అంత కష్టంతో కుడుకున్నదైతే దళిత కథలు రాయడం ఇంకా కష్టం, దళితుల జీవితాల నిండ కష్టాలు, కన్నీళ్ళు, అవమానాలు, తప్ప మరేముంటాయి? మరి వాటన్నింటిని కథల్లో చిత్రించడం ఎంత కష్టమో మాటల్లో చెప్పటం కష్టం.! ప్రముఖ రచయిత కె.వి. నరేందర్ "ఘోస్ట్ రైటర్" అనే కథలో ఓ చోట "తమ్ముడు స్పందించి రాయటం మానుకో! ఎందుకంటే గుండెల్లో తడి ఉంటే మాత్రం రోజూ ఏడుస్తావు"! అంటాడు. పైగా ఉద్యమ సాహిత్యాన్ని రాసే పరిస్థితుల్లో నేను లేను. బందూకు పట్టుకుంటే, బంధువులే గుర్తుకు రారు. ఇంకా కథలెలా గుర్తుకు వస్తాయి! అందుకే దళిత కథలు రాయడానికి మనసు ఒప్పేది కాదు. పోలీసు జీవితంలో అనుభవించే డిప్రెషన్ నుండి కాస్త ఉపశమనం పొందడానికి "భలే బామ్మర్ది" కథలాంటి హాస్య భరితమైన కథా వస్తువును ఎన్నుకొని రాసేవాన్ని. కాని బి.యస్. రాములు గారు పట్టు వదలని విక్రమార్కునిలా నన్ను వదిలిపెట్టలేదు. "చూడు లక్ష్మిరాజం మన బాధలనుండి మనమే పారిపోతే మన జీవితాల్ని, మన సంస్కృతిని, మన చరిత్రను మనమే రికార్డు చేసుకోకపోతే ఎవరు రికార్డు చేస్తారు.? మరాఠి సాహిత్యంలో దళితుల ఆత్మ కథలే గొప్ప సాహిత్యంగా గుర్తింపు పొందాయి. ఆత్మ కథలను మించిన కథలు నవలలు ఏముంటాయి? మన జీవితాలే గొప్ప కథలు, నవలలు అవుతాయి" అని ప్రోత్సహించారు. ఆ ప్రోత్సాహంతోనే "రాజవ్వ కొడుకు", "మావూరి ముచ్చట్లు", "దొమ్మరి గంగడు" లాంటి మరెన్నో కథలు రాసాను. ఇంత చేసిన బి.యస్. రాములు గారికి నా మొదటి కథల సంపుటిని అంకితం చేయాలని మనసులో అనుకునేవాన్ని, కాని దురదృష్ట వశాత్తు మా నాన్న చనిపోవడం వల్ల ఆయన జ్ఞాపకార్థంగా ఈ పుస్తకాన్ని మా నాన్నకు అంకితం ఇస్తున్నాను.

ఈ పుస్తకం ప్రచురణ నేపథ్యంలో పుస్తకంలో అభినందనలు తెలియజేసిన మేధావులను, నాయకులను, మిత్రులను కలిసినప్పుడు ఎంతో ప్రేమ చూపించి వారికి తోచిన ఆర్థిక సహాయం చేసి, నిత్య జీవితంలో వారు ఎదుర్కొనిన సమస్యలను అనుభవించిన బాధలను అధిగమించిన పరిస్థితులను చెప్పి వందలాది కథలకు సరిపడే కథా వస్తువులను అందించి నా బాధ్యతను మరింత పెంచారు. వారికి పేరు పేరున నా కృతజ్ఞతలు.

"ఒకరు ఎదుగుతున్నారంటే ఓర్వలేక గోతులు తవ్వే గుంటనక్కల్లాంటి వారు ఎందరో ఉంటారు. వారిని పట్టించుకోకుండా, మన పని మనం చేసుకుపోవాలి " అని జీవితాంతం గుర్తుంచుకొనే చక్కని మాట చెప్పి ముందుమాట రాసిచ్చిన జైశెట్టి రమణయ్య గారికి, ముందుమాట రాసిచ్చి కథలను ఎడిట్ చేసిన బి.యస్. రాములు గార్కి, సకాలంలో ముందుమాట రాసిచ్చిన కాలువ మల్లయ్య గార్కి కథలపై వారి అభిప్రాయాలను తెలిపిన వేముల పెరుమాళ్ళు గారికి, పత్రికల్లో వచ్చిన నా కథలు చదివి పత్రికలకు ఉత్తరాలు రాసే డి. సుబ్బారావు గారికి కృతజ్ఞతలు. సాహిత్యంలో నాకు ఎన్నో సలహాలు ఇస్తూ ప్రోత్సహించే రచయిత కె.వి. నరెందర్ గారికి, ప్రముఖ కవి, భారతీయ దళిత సాహిత్య అకాడమి రాష్ట్ర అధ్యక్షులు శమశ్రీ గారికి, తెలంగాణా కథావేదిక కన్వీనర్ కాసుల ప్రతాప్‌రెడ్డి గారికి, కథావేదిక రచయితలందరికి కృతజ్ఞతలు.

ఈ కథలను ప్రచురించిన సుప్రభాతం వీక్లి, మాభూమి మాస పత్రిక, దళితజ్యోతి మాస పత్రిక, నేటినిజం దిన పత్రిక సంపాదకులకు, ఉప సంపాదకులకు, నాతో ఇంటర్వ్యూ

జరిపి ప్రచురించిన ప్రజాతంత్ర దిన పత్రిక ఎడిటర్ దేవులపల్లి అమర్ గారికి, విలేకరి కొరివి వెంకటస్వామి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. జగిత్యాల ప్రెస్ క్లబ్ వారికి, సిటికేబుల్ సత్యం గారికి, దుర్గా కేబుల్ టి.వి. మల్లేశం గౌడ్ గారికి, గతంలో నా కవితలను ప్రచురించిన క్రాంతి కిరణాలు వార పత్రిక ఎడిటర్ అనంతుల కాంతారావు గారికి, వైశ్య విజన్ మాస పత్రిక ఎడిటర్ దేవరశెట్టి జనార్ధన్ గారికి, కళాశ్రీ పక్ష పత్రిక ఎడిటర్ గుండేటి రాజు గారికి, గానకోకిల కళానికేతన్ అధ్యక్షులు ఎలిగేటి రాజేంద్రప్రసాద్ గారికి, ఈ పుస్తకంనకు అందమైన కంపోజింగ్ చేసిన పల్లవి గ్రాఫిక్స్ శ్రీను గారికి, అందమైన కవర్ డిజైనింగ్ చేసిన సాయి డిజిటల్ రవి గారికి ధన్యవాదాలు.

డిల్లీ వెళ్ళి అంబేద్కర్ ఫెలోషిప్ జాతీయ అవార్డు అందుకొనుటకు ఆర్థిక సహాయం చేసి ప్రోత్సహించిన గౌ॥శ్రీ యస్.పి. శ్రీ ఆర్.యస్. ప్రవీణ్ కుమార్ ఐ.పి.యస్. గార్కి, నా పాటలను ఎన్నో సభలలో పాడించిన డి.యస్.పి. శ్రీ టి. సత్యనారాయణరెడ్డి గారికి, సి.ఐ. శ్రీ టి. సుదర్శన్‌గౌడ్ గారికి, సి.ఐ. శ్రీ ఉమామహేశ్వరశర్మ, వారి సతీమణి గార్లకు, నేను రాసిన నాటికను పలు గ్రామాల్లో ప్రదర్శింపజేసి ప్రోత్సహించిన సి.ఐ. శ్రీ దామెర నర్సయ్య గారికి, డా॥ రాజరెడ్డి గారికి, ధర్మపురి సర్పంచ్ ఒడ్నాల మల్లేశం గారికి కృతజ్ఞతలు. నా కవితలను ప్రచురింపజేసిన యస్.ఐ. శ్రీ వెంకటేశ్వర్లు గారికి, వెన్నుతట్టి ప్రోత్సహించిన ఎస్.ఐ.లు యస్. మహేందర్ గారికి, ఆర్. ప్రకాష్ గారికి, కట్టా హరిప్రసాద్ గారికి, శ్రీ యన్. వెంకటస్వామి గారికి, ఎక్సైజ్ ఎస్.ఐ. యస్. లక్ష్మన్‌రావు గారికి, ఆంధ్రప్రదేశ్ పోలీస్ ఆఫీసర్స్ యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ టి. సత్తయ్య గారికి, పి.ఆర్.ఓ. ఆది నారాయణరెడ్డి గారికి, జె. విజయరావు గారికి, డిప్యూటీ జైలర్ జి.యం. శ్రీనివాస్ గారికి మరియు చైతన్య కళామండలి రామస్వామి, కరీంనగర్ గారికి కృతజ్ఞతలు.

కవరు పేజి పైనున్న మా మేనమామ దొంతుల ఎల్లయ్య గారికి కృతజ్ఞతలు.

చదువు చెప్పిన గురువులకు, చెప్రాసి వెంకంరాజు గారికి, హాస్టల్ వార్డెన్ కె. పోచయ్య గారికి, సిబ్బంది అర్జున్‌కుమార్, స్వామి, రాంచంద్రం గార్లకు కృతజ్ఞతలు. సాహితీ మిత్రులకు, స్నేహితులకు, శ్రేయోభిలాషులకు, పోలీసు సోదరులకు, నా బంధువులకు, కుటుంబ సభ్యులకు, సాహిత్యంలో నాకు సహకరించే నా శ్రీమతి రాధకు కృతజ్ఞతలు.

ఈ కథలపై మీ అభిప్రాయాలను తెలియజేస్తారని ఆశిస్తూ...

మీ

నల్లాల లక్ష్మిరాజం

రచయిత

డా॥ జైశెట్టి రమణయ్య
M A., B Ed., M.Phil, Ph.D
చరిత్ర రీడర్ (రిటైర్డ్), జగిత్యాల.

రచయిత పరిచయం

జగిత్యాలకు ఉత్తరమున దాదాపు 10 కి.మీ. దూరాన అనంతారం వాగునానుకొని ఉన్న తక్కళ్ళపెల్లి గ్రామము అతి ప్రాచీనమైనది. దాని ప్రక్కనే ఉన్న గుట్టరాజుపల్లిలో 1976లో విజయనగరరాజుల కాలపు 39 బంగారు నాణెములు లభ్యమగుట ఆ ప్రాంత చారిత్రక ప్రాధాన్యతను తెలుపుచున్నది. అంతేకాకుండా ఈ గ్రామము 11వ శతాబ్దములో రాజధానిగా వెలసిన పోలవాస(పొలాస) పట్టణమునకు అతి సమీపములోనున్నది. ఇలాంటి చారిత్రక ప్రాధాన్యత గల తక్కళ్ళపల్లి గ్రామములో మాల కులమునకు చెందిన నిరుపేద దళిత కుటుంబములో తేది : 5-10-1970 రోజున జన్మించినారు యువ రచయిత, వచనకవి శ్రీ నల్లాల లక్ష్మిరాజం గారు. వీరు పోచయ్య, గంగవ్వల ప్రపౌత్రుడు (ముని మనవడు), లింగయ్య, పోచవ్వల పౌత్రుడు (మనవడు) మరియు రాజనర్సయ్య, రాజవ్వల పుత్రుడు. వీరికి ఒక సోదరుడు లింగయ్య, మరియు ఒక సోదరి విజయలక్ష్మి. తల్లిదండ్రులు తాత ముత్తాతలు వ్యవసాయము మరియు సుతారి వృత్తులను చేబట్టిరి.

శ్రీ నల్లాల లక్ష్మిరాజం గారు ప్రాధమిక విద్యను తక్కళ్ళపల్లి స్వగ్రామములో పూర్తి చేసి తదనంతరం జగిత్యాలలో డిగ్రీ వరకు చదివినారు. 1990 లో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో కానిస్టేబుల్ గా చేరినారు. వీరు విద్యార్థి దశనుండే పాటలు, గేయములు వ్రాయడము వాటిని గానము చేయడము, నాటకాలలో పాల్గొనడము, ఉపన్యసించడము, ఏకపాత్రాభినయము మున్నగు అభిరుచులను కలిగి ఉండెను. 1992, డిసెంబర్ 18 న కోరుట్ల వాస్తవ్యులైన కండ్లె లింగయ్య, లక్ష్మి దంపతుల జ్యేష్ఠ పుత్రికారత్నమగు రాధతో వీరి వివాహము జరిగినది. పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం వీరి వృత్తి. గేయ రచన, కథా రచన చేయడం వీరి ప్రవృత్తి. వీరి తండ్రి నల్లాల రాజనర్సయ్యగారు 2001 జూన్ 18న పరమపదించినారు. లక్ష్మిరాజం గారు తండ్రి మీద ఉన్న అపారమైన ప్రేమ, గౌరవములతో తాను వ్రాసిన వివిధ దిన, వార, మాస పత్రికలలో ప్రచురింపబడిన 8 కథలను కలిపి ఒక పుస్తక రూపమున ముద్రించి తన తండ్రికి, అంకితం చేయడము వారి పితృభక్తికి నిదర్శనము.

కాఠిన్యవృత్తిని చేపట్టిన లక్ష్మిరాజం గారి హృదయము సమాజము ఎదుర్కొంటున్న అనేక సమస్యలను తమ కథలలో అపూర్వంగా చిత్రించడము వారి దయార్ద్ర హృదయమును తెలుపుచున్నది.

ఈ పుస్తకములోని "తిరుగు ప్రయాణం" కథలో తీవ్రవాదం పోలీసుల భయంతో ఒకరికొకరు భయపడి ఇరువురు పట్టణానికేగిన వారు అక్కడి స్థితిగతులకు తట్టుకోలేక తమ

స్వస్థానమునకు తిరిగి వస్తే పల్లెలో నెలకొనిన పరిస్థితులకు భయపడి మళ్లీ ఎలా తిరుగు ప్రయాణం గావించినారో తెలుపుచున్నది.

రెండవది "రాజవ్వ కొడుకు" కథలో రచయిత జీవించిన హాస్టల్ జీవితమును విద్యార్థి దశలో పడిన కష్టాలను ఆత్మకథగా చిత్రించినారు. మూడవది "దొమ్మరి గంగడు" కథలో కొన్ని కులాలు సమాజానికి దూరంగా ఉండి సమాజంచేత ఎలా అవమానించబడుతున్నారో దొంగలుగా, నేరస్తులుగా చిత్రించబడుతున్నారో రచయిత ఎంతో కరుణార్ద్రంగా చిత్రించినారు. నాలుగవది "మావూరి ముచ్చట్లు" కథలో భారతరత్న డా। బాబా సాహెబ్ బి.ఆర్. అంబేద్కర్ దళితుల అభివృద్ధికి పెట్టిన రాజకీయ రిజర్వేషన్ సౌకర్యాన్ని కొందరు స్వార్థపరులు దళితులకు అందకుండా వారిని పెట్టుడు బొమ్మలుగా పెట్టి ఎలా పబ్బం గడుపుకుంటున్నారో గ్రామీణ పరిస్థితిని మన కళ్ళముందుంచారు రచయిత. ఐదవది "పునరావృతం" కథలో అవకాశవాదమును, వరకట్న సమస్యను ప్రస్ఫుటముగా చిత్రీకరించినారు. ఈ కథ జిల్లా స్థాయి అవార్డు పొందడం ముదావాహము. ఆరవది "భలే బామ్మర్ది" కథలో హాస్యభరితమైన రచన గావించుచు బావమరిది సూర్యప్రకాశ్ తన బావ వెంకటేశంను లంచగొండి తనమునుండి విముఖుడగునట్టు నైతిక పరివర్తన తేవడము చక్కగా చిత్రించబడినది. ఏడవది "యమపురిలో ఒకరోజు" కథలో తీవ్రవాదులు పోలీసుల మధ్యన సామాన్యులు ఎలా నలిగిపోతున్నారో అనేక అంశములను సమాజమునకు ప్రభోదించినారు. ఎనిమిదవది "పడగనీడలో పావురాలు" కథలో ఒక పౌరుడు, ఒక రక్షకభటుడు స్నేహితులుగా నుండి సామాజిక భద్రత లేక ఏవిధంగా తమ అసువులను కోల్పోయినారో అద్దం పట్టినట్లు తెలుపుతుంది.

ఈ కథల పుస్తకంలోని ఏనిమిది కథలు రచయిత నేటి సమాజమును ఆకళింపు చేసుకొని వాటినన్నింటిని తమ రచనలో పొందుపరిచి సమాజానికి అందించడం గొప్ప విశేషం. రచయిత నల్లాల లక్ష్మిరాజం రచనలలో మానవతా దృక్పధం, మంచితనము, స్నేహం, ప్రేమ, హాస్యము మున్నగు అంశములు ప్రతిబింబించును. 30 సం ల వయసులోనే సమాజమును బాగా పరికించి, శోధించి తన బాధలను, గాధలను, అనుభవములను, అనుభూతులను అన్నింటిని తమ రచనలలో చక్కగా చిత్రించినారు.

జగిత్యాలలో జరిగిన అనేక కార్యక్రమములో వీరు తమ గేయ రచనలను తానే గానము చేసి వినిపించి అనేక పర్యాయములు శ్రోతలను రంజింపజేసినారనుటలో అతిశయోక్తి లేదు. పోలీసు ఉద్యోగములో నున్నను ప్రజా జీవితమును బాగా అర్థం చేసుకొనిన యువ రచయిత శ్రీ నల్లాల లక్ష్మిరాజం గారు. వీరు ఇంకనూ అనేకానేక గేయ రచనలు కథా రచనలు గావించి పుస్తక రూపంలో సమాజముకు అందించి ఇతోధికంగా సాహితీసేవ చేయుదురని ఆశించుచూ.... సాహిత్యములో ఎంతో ఎత్తుకు ఎదగాలని ఆశీర్వదిస్తూ....

ఈ పుస్తకమును పాఠకలోకము బహుళముగా ఆదరించవలెనని ఆకాక్షించుచూ....

సెలవు.

ముందుమాట

నూతన శతాబ్ది యువ వైతాళికుడు లక్ష్మీరాజం

బి.ఎస్. రాములు
సామాజిక తత్త్వవేత్త

భారతదేశ చరిత్రలో తెలంగాణ ప్రాంతానికి ఒక ప్రత్యేక అస్తిత్వమున్నది. దక్కను పీఠభూమిగా ప్రాచుర్యం పొందిన ఈ ప్రాంతం ప్రకృతి జల సంపదల పరంగా జీవన వైవిధ్యంతో సమతుల్యతతో ప్రపంచంలోనే అరుదైన విశిష్టతను సాధించుకున్నది తెలంగాణాలోని అడవులు పక్షులు జంతుజాలం వాగులు, నదులు, గొలుసు చెఱువులు, గుట్టలు, కొండలు, మట్టిరాళ్ళు అన్ని ఎంతో వైవిధ్యంతో కూడుకొని ఉన్నాయి. ఇవి ఒక మినీ ప్రపంచాన్ని తలపిస్తాయి. రాజకీయంగా రక్షణ పరంగా ఇది సురక్షిత ప్రాంతం కావడం వల్ల ఇక్కడ సుస్థిర పాలనతో కొన్ని శతాబ్దాల పాటు ఆయా రాజవంశాల పరిపాలన కొనసాగడం సాధ్యపడింది.

బౌద్ధం కన్న పూర్వం నుండి ఉన్న తెలాంగులు గాంధార (అఫ్ఘనిస్తాన్) దాక వెళ్ళి ప్రసిద్ధి పొందిన వారు ఉన్నారు. శాతవాహనులు ఒక గిరిజన తెగ నుండి ఎదిగి రాజవంశాన్ని స్థాపించి శాలివాహన శకాన్ని ప్రపంచానికి అందించారు. సిముకుడు అనే రాజు పేరును శ్రీముఖుడుగా సంస్కృతీకరించి చరిత్రను బ్రహ్మణీకరించారు. శాతావాహనులు గిరిజనులని వారికి సంస్కృతం రాదని “మోతాడక్కై” అనే చర్చ చక్కని ఉదాహరణ. ప్రపంచానికి వందలాది గొప్ప కథలను సేకరించి అందించిన గుణాడ్యుడు, హాలుడు శాతవాహన కాలం వారే. గాథాసప్త శతిని సంకలనంగా కూర్చిన హాలుడు స్వయంగా శాతవాహన రాజు కూడా. పాలి భాషలోను, పాకృత గాథల్లోను, ప్రాచీన సాహిత్యంలోను, తెలంగాణ తెలుగు, తెలుగు వారి బతుకు నిక్షిప్తమై ఉన్నాయి. పాల్కురికి సోమనాథుడు, వేములవాడ భీమకవి, బమ్మెర పోతన, కవయిత్రి మొల్ల మొదలుకొని శేషప్ప, భక్త రామదాసు, రామ సింహ కవి దాక ఎందరో మహానుభావులు ఇక్కడ వెలిసారు. మహోజ్వల చరిత్రకలిగిన తెలంగాణ ప్రాంతానిది ఒక ప్రత్యేక జాతి అస్తిత్వం అని కూడా చెప్పవచ్చు. తెలంగాణ సంస్కృతి, చరిత్ర విశిష్టత దీన్నే బలపరుస్తున్నవి. దక్షిణ భారతదేశంలోనే కాకుండా మొత్తం భారతదేశంలోనే తెలంగాణ సంస్కృతికి కొన్ని ప్రత్యేకతలు సాంప్రదాయాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. మాతృదేవత ఆరాధనలో భాగంగా పోచమ్మ, ఎల్లమ్మ, కట్టమైసమ్మ మొదలైన అమ్మ దేవతలు ఇక్కడ

కొలవబడుతున్నారు.

ఇట్టి తెలంగాణ ప్రాంతం తనదైన చరిత్రను సంస్కృతిని మానవ సంబంధాల్ని కథలలో నవలలో నిక్షిప్తం చేయడం జరుగుతున్నది. తెలంగాణ కథలు తెలంగాణ ప్రాంత సామాజిక చరిత్రను తెలిపే కాలనాళికలు. నల్లాల లక్ష్మిరాజం వ్రాసిన కథలు అందులో భాగమే. ఇందులోని ప్రతి కథలో తెలంగాణ ప్రాంత సామాజిక చరిత్ర చిత్రించబడింది. ఈ కథలు చదివినాక తెలంగాణ సమాజంలోని మరికొన్ని కోణాలను మొదటిసారిగా తెలుసుకొన్న అనుభూతి కలుగుతుంది. జీవితమే ఆ ప్రత్యేకతకు కారణం.

నల్లాల లక్ష్మిరాజం ఇప్పుడిప్పుడే కలం పట్టిన కథారచయిత అయినప్పటికి లబ్ధ ప్రతిష్టులయిన కథా రచయితల శైలి, శిల్ప, వస్తు, విన్యాస స్థాయిని అందుకొన్నాడని ఈ కథలు నిరూపిస్తాయి. లక్ష్మిరాజం కథల్లో కాలువ మల్లయ్య, కె.వి. నరేందర్ కథల వలే చక్కని స్పష్టతతో పాటు సుస్పష్టమైన అభివ్యక్తి ఉంది. చెప్పదలుచుకున్న విషయం పట్ల తడబాటు లేనితనం ఇందులో చూడవచ్చు. ఎంతగొప్ప విషయాన్నైనా అలవోకగా వ్రాసే శక్తి సామర్థ్యాలు ఉన్నాయని ఈ కథలు సాక్ష్యం ఇస్తాయి.

నల్లాల లక్ష్మిరాజం కథలు తెలంగాణ గురించి తెలియని వారికి ఒక పరిచయాన్ని అందిస్తాయి. తెలంగాణ గురించి తెలిసిన వారికి ఒక కొత్త కోణాన్ని తెలియజేస్తాయి. తెలంగాణలో జీవిస్తున్న వారికి ఒక కొత్త అనుభూతిని తమ జీవితాలను సాహిత్యకరించిన తీరును చూసుకొని మురిసిపోయి ఆత్మవిశ్వాసం పొందుతారు. ఇందులోని కథలు దళితులకు ఆత్మ విశ్వాసాన్ని, ఆత్మ గౌరవాన్ని పెంచుతాయి.

విషాదాంత కథల రూపంలో చూపే సానుభూతి ద్వారా అమలు అయ్యే హింస ద్వారా తెలంగాణ సమాజం అవమానానికి అల్పత్వ భావనకు, అణచివేతకు గురిచేయబడుతుంది. పాఠకుల్లో ఆత్మవిశ్వాసాన్ని బ్రతుకు పట్ల ఆశను పెంచుతూ బాధితుల పక్షాన నిలబడడం రచయితల కర్తవ్యం, నల్లాల లక్ష్మిరాజం ఆ పనిని ఈ కథల్లో సమర్థవంతంగా చేశాడు.

"తిరుగు ప్రయాణం" కథ విప్లవంగా పిలువబడే ఒక పార్టీ యొక్క వ్యూహం, ఆచరణ తాలూకు మరో పార్శ్వాన్ని చిత్రీకరిస్తుంది. పరస్పర అవిశ్వాసం, భయం, మనుషులను సమాజ పరిణమాలను ఎట్లా అతలకుతలం చేస్తాయో ఈ కథలో చూడవచ్చు. తన పాలేరు కొడుకు నక్సలైట్లలో కలిసాడని దొర, దొర తనను పోలీసులకు పట్టిస్తాడని పాలేరు కొడుకు ఇద్దరు ఊళ్లోంచి పారిపోతారు. గౌరారం సమీపంలో ఒక హోటల్‌లో ఇద్దరు తటస్థపడటంతో కథ ప్రారంభమవుతుంది. కథ ఎత్తుగడ రచయిత చేయి తిరిగినతనాన్ని తెలుపుతుంది. శాంతియుత సహజీవనం ద్వారా శాంతియుత పరివర్తన జరగాల్సిన చిన్న చిన్న విషయాలు కూడా సాయుధ, మిలిటెంటు పోరాటాల వల్ల పరిష్కరించబడకుండా ఘనీభవించి ఇరుపక్షాలు తాము పుట్టి పెరిగిన నేలకు దూరమయ్యారు.

కేవలం ఒక పార్టీ వ్యూహం ఎత్తుగడల పర్యవసనాలను వాటితో సంబంధ లేని వారు కూడా ఎలా అనుభవించాల్సి వస్తుందో ఈ కథలో చూడవచ్చు. ఈ కథలో తెలంగాణ ప్రాంత మూడు దశబ్దాల విషాదం దాగి వుంది. చట్టబద్ద అవకాశాలు సరిగ్గా ఆచరణలో ఉపయోగించుకుంటే సామాజిక ఉద్యమాలు లేవనెత్తిన సమస్యలు ఇంత జటిలమై ఉండేవికావు అనికూడ గుర్తించవలసి ఉంది.

"రాజవ్వ కొడుకు" కథ పేరులోనే ఒక ప్రత్యేకతను సూచిస్తున్న కథ. తన పిల్లలను చదివించుకోవాలని తల్లి పడే తపన ఇందులో చూడవచ్చు. రాజవ్వ కొడుకు కథ ప్రతి ఎస్.సి. ఇంటా ఎప్పుడో ఒకప్పుడు జరిగిన కథే. బడుగు వర్గాల చదువులను దొరలు, రెడ్లు ఎన్ని రకాలుగా అడ్డుకొనేవారో ఈ కథలో మనకు ప్రత్యక్షమవుతుంది. తల్లిదండ్రుల బానిస బుద్దులు నిస్సహాయత దొరల, రెడ్ల పెత్తనాన్ని ఎట్లా కొనసాగింపచేస్తాయో ఈ కథలో చూడవచ్చు. "కిర్రు చెప్పులు" కథల సంపుటి ఫేం, యువ రచయిత దార్ల రాంచంద్ర ఇట్లా పాలేరుగా పనిచేసి కాలు విరగ్గొట్టుకోవలసి వచ్చింది. అతనిప్పుడు లెక్చరర్ అయినప్పటికినీ ఆ అవిటితనం గతానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచేవుంది.

అన్ని కష్టాల్లోను ఎలాగోలా ఈదుకుంటూ వచ్చి చదువుకొని చైతన్యవంతుడైన దేవయ్య సర్పంచ్‌గా ఎదిగి అందరి మన్ననలు పొందే క్రమం రాజవ్వ కొడుకు కథలో కనబడుతుంది. ప్రభుత్వ సాంఘీక సంక్షేమ హాస్టల్లు దళితులకు ఎంత గొప్పగా వెలుగునిచ్చాయో ఈ కథ చెప్పకయే చెబుతుంది. దార్ల రాంచంద్ర, నల్లాల లక్ష్మీరాజం, ప్రఖ్యాత కవులు గూడ అంజయ్య, గోరటి వెంకన్న మొదలైన వారెందరో ప్రభుత్వ సాంఘీక సంక్షేమ హాస్టళ్ళలో పెరిగి ఎదిగినవారే. ఇలా రాజవ్వ కొడుకు కథ వేలాది దళితుల ఆత్మకథలకు ఒక ప్రతీక. బాపురెడ్డి కూతురు పద్మ దేవయ్య వ్యక్తిత్వాన్ని చూసి మురిసిపోయి "అవును ఆంటీ! ఇంత గొప్ప మేధావి, వక్త మన గ్రామంలోనే ఉండంగా మరి మా మమ్మీ, డాడీ నాకు ఎక్కడెక్కడో సంబంధాలు వెదుకుతుండ్రు అనవసరంగా అంటూ ముసిముసి నవ్వింది పద్మ" కథలోని ఈ కొసమెరుపు వల్ల ఇది దళిత సోషలిస్టు వాస్తవిక కథగా మారింది. కాలక్రమంలో వర్గ వైరుధ్యాలను సమాజం ఎట్లా పరిష్కరించుకుంటుందో, ఎలా పరిష్కరించుకోవాలో ఈ కథ అద్భుతంగా, సహజంగా చిత్రీకరిస్తుంది.

శంఖంలో పోస్తేనే తీర్థం అయినట్లు సమాజంలో కులరీత్యా, అధికారరీత్యా, ఆధిపత్యంలో ఉన్నవాల్లదే సరైన దృష్టిగా చలామణిలో ఉంటుంది. పై వాళ్ళు మెచ్చుకోవాలనే తపనలో కూడా ఇదే ఉంటుంది. పల్లెల్లో దొరలకు, రెడ్లకు ఏది చేస్తే ఇష్టమో, అది చేసి తమనుతాము కుదించుకొని వారి మెప్పు పొందాలని చూస్తారు.

అందుకే రాజవ్వకొడుకు కథలో పెద్ద కొడుకులు ఇద్దర్ని పటేండ్లు పనిమంతులని మెచ్చుకుంటుంటే, తన పేరు నిలబెట్టే కొడుకులని ఉప్పొంగిపోతాడు రాజనర్సయ్య.

రచయితే స్పష్టంగా చెప్పినట్టు "ఇతర కులస్థులు కూడా దొరలు, పటేండ్లు మంచివారు అంటే మంచివారు, చెడ్డవారు అంటే చెడ్డవారు అని నమ్ముతారు. అధికారం, సాంఘిక హోదా, ఏ నిర్బంధం లేకుండానే తమకనుకూలంగా సమాజాన్ని శాసిస్తూ అణిచివేస్తుందో దీనిలో గమనించవచ్చు.

అందుకే అధికారం కోసం పెద్ద దొరల స్థానాన్ని ఆక్రమించాలని మోతుబరి రెడ్డీలు దొరల కన్నా హీనంగా ప్రవర్తించడం సర్వసాధారణమైంది. దొరలకు తీసిపోకుండా తాము కూడా సాగించుకోవాలని ఈ కొత్త దొరలు, కొత్త పటేండ్లు ఎంత క్రూరంగా ప్రవర్తిస్తారో తిరుగు ప్రయాణం కథలోని రామిరెడ్డి, రాజవ్వ కొడుకు కథలోని సర్పంచ్ బాపురెడ్డి పాత్రల్లో గమనించవచ్చు. ఐనప్పటికిని బాపురెడ్డి కూతురు పద్మ, రాజేశ్వర్‌రావు దొర మనవరాలు భారతి ఆలోచించే తీరు స్త్రీలకు కులం లేదు అన్న అంబేద్కర్ విశ్లేషణను గుర్తుకు తెస్తుంది. ఈ కథ సమాజంలోని విభిన్న పార్శ్వాలను చిత్రించాయి. దక్షిణ భారతదేశంలోని తెలంగాణా ప్రాంత సమాజ పరిణామాలను ఎనిమిది కథల్లో ఎన్నో పుస్తకాలలో చదివినంత సారాంశాన్ని అందించారు రచయిత నల్లాల లక్ష్మిరాజం.

బ్రిటీష్ ప్రభుత్వం ఆహార సేకరణ దశనుండి స్థిర వ్యవసాయం దశకు మారకుండ రకరకాల వృత్తుల్లో మిగిలిపోయిన తెగలు, కులాల వారిని నేరస్థ జాతులుగా (క్రిమినల్ ట్రైబ్స్) వర్గీకరించి సమాజంలోని అన్ని దోపిడీలకు, దౌర్జన్యాలకు వాళ్ళే కారకులని లక్షలాది మందిని హింసించారు, చంపారు, జైలులోకి నెట్టారు. దొంగతనమే వృత్తిగా గల వాల్మీకి మహాకవి అయ్యాడు. ఒక దొంగ మహాకవిగా ఎదిగే అవకాశాలు ఆనాడు ఉండడం ఒక గొప్ప విషయం. కాని ఇవాళ ఇంట్లో ఏది పోయినా పని మనుషుల్నే అనుమానించడం, ఎక్కడ దొంగతనం జరిగినా వడ్డెర, ఎరుకలి, దొమ్మరి వారిని పట్టుకొచ్చి కొట్టడం, జైల్లోకి నెట్టడం రివాజుగా మారింది. ఇలాంటి కులంలో పుట్టి దొంగగా ముద్ర వేయబడి, ఎలాగోలా ఎదిగి "ఉచల్యా" అనే పేరుతో ఆత్మకథను నవలగా వ్రాసిన మహా రచయిత లక్ష్మణ్ గైక్వాడ్. అది తెలంగాణా ప్రజల జీవితమే, మరాఠీ సాహిత్యంలో మణిపూసగా వెలువడింది. "దొమ్మరి గంగడు" కథ పోలీసులు, ప్రభుత్వం కలిసి మంచివాళ్ళను ఎలా దొంగలుగా మారుస్తారో తెలుపుతుంది. దొమ్మరి గంగడికి ముగ్గురు బిడ్డలు, ఒక కొడుకు. పెద్ద బిడ్డ సరోజ వ్యభిచార వృత్తి చేయనని మారాం చేస్తే గంగడు తిట్టి కొట్టి "దందా"లోకి దించినాడు. కొన్నాళ్ళకు సరోజ ఎయిడ్స్ రోగంతో మరణించింది. రెండో కూతురు అయిన లత లారీ డ్రైవరుతో లేచిపోయింది. ఇలాంటి గంగడు పోలీసుల బాధ పడలేక పొరుగూరిలో ఉన్న బంధువుల దగ్గర ఇరవైవేలు అప్పు తీసుకొని ముట్టజెప్పిండు. పోలీసులు ఆ రూపాయలతో బంగారం కొనిపించి గంగడి మీదే కేసు పెట్టి జైలుకు పంపింద్రు. కొన్ని కులాలు వ్యభిచారమే కులవృత్తిగా కొనసాగడం కుల వ్యవస్థలో ఒక విషాద భారతం. నిజానికి దొమ్మరి విద్యలు ఒలంపిక్స్ క్రీడల కన్నా ఏమాత్రం తీసిపోవు కాని సామాజిక గౌరవం ఇవ్వకపోవడం వల్ల కూడులేని వారయ్యారు నీడలేని

వారయ్యారు. ఆ దొమ్మరి విద్యలు కూడా నశిస్తున్నాయి.

పీడితుల బ్రతుకుల గురించి రావిశాస్త్రి కొన్ని కథలు వ్రాశారు. కాని ఆయన వ్రాసిన కథలు జీవితాన్ని చిత్రించినట్లు ఉండవు వ్యవస్థని ప్రశ్నించినట్లు ఉంటాయి. ఇవాళ దళితుల నుండి క్రొత్త రచయితల తరం ఎదిగి వ్యవస్థను ప్రశ్నించడం కన్నా ముందు సమస్యను, జీవితాన్ని పట్టించుకొని కరుణార్ద్రంగా చిత్రించి మనసు కరిగించడం అవసరం అని బౌద్ధ అలంకార శాస్త్రాన్ని స్వీకరిస్తున్నారు. దొమ్మరి గంగడు లాంటి హృదయ విదారక విషాదాంతాలు జీవితమంత వాస్తవం. ఇలాంటి కథ రాయడానికి జీవితం తెలియడం సరిపోదు. ఎంతో ధైర్యం ఉంటే తప్ప రచయితలు ఇలాంటి కథలు రాయడం సాధ్యపడదు.

పల్లెల్లో జ్ఞానం, విజ్ఞానం, సంస్కృతి, చరిత్ర, మానవ సంబంధాలు ఉండాల్సిన తీరుతెన్నుల్ని ముచ్చట్ల రూపంలో ఒకరినుండి మరొకరికి కొనసాగుతూ ఉంటాయి. మౌఖికమైన ఈ ప్రక్రియ వేల ఏళ్ళుగా అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ వస్తున్నాయి. అందుకే ముచ్చట్లు అంటే పల్లెల్లో చెవి కోసుకుంటారు. “మా వూరు ముచ్చట్లు” అనే కథ ప్రతి వూరి చరిత్రని తెలియజేస్తుంది. కూలాలకతీతంగా కులాధిపత్యానికి అనువుగా అక్రమ లైంగిక సంబంధాలు పల్లెల్లో ఇప్పటికీ ఎలా కొనసాగుతున్నాయో మావూరు ముచ్చట్లు కథలో చూడవచ్చు. అక్రమ లైంగిక సంబంధాల కారణంగా జీవితంలో ఎగుడు దిగుడులు ఎలా ఏర్పడుతాయో ఈ కథలో రచయిత చక్కగా చిత్రించాడు.

పల్లెలు ప్రశాంతంగా, స్వచ్ఛంగా ఉంటాయి అని అనుకునే వాళ్ళు లోకంలో తక్కువేమి లేరు. పల్లెల్లో అసూయ, ద్వేషం, పగ, నీచబుద్ధులు ఎలా వుంటాయో ప్రేమ్‌చంద్ వందేళ్ళ క్రితమే కథల్లో నవలల్లో చిత్రించాడు. అయినప్పటికి దూరపు కొండలు నునుపు. పల్లెలకు దూరంగా బ్రతికేవాల్లు పల్లెల్ని ఆదర్శీకరిస్తారు. నరవర్గశాస్త్రం (ఆంత్రోపాలజీ), సామాజిక శాస్త్రం, చరిత్ర ఈ దేశంలో ఏ కులము, జాతీ సంకరం కాకుండా పవిత్రంగా లేవు అని నిర్ధారించాయి. అనగా వైవాహికేతర లైంగిక సంబంధాలు, వివాహ సంబంధాల కన్నా బలంగా రక్త సంబంధాలను, సంతానాన్ని ప్రభావితం చేస్తున్నాయని అర్థం. మిడిమిడి జ్ఞానం గల మధ్య తరగతి వాళ్ళు ఇలాంటివి విని గుండెలు బాదుకుంటారు. తన భార్య లేక తన భర్త కూడా ఇంతే సంగతులా అని అనుమాన పక్షులై కలహాలు పెంచుకుంటారు. పల్లెల్లో అక్రమ లైంగిక సంబంధాలు ఎంత బాహాటంగా కొనసాగుతుంటాయో “మావూరి ముచ్చట్లు” కథలో ఎంతో సహజంగా మన ముందుంచుతుంది. పేద కులాలకు, ధనిక కులాలకు మధ్య జరిగే అక్రమ సంబంధాలు కేవలం “లైంగిక దోపిడి” గా ముద్రేసి చూడటం, సమస్య లోతుల్లోకి వెళ్ళకపోవడమే. నేను “మెరుగు” కథలో “తెల్లబట్ట” కథలో వైవాహికేతర లైంగిక సంబంధాలు జీవితంలోని మిగతా పార్శ్వాల్లో ఎలా పాజిటివ్‌గా ప్రభావితం చేస్తాయో చిత్రించాను. చలం “దోషగుణం” కథలో నెగిటివ్ ప్రభావాన్ని చిత్రించాడు. మెరుగు, తెల్లబట్ట కథలు చదివాక

లక్ష్మిరాజంకు ధైర్యం వచ్చింది. మూవూరి ముచ్చట్లు రాయాల్నా సార్ అని అడిగాడు. సామాజిక చరిత్రను రికార్డు చేయడం రచయిత కర్తవ్యం అని చెప్పాను. నాకు ఆ జీవితాలు తెలుసుకాని, వాటిని దళితుల్లోంచి ఎదుగుతున్న లక్ష్మిరాజం రాయడమే కరెక్టు. లక్ష్మిరాజం నాకన్న ఒక అడుగు ముందుకేసాడు. అక్రమ సంబంధాల సామాజిక పరిణామాల్ని చిత్రించాడు. స్త్రీ అక్రమ సంబంధం పెట్టుకుంటే మొత్తం తమ కులం పరువే పోతున్నట్టు మొత్తం కులమంతా అవమానానికి గురవడంఎలా జరుగుతుందో ఈ కథలో చూడవచ్చు. అయితే అక్రమ సంబంధానికి భర్త అంగీకారం కూడా ఉందని తెలిస్తే ఏం చేయడం! మద్రాసు ప్రావిన్సులోని తెలుగువాళ్లలో అక్రమ సంబంధాలెక్కువ అని, లూజు క్యారెక్టర్ అని, డబ్బుకోసం ఏ పనైనా చేస్తారని నైజాం ప్రావిన్సులోని తెలుగువాళ్ళు ఏకసెక్కెం చేస్తుంటారు. కాని నైజాం ప్రాంతం అందుకు భిన్నమేమి కాదని "మావూరి ముచ్చట్లు" కథ స్పష్టం చేస్తుంది. వర్గం, కులం రీత్యా గల ఆధిక్యత అక్రమ సంబంధాలకిచ్చే విలువలు వేర్వేరు అని కూడా ఈ కథ చిత్రించింది.

"మా చిల్లర కులంలోనే అనుకున్నా, వీళ్ళదాంట్లో కూడా... మరి శాంతమ్మ, చుక్కరెడ్డి అక్రమ సంబంధం గురించి ఊరందరికి తెలిసి ముచ్చట్లు పెట్టుకున్నట్టు చుక్కరెడ్డి భార్య మంగవ్వ పాలేరు బుచ్చన్నతో పెట్టుకున్న సంబంధం ఎందుకు బయటకు పొక్కలేదు? ఒకవేళ తెలిసినా ముచ్చట్లు పెట్టుకోవడానికి జనం భయపడ్డారా? ఏమైనా పెద్దోల్లు పెద్దోల్లే, చిన్నోల్లు చిన్నోల్లే. పెద్ద కులపోల్లు తప్పు చేసినా గాని గౌరవించబడతారు. చిన్నకులపోల్లు తప్పు చేస్తేనేమో చులకనవుతారు. ఇందులోని మతులబు ఏమిటో అర్థమై చావదు" అనుకుంటాడు ఇందులో పాలేరు. ఏ కులం కూడా వేల ఏళ్ళుగా ఎందుకు పవిత్రంగా లేదో, ఉండడం ఎందుకు సాధ్యం కాలేదో ఈ కథ ద్వారా అర్థం చేసుకోవచ్చు. అగ్రకులం స్త్రీ మాల మాదిగలతో లేచిపోతే అదొక వార్త అవుతుంది. "ఔనవ్వ మా మాలమాదిగోల్లం తప్ప అందరూ సక్కటిపూసలే, రంకు నేర్చి బొంకనేర్చుడు అందరికీ చేతనవుద్దా! ఏ కులంలోనైనా మంచోల్లు ఉన్నారు, చెడ్డోల్లు ఉన్నారు. కులం పేరు పెట్టి తిట్టుడెందుకవ్వ" అని అన్నాడు పాలేరు.

అక్రమ సంబంధం పెట్టుకున్న చుక్కరెడ్డి శాంతమ్మల కూతురు, కొడుకు కలిసి లేచిపోవడం కథలో కొసమెరుపు. ఇది అగ్రకుల యువకులు మోసం చేస్తారని రాసిన దళిత ప్రేమ కథలకు భిన్నమైన వాస్తవ జీవితం. వాళ్ళు అందులో వాదానికి అనువుగా జీవితాన్ని చిత్రిస్తే, ఇందులో జీవితం యధాతథంగా చిత్రించబడింది.

"ఎనిమిది రోజులకు తెలిసింది మా శంకరిగాడు, రజితవ్వ (చుక్కారెడ్డి కూతురు) కోర్టులో పెండ్లి చేసుకున్నారని. మళ్ళ మావూరు జనం ముచ్చట్లకు మూతులు చాపింద్రు" చలం బ్రాహ్మణ స్త్రీలను ముస్లీంలు లేపుకుపోయినట్లు రాసాడు. దళితులు అగ్రకుల స్త్రీలు కలిసి పెళ్లి చేసుకోవాలని లక్ష్మిరాజం ఆశయం. ఇది అంబేద్కర్ కుల నిర్మూలన ఆశయాల్లో ఒకటి. అంబేద్కర్ వారసుడుగా రచయిత రాజవ్వ కొడుకు కథలోను, మావూరి

ముచ్చట్లు కథలోనూ అదే ఆశిస్తాడు. కొడవగంటి కుటుంబరావు "పార్వతి పరిణయం" కథలోనూ, రంగనాయకమ్మ "బలిపీఠం" నవలలోనూ "మా కులం పిల్లని చేసుకుంటే మీకే కష్టం" అని చిత్రించారు. ఇవ్వాళ్ల దళిత రచయితలు దాన్ని తిరగేసి మీ కులం పిల్లలు మా కులం మగ పిల్లల్ని చేసుకుంటే ఎంతో సుఖపడతారు అని చెప్తున్నారు.

కుల పరిమితులు అధిగమిస్తే తక్కువ కట్నంతో కింది కులాల డాక్టర్లు, ఇంజనీర్లు, అధికార్లను అల్లుళ్ళుగా చేసుకోవచ్చు. తద్వారా సొంత కులంలో కూడా పిల్లలు దొరక్క కట్నాల రేటు పడిపోతుంది. ఒకదశలో కన్యాశుల్కం కూడా ఇవ్వాల్సి రావచ్చు. వరకట్నం సమస్యకు ప్రధాన కారణం కులం పరిమితుల్లోనే పెళ్లి చేయాలనుకోవడం లోనే ఉంది. అందువల్లనే ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఈ దేశంలో వరకట్నం సమస్య బాధిస్తున్నది. దీనికి పరిష్కారం కులాంతర వివాహాలే.

ఇందులోని కథలు మధ్య తరగతికి మింగుడు పడవు. ఇవి మధ్య తరగతి సంస్కృతికి భిన్నమైనవి. అట్టడుగు కులాలు తమ యధార్థ జీవితాల్ని సమాజం ముందు పరిచి దానికి సామాజిక గౌరవం, సాహిత్య గౌరవం సాధించాలనే తపన ఈ కథల్లో కనబడుతుంది. మధ్య తరగతి సంస్కృతిలో ఇవన్నీ అంతర్భాగమైనప్పటికినీ కూడా వీటిని గుర్తించడానికి, గుర్తించినా గౌరవించి సాహిత్యీకరించడానికి నిరాకరిస్తుంది. అందువల్ల దోపిడికుల మధ్య తరగతి మనస్తత్వం కలవాళ్ళు ఇలాంటి కథల్ని రాయలేరు. సహృదయతతో స్వీకరించలేరు.

అలాగే ఇందులోని "తిరుగు ప్రయాణం" , "యమపురిలో ఒకరోజు", "పడగనీడలో పావురాలు" కథల్ని విప్లవం అనబడేదాన్ని దూరంనుంచి ఒకేఒక పార్టీ కళ్లద్దాలతో చూసే విప్లవ రచయితలు వ్రాయలేరు. ఇవి ప్రజల్ని నిజంగా ప్రేమించే రచయితలే రాయగల కథలు. ఏ ప్రజల్నించి పుట్టారో, ఆ ప్రజల్ని సొంతం చేసుకొని వారి హృదయాల్ని ఆవిష్కరించే వాళ్ళే ఇలాంటి కథలు వ్రాయడం సాధ్యం. నల్లాల లక్ష్మిరాజం స్వాతంత్ర్యానంతరం నడిచిన చరిత్రను కథల రూపంలో తిరగరాస్తున్న ప్రజా రచయిత. నడవాల్సిన చరిత్రకు మార్గదర్శనం చేస్తున్న సామాజిక స్పృహ కలిగిన రచయిత. ఇదెలా సాధ్యపడింది ? నల్లాల లక్ష్మిరాజం ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్లో చదువుకొని పెరిగినవాడు. వాళ్ల ఊర్లో దళితుల్లో తొలి అక్షరాస్యుడు. జగిత్యాలకు 10 కి.మీ. దూరంలో ఉన్న తక్కళ్ళపెల్లి గ్రామంలో 5-10-1970 లో నిరుపేద దళిత కుటుంబంలో జన్మించాడు. డిగ్రీ చదువు తోనే ఆగిపోయాడు. తొలితరం అక్షరాస్యులెదుర్కొనే ఈతి బాధలన్ని లక్ష్మిరాజం కూడా అనుభవించక తప్పలేదు. 1985 నుండి అంబేద్కర్ యువజన సంఘం నిర్మాణంలో చురుకుగా పాల్గొనడం ద్వారా సామాజిక వ్యక్తిత్వాన్ని సంతరించుకున్నాడు. తన చుట్టూ జరుగుతున్న చరిత్రకు ప్రత్యక్ష సాక్షి, పాత్రధారి కూడా. అందువల్లే తొలి దశలోనే ఇలాంటి మంచి కథలు రాయగలిగాడు.

"పునరావృతం" కథ కేవలం కట్నం సమస్య కథ కాదు. నాకు తెలిసిన ఒకరిద్దరు

మిత్రులు కట్నం లేకుండానే పెళ్లి చేసుకున్నారు. పాతికేళ్ళ తరువాత వాళ్ళ పిల్లలకు కట్నాలిచ్చి పెళ్లిళ్ళు చేయక తప్పలేదు. వెనకటికి ఇప్పటికీ సమాజం ముందుకు పోతున్నదో, వెనక్కి పోతున్నదో అర్థం కావడం లేదు. ఎందుకు అర్థం కావడం లేదు కాని భౌతిక సంపాదన పట్ల పెరిగిన వ్యామోహం సమస్త విలువల్ని నిర్దేశిస్తున్నది. రూపుమాపుతున్నది. "పునరావృతం" కథ వరకట్నం సమస్యని అతి సరళంగా, సూటిగా చెప్పిన చక్కని కథ.

"భలే బామ్మర్ది" కథ రచయిత హాస్యధోరణి చిత్రణకు పరాకాష్ట. ఇందులో అద్భుతమైన శిల్ప విన్యాసం ఉంది. ఒక సీరియస్ విషయాన్ని అతి తేలికగా విప్పి చెప్పి పరిష్కరించడం ఈ కథలోని ప్రత్యేకత.

జీవితాన్ని అధ్యయనం చేయడం తగ్గించి సిద్ధాంత దృక్పథంతో రాయడానికి పరిమితమైన కథకులు ఎందరో ఉన్నారు. ఇలాంటి వారి కథల్లో వస్తు వైవిధ్యం, ఎత్తుగడ అనేక పరిమితులకు లోనై కొన్ని మూసలుగా తయారవడం చూస్తున్నాము. బహుజన కథలు జీవితం ప్రాథమికంగా రాయబడుతున్నాయి. అందువల్ల వాటి వస్తు వైవిధ్యానికి ఎత్తుగడల శిల్ప విన్యాసానికి ఎల్లలు లేవు. ఉద్యమ ప్రాంతాల ప్రజల జీవితాల్ని అత్యద్భుతమైన శిల్ప విన్యాసాలతో ఎత్తుగడలతో చిత్రించిన రచయితలు ఎందరో ఉన్నారు. వాళ్ళు ఏ సంఘాల గొడుగుల క్రింద లేకపోవడం వల్లనేమో ఉద్యమ సాహిత్యం కాని సాహిత్య విమర్శకులు గాని వాటి గొప్పతనాన్ని పట్టించుకోలేక పోయారు. కాలువ మల్లయ్య రాసిన చిన్న దొరసాని, ముగ్గురు మిత్రులు..., కె.వి. నరేందర్ రాసిన చిగురుటాకు, డోర్ డెలివరి, దొరుంచుకున్న దేవక్క, పేదోడి గడి, దొరమల్లచ్చిందు మొదలైన కథలు అద్భుతమైన ఉద్యమ పరిణామ కథలు. కె.వి. నరేందర్ రాసిన చిగురుటాకు కథ వలె యమపురిలో ఒక రోజు కథ ఒక మూల నుండి వెలుగు ప్రసరిస్తున్నట్లుగా కథ ప్రారంభమై మొత్తం సామాజిక జీవితం వెలుగు పరుచుకుంటుంది. నక్సలైట్ల పేరిట ఎంతమంది అమాయకులు బలి అవుతున్నారో ఈ కథలో చూడవచ్చు.

"పడగ నీడలో పావురాలు" కథ ఎవరికోసం ఎవరు చస్తున్నారో ! ఎందుకు చంపబడుతున్నారో! కారణాలు తెలియని, తెలియనివ్వని దోపిడి వ్యవస్థ సృష్టించిన మారణహోమాన్ని చిత్రిస్తుంది. సౌదా "నల్లగుర్రపు నాడా" కథలో దేశరక్షణ పేరిట సరిహద్దుల్లో చనిపోతున్నది ఎందుకో ఎవరికోసమో ఒక అద్భుతమైన విశ్లేషణ ఇచ్చాడు. కాలువ మల్లయ్య ముగ్గురు మిత్రులు కథలో చిన్ననాటి నుండి స్నేహితులైన వాళ్లు రైతు, పోలీసు, నక్సలైటుగా కాల పరిణామాల్ని బట్టి మారిన తీరును చూపించారు. ఈ ముగ్గురు చివరకు హత్య చేయబడతారు. ఉద్యమం పేరిట ఒక పార్టీ తెచ్చిన ఇలాంటి పరిణామాల్ని పొట్టకూటికై పోలీసు ఉద్యోగంలో చేరిన వాళ్ళ బతుకుల్ని వారిలోని మంచి తనాన్ని వెలికితీసి వ్రాసిన కథ "పడగ నీడలో పావురాలు".

స్పార్టకస్ "ఖాకీ బతుకులు" నవలలో వందేళ్ళ పోలీసు జీవితాలను కళ్ళకు కట్టినట్లు చిత్రించినారు. ఈ కథలో ఏదో ఒక ఉద్యోగం మనసున్న మనిషి పోలీసుగా

మారిన తర్వాత తన ప్రమేయం లేకుండానే బలైపోతున్న తీరుని చిత్రిస్తుంది. చనిపోతున్న పోలీసుల పట్ల ఎంతో ఆర్ద్రత ఉంటే తప్ప కథల్ని వ్రాయడం సాధ్యం కాదు. స్వయంగా వృత్తి రీత్యా పోలీసు కావడం వల్ల ఈ కథను వ్రాయగలిగాడు. రచయిత. ఇరువైపులా చనిపోతున్నది పొట్టకూటి కోసం ఆరాటపడుతున్న వాళ్లే కావడం ఒక చారిత్రక విషాదం. "యమపురిలో ఒక రోజు" కథ తెలంగాణా జీవితాల్లోని వాస్తవ నిర్బంధ పరిస్థితిని చిత్రిస్తుంది. ఎందరో అమాయకులు విప్లవ సానుభూతిపరుల పేరిట చిత్రహింసలకు, ఎన్‌కౌంటర్లకు గురవుతున్నారు. దీని గురించి ఎన్నో కథలు వచ్చాయి. కానీ లక్ష్మిరాజం కథ ఎత్తుగడలోనే ఒక విశిష్టత ఉంది. కథను నడిపించిన తీరు విప్లవ కథల్ని ఇట్లా కూడా రాయవచ్చా అని ఆశ్చర్యచకితులను చేస్తుంది.

దళిత సాహిత్యం విస్తరించాక విప్లవ సాహిత్య వేత్తల రూపంలో అణిచివేత కొనసాగుతున్నది. ప్రజల గురించి ప్రజల పక్షం వహించి రాసే కర్తవ్యంలో భాగంగా విప్లవ ప్రాంతాల ప్రజల్లోని ఆటుపోట్ల గురించి రాస్తున్న కథల్ని కావాలని సాహిత్య సమీక్షలల్లో, సాహిత్య చరిత్రలో వదిలివేస్తున్నారు. సాహిత్య చరిత్రను వాళ్ళ తాత జాగిరనుకుంటున్నారు. వాళ్లు రాసిందే సాహిత్య చరిత్ర అని భ్రమింపజేసే ప్రయత్నం చేస్తున్నారు. అరసం, విరసం వారికి ఈ విషయంలో ఎన్నో సార్లు చెప్పినప్పటికి వారి దృష్టి వైశాల్యం పెంచుకోకుండా సాహిత్య క్షేత్రంలో మూర్ఖులుగా ప్రవర్తిస్తున్నారు. సత్యాలను జీర్ణించుకోలేని ఇలాంటి మూర్ఖులు సాహిత్య చరిత్ర రాయడం మానేస్తే మంచిది. సత్య నిర్ధారణకు ప్రజల్లోకి వెళ్లకుండా ధూర్తంగా మందబలాన్ని, పదవులను ఆసరా చేసుకొని బతుకుతున్న శవాలను పూడ్చిపెట్టి సాహిత్య చరిత్రను సమగ్రంగా రాసే కర్తవ్యాన్ని బహుజన యువతరం ముందుకు తీసుకెళ్ళాల్సి ఉంది.

ఇందుకోసమే తెలంగాణా కథా రచయితల వేదిక ఏర్పడింది. తెలంగాణా లోని సమస్త పరిణామాల్ని చిత్రించే వారికి ఇందులో స్థానం ఉంది. దీన్ని ఏర్పాటు చేయడంలో కూడా లక్ష్మిరాజం క్రియాశీలంగా పాల్గొన్నాడు. నేను విశాల సాహిత్య అకాడమి తరపున కథా పురస్కారాలు, జన్మదిన ఉత్సవాలు నిర్వయిస్తే కొందరు మహానుబావులకది కీర్తికాంక్షలా కనపడింది. ఇరవై ఏళ్ళనుండి విప్లవం గురించి జగిత్యాల జైత్రయాత్ర గురించి ఊదరగొడుతూ ఒక్కనాడైన ఇక్కడి పల్లెల్ని దర్శించకుండా, వాస్తవ పరిస్థితుల్ని తెలుసుకోకుండా తమ అజ్ఞానాన్ని అహంకారంగా ప్రదర్శించుకుంటారు కొందరు. అలాంటి చెట్టుపేరు చెప్పుకొని కాయలమ్ముకొనే కుహనా విప్లవ రచయితలు, సమీక్షకులు, సానుభూతిపరులే బి.ఎస్. రాములుకు కీర్తికాంక్ష అని అంటారు. తక్కువ అంచనా వేయడం నుండి కూడా "కీర్తికాంక్ష" అనడం సాధ్యపడుతుంది. శ్రీశ్రీ షష్టిపూర్తి జన్మ దినోత్సవం సందర్భంగా విరసం పుట్టిందని చెప్పుకునేవాళ్లకు సిగ్గులేకపోగా ఇతరుల జన్మదినాలను కించపరచడం వాళ్ళ దురహంకారానికి నిదర్శనం. ఒక సామాజిక ఉద్యమాన్ని నిర్మించే నక్సలైట్ల రచయితల సంఘానికి శ్రీశ్రీ జన్మదినం తప్ప మరో

సందర్భమే లేదా ? బి.ఎస్. రాములు జన్మదినం సాహిత్య సృజనకు ఒక సందర్భం కావడం హర్షించవలసింది పోయి విమర్శించడంలో ఉన్నదేమిటి? అసూయ, ద్వేషం కాదా! విప్లవంలో పని చేయకుండానే విప్లవంలో పనిచేసి వచ్చిన వారు ఎదుర్కొనే ఆటుపోట్ల పట్ల సానుభూతి లేకుండా మనిషిగా, రచయితగా నిలదొక్కుకోవడానికి సహకరించనివారే ఇలా మాట్లాడతారు. ఒక్క మీటింగైనా పెట్టని, పెట్టలేని ప్రాంతాల్లో మీటింగులు పెట్టి సాహిత్య వాతావరణం సృష్టించి, సాహిత్యకారులను ఎదిగించడం కోసమే జన్మదినం పేర విశాల సాహితి పేర మహాసభలు నిర్వహించడం జరుగుతున్నదని వచ్చిన వారందరికి తెలుసు. ఏమి రాయకుండానే ఖండనమండన ప్రకటనలతోనే రచయితలుగా పేరు పొందిన దుర్గతిలో కూరుకుపోయినవాళ్ళు ఇతరులను కీర్తికాంక్ష పరులనడమే ఆశ్చర్యం. ఈ రోత అలవాటు మాన్పించడం కోసమే దరకమే ఐక్యవేదిక తన రచనల ద్వారా, కార్యకలాపాల ద్వారా ప్రజల్లోకి వెళ్ళాలని ఆయా సంఘటనల పై ఖండనమండన ప్రకటనలతో "కీర్తి దురద" గాళ్ళుగా మారొద్దని తీర్మానం చేసి ఆచరిస్తున్నది. విశాల సాహితి బి.ఎస్. రాములు జన్మదినం సభల ద్వారా ఈ ప్రాంతం నుండి యాభై మందికి పైగా రచయితలు కళాకారులు ఎదిగారు. వారిలో నల్లాల లక్ష్మీరాజం ఒకరు. అలాగే నేను రాసిన "కథల బడి కథా సాహిత్య అలంకార శాస్త్రం" ద్వారా లక్ష్మీరాజంతో పాటు 120 మంది కథకులు ఎదగడంలో క్రియాశీల పాత్ర నిర్వహించిందని గుర్తు చేయడం అసందర్భం కాదనుకుంటాను.

నిర్బంధం లేకుండా అన్ని విధాల జయప్రదమై అందరిలో సాహిత్య పిపాస పెంచడం కోసం విశాల సాహితి సాహిత్య సభలకు "బి.ఎస్. రాములు జన్మదినం" అనే పేరుంచడం జరిగింది. ఇవి స్థానిక టి.వి.ల్లో ప్రత్యక్ష ప్రసారమయ్యాయి. వేలాది ప్రజలు రక్త తర్పణలతో నిర్బంధాలనెదుర్కొంటూ చరిత్ర సృష్టించిన సామాజిక ఉద్యమాలను కొండపల్లి సీతారామయ్య గ్రూపు, సత్యమూర్తి గ్రూపు, దేవులపల్లి వెంకటేశ్వరరావు గ్రూపు, పుల్లారెడ్డి గ్రూపు, రాజన్న గ్రూపు, రాధక్క గ్రూపు అని వ్యక్తుల పేర్లతో పిలిచిన చరిత్రను ఆమోదించిన రచయితలు, మేధావులు వారి మెదడు మోకాల్లో ఉండకపోతే బి.ఎస్. రాములు జన్మదినం పేరిట చేసే సామాజిక సాహిత్య కృషిని కించపరచడం కీర్తికాంక్ష అనడం ఎలా సాధ్యం? బి.ఎస్.రాములు వ్యక్తిసభ పేర సామాజిక సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తే విప్లవ పార్టీలు లక్షలాది ప్రజల సామాజిక కృషిని వ్యక్తులదని వ్యక్తుల పేరుకు కుదించారు. ఇందులో ఎవరిది కీర్తికాంక్ష? మొత్తం సమిష్టి ప్రజల కృషిని వ్యక్తుల పేర్లతో పిలిపించుకుంటున్నవారిదా ? ఎవరిది కీర్తికాంక్ష ? వందలమంది రచయితలు కలిసి జరిపే ప్రదర్శనల్లో తానొక్కడే పాల్గొన్నట్టు ఫోజుకొట్టి వార్తలకు, టి.వి.లకు ఎక్కుతున్నదెవరో కెమెరాలు రాగానే చటుక్కున వారి ముందుకొచ్చి పాలకవర్గాలతో పోటీపడి టి.వి.ల్లో దర్శనమిస్తున్నదెవరో లోకానికి తెలుసు. ఈ కీర్తి కాంక్ష పరులవల్లనే సంస్థల్లో ఇతరుల్ని వెళ్లగొట్టి తాము మిగిలారనే చరిత్ర త్వరలో

రాస్తాను. ప్రస్తుతానికి అరసం, విరసం, దరకమే ఐక్యవేదికల లాగే విశాల సాహితి ఒక సాహిత్య సైద్ధాంతిక సంస్థ అని అది తన కార్యక్షేత్రంలో పనిచేయడం నుండి ఎందరో రచయితలు ఎదిగారని చెప్పడానికి పరిమితమవుతాను.

నూతన దృక్పథంతో రాస్తున్న ఇలాంటి కథలు పెద్ద పత్రికల్లో ప్రచురింపబడటం లేదు. పత్రికల్ని పీఠాలుగా మార్చుకొన్న కొందరి వల్ల మొత్తం సాహిత్యానికి అన్యాయం జరుగుతున్నది. ఒక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా, ఒక ప్రభుత్వ అధికారికి వ్యతిరేకంగా సమ్మెలు, ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నట్టుగానే ఆయా పత్రికల్లోని ఇలాంటి పీఠాధిపతులకు వ్యతిరేకంగా సమ్మెలు, ధర్నాలు, రాస్తారోకోలు చేసి వారిని మార్పించుకోవలసిన కర్తవ్యం కూడా సమాజం మీద ఉంది. వాళ్ళ మనుసు మార్చుకొని కొత్తను ఆహ్వానించడం ద్వారా ఈ సమస్య పరిష్కారం అవుతుంది.

గత పన్నెండేళ్లుగా తెలుగు కథ, గత వందేళ్ళుగా ఎన్నడూ లేని విధంగా మహోన్నతంగా వస్తు వైవిధ్యంతో, శిల్ప వైవిధ్యంతో విస్తరిస్తూ వస్తున్నది. అప్పటిదాక సాహిత్య వస్తువుగా నోచుకోని ఎన్నో అంశాలు గత పది పన్నెండేళ్ళుగా చిత్రించబడ్డాయి. గత నూరేళ్ళలో ఏ దశాబ్దంలో రానన్ని గొప్ప నవలలు 1990 నుండి 2002 వరకు గల పది పన్నెండేళ్ళలో వెలువడ్డాయి. ఇవన్నీ అప్పటిదాక సాహిత్యాన్ని ఆక్రమించిన దోపిడి కులాల మధ్య తరగతి జీవిత కథా వస్తువుకు భిన్నమైనది.

మార్క్సిజాన్ని జీర్ణించుకొని ఉత్పత్తి సంబంధాల సిద్ధాంతాన్ని మరో అడుగు ముందుకు తీసుకెళ్తు కులం రీత్యా ఉత్పత్తి సంబంధాలు ఎలా మారాలో లక్ష్మిరాజం రాసిన ఒక పాటలో ఇలా చెప్తాడు :

"ఎంతదాక పోరాటం అంటావా ఓ దళిత బహుజన
ఈ కుల వృత్తులు తారుమారేదాక ఓ దళిత బహుజన
కోమట్లు పెండ్లిలో డప్పులు గొట్టేటి
బ్రాహ్మలు ఊరిలో బట్టలు ఉతికేటి
రెడ్డీలు క్షవరాలు, గడ్డాలు తీసేటి
వెలుమ దొరలు ఊరి సుంకరిగ తిరిగేటి
ఆ రోజులు వచ్చేంతవరకు ఓ దళిత బహుజన
ఆగదు అంబేద్కర్ పోరాటం ఓ దళిత బహుజన "

ఈ పాట 26-11-2002 రోజున భారతీయ దళిత సాహిత్య అకాడమి వారు నిర్వహించిన నేషనల్ దళిత్ రైటర్స్ కాన్ఫరెన్స్ న్యూఢిల్లీ తాల్కటోర స్టేడియంలో జాతీయ అధ్యక్షుడు డా। సుమనాక్షర్ చేతుల మీదుగా డా అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డు - 2002 ను తీసుకున్న లక్ష్మిరాజం ఆ సభలో పాడి 25 రాష్ట్రాల నుండి వచ్చిన పదివేల

A C. No. 81910

మంది రచయితలు, కళాకారులకు తెలుగు మరియు హిందీ భాషల్లో విన్పించి ఉర్రూతలూగించారు.

20 దాకా పాటలు రాసిన లక్ష్మీరాజం ఈ పాటలో వ్యక్తీకరించిన భావాన్ని అరసం, విరసం, సోకాల్డు, ప్రజా రచయితలు, ప్రగతిశీల రచయితలు ఏమేరకు వ్యక్తీకరించారు. వాళ్ళు ఈ భావాన్ని కథల్లో, కవితల్లో, పాటల్లో, ప్రసంగాల్లో, వ్యాసాల్లో ఒక కంచె ఐలయ్యలా ఎందుకు చెప్పలేకపోయారు. ఇలా చెప్పలేక పోవడానికి వాళ్ళు దోపిడి కులాల, అగ్రకులాల సామాజిక తత్వంలో జీవిస్తూ, ఆచరిస్తూ అదే ఉండాలని కోరుకోవడమే కారణం. ఈ చరిత్రనే లక్ష్మీరాజం తిరగరాయదలచుకున్నాడు, పునర్నిర్మించదలచుకున్నాడు. చరిత్రని, సాహిత్య చరిత్రని పునర్మూల్యాంకనం చేయదలచుకున్నాడు. అందులో భాగమే ఇతని కథలు, కవితలు, పాటలు, నాటికలు, ప్రసంగాలు. బీసి, ఎస్సీ, ఎస్టీలు గత 200 ఏళ్ల చరిత్రను, సాహిత్య చరిత్రను, సిద్ధాంతాలను నేటి యువతరం నూతన శతాబ్ది కోసం పునర్ మూల్యాంకనం చేస్తున్నారు.

ఇలా ఉత్పత్తి శక్తులుగా చరిత్ర నిర్మాతలుగా పీడితులుగా కుల వర్గ లింగ ప్రాంత వివక్షతల బాధితుల ఉన్న వారి నుంచే రచయితలు ఎదగడం వల్ల ఇంత గొప్ప మార్పు సాధ్యపడింది. ఈ సాహిత్యాన్ని చదువని వాళ్ళు చదవనవసరం లేదనుకునేవాళ్ళు ఈ దశాబ్దంలో కథా శిల్పం పడిపోయిందని నవలలు రావట్లేదని ఉద్దేశపక్షవాదాలతో కాగితాల మీదుంచారు. వస్తువు ఇష్టం లేనప్పుడు శిల్ప చర్చ చేసి పూర్వపక్షం చేయడం ఆధిపత్య దోపిడి వర్గాల, దోపిడి కులాల స్వభావం. వల్లంపాటి వెంకటసుబ్బయ్య, పాపినేని శివశంకర్, వాసిరెడ్డి నవీన్ మొదలైన వాళ్ళు శిల్పం లోపించిందంటూ అసత్యాన్ని సత్యంగా ప్రవేశపెట్టి చర్చించి తెలంగాణా సాహిత్యానికి దళిత సాహిత్యానికి తీరని నష్టం చేశారు. శిల్పం బాగా వచ్చినపుడు పట్టించుకోకపోవడం కూడా అణిచివేతలో భాగమే.

ఇవాళ దక్షిణ భారతదేశంలో తెలంగాణ సాహిత్యం ఈ అణిచివేతల్ని అధిగమించి వందల కథలుగా అనేక పత్రికలుగా, నవలలుగా, వేల కవితలుగా, పాటలుగా విస్తరిస్తూనే ఉంది. నల్లాల లక్ష్మీరాజం ఈ కృషిలో చురుకుగా పాలుపంచుకుంటూ ఆం.ప్ర. దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక, తెలంగాణా కథా వేదికలల్లో క్రియాశీలక సభ్యుడిగా అంబేద్కరిజం ఆశయంగా ముందుకు సాగుతున్న రచయిత. "తిరుగు ప్రయాణం" వంటి తొలి కథల సంపుటితోనే వస్తువులో, దృక్పథంలో, శిల్పంలో తన విశిష్టతను చాటుకున్న నల్లాల లక్ష్మీరాజం నూతన శతాబ్ది యువ వైతాళికుడు. ఈ కథల్ని బహుజన రచయితలు, బహుజన ప్రజలు అధ్యయనం చేయడం అవసరం.

డా॥ కాలువ మల్లయ్య

ప్రముఖ రచయిత

తెలంగాణ కథా కెరటం నల్లాల లక్ష్మిరాజం

కథలకు కాణాచి తెలంగాణ. ఇది ఏ ఇంటి లోగిలి కెళ్ళినా తెలుస్తుంది. వాకిల్లలో నులకమంచాలేసుకొని అందులో కూర్చొని కథలు చెప్పేవారు. బజార్లలో బండలమీద కూచొని మోకాళ్ళకు నడుముకు పంచె గట్టి ఊగుతూ కథలు చెప్పేవాళ్ళు, ఊకొడుతుంటే ఉత్సాహంతో ఆశుకథలు చెప్పేవాళ్లు, చుట్టలు తాగుతూ జోరుగా కథలు చెప్పేవాళ్ళు... పిల్లలను నిద్రబుచ్చడానికి కథలు చెప్పేవాళ్ళు... ఇట్లా ఎన్నెన్నో కథలు.... ఎంతో మంది కథకులు... అయితే ఇవన్నీ ఆశుకథలు... మౌఖిక సాంప్రదాయంతో జీవించే కథలు.... మరయితే తెలంగాణలో లిఖిత కథ లేదా ? మొదటి తరంలో తెలంగాణా నుంచి లిఖిత కథలు రాలేదన్న వాళ్ళున్నారు. తెలంగాణలో కవులే లేరన్నందుకు సురవరం ప్రతాపరెడ్డి గారు 354 మంది కవుల రచనలతో ఓ కవితా సంకలనం వేసి చూపారు. అలాగే మొదటితరంలో తెలంగాణా నుంచి బాగానే కథలు వచ్చాయి. మొదటి తెలుగుకథ అనబడే "దిద్దుబాటు" ప్రచురింపబడ్డ రెండేళ్ళ లోపే 1912లో అదే ఆంధ్రభారతిలో మాడపాటి హనుమంతరావు రాసిన "హృదయశల్యం" అనే కథ ప్రచురింపబడింది. ఈ కథ స్త్రీ పక్షపాతియై అనుమానితుడైన భర్తలో పరిణామం తీసుకువచ్చే అంశాన్ని ఇతివృత్తంగా గలది. తొలితరంలోనే తెలంగాణ నుంచి వస్తువైవిధ్యంతో, సామాజిక స్పృహతో సామాజిక ప్రయోజనం ధ్యేయంగా అద్భుతమైన కథలొచ్చాయని తెలంగాణ తొలితరం రచయితలు ప్రజల భాషయైన మాండలికానికి తమ కథల్లో స్థానం కల్పించారు. మొదటి కథ పుట్టిందన్న కోస్తాలో చాలాకాలం వరకు మధ్య తరగతి జీవితమే కథా వస్తువైతే తెలంగాణాలో మాత్రం తొలితరం నుంచే అట్టడుగు జీవితాలు కథావస్తువులయ్యాయి. తెలంగాణ కథ సూటిగా ఫ్యూడల్ స్థితి నుంచి అభ్యుదయం వైపు పయనించింది. ఇదీ తెలంగాణా కథల ప్రత్యేకత.

వస్తు సేకరణ విషయంలో తెలంగాణ రచయితలు మొదట్నుంచే సుధృఢమైన పునాదులు వేసారు. మొదటితరం వారు వేసిన పునాదుల పైన్నే కథా

నిర్మాణం జరుగుతుంది. కాబట్టే మలితరంలోను, ఆ తర్వాతి తరంలోనూ తెలంగాణా రచయితలు ఏ ప్రలోభాలకూ లొంగలేదు. నేలవిడిచి సాము చేయడమూ లేదు. రైల్లలాంటి పొడవైన కార్లలో వచ్చే ఆరున్నర అడుగుల ఎత్తున్న కథా నాయకుల నవలల కాలంలోనూ, భూతప్రేత పిశాచాలు నాయికా నాయకులుగా వస్తున్న నవలల కాలంలోనూ తెలంగాణా రచయితలా ప్రవాహంలో కొట్టుకు పోలేదు. అలా కొట్టుకు పోయిన వాళ్ళు రచయితలుగా మిగులనూ లేదు. ఏ కాలంలోనైనా జన జీవన సంస్కృతిని చిత్రించిన వాళ్ళే రచయితలుగా మిగులుతారు. తెలంగాణా రచయితల విషయంలోనూ అదే జరిగింది. తెలంగాణాలో తమ చుట్టూ జరుగుతున్న అనేక ఉద్యమాలను, మార్పులను పట్టించుకోకుండా రచయితలుగా పేరు తెచ్చుకోవడం కష్టం. అలాగే హైటెక్ మాయాజాలం, గ్లోబలైజేషన్ మంత్రజాలం కింద పరాయికరణకు గురవుతున్న బతుకుల్ని పట్టించుకొని రాయాల్సిన అవసరమూ ఉంది. ఈ ప్రజారచన పరంపరే తెలంగాణలో కొనసాగుతుంది. ఈ పరంపరను ముందుకు తీసుకెళ్ళడానికి కలం పట్టిన ప్రజా రచయిత నల్లాల లక్ష్మిరాజం.

స్వాతంత్ర్యం వచ్చిన మొదటి తరంలో పీడిత కులాల్నుంచి వచ్చినవాళ్ళు కొందరు. ఆ తరంలో ఉన్న స్వల్ప అవకాశాలను ఉపయోగించుకొని జీవితాలను గెలుచుకున్నారు. తమ హక్కుల గూర్చి ప్రశ్నించే స్థితికి చేరుకున్నారు. వీళ్ళనుంచి రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా కొంత కొంత ఎదుగుతున్నారు. అయితే ఒకటి రెండు తరాలైనా ఉన్న అవకాశాలను వినియోగించుకోకముందే నోటికాడి బుక్కను లాక్కున్నట్లు చేయడం చూస్తున్నాము మనం. ఈ విషయాలన్నిటినీ గమనించి పీడిత కులాల్నుంచి వచ్చిన తెలంగాణ రచయితలు తమ చరిత్రను తామే రాసుకుంటున్నారు. తమను తామే రికార్డు చేసుకుంటున్నారు... పీడితవర్గం పోరాడి గెల్చుకున్న జీవితాలకు అక్షరరూపమిస్తున్నారు. అలా తమ చరిత్రను తాము రాసుకుంటున్న రచయితల్లోంచి వచ్చిన కొత్త రచయిత నల్లాల లక్ష్మిరాజం.

మొదటితరం తెలంగాణ రచయితలను గమనిస్తే దళిత బహుజన కులాల్నుంచి వచ్చిన రచయితలు చాలా తక్కువ. దాదాపుగా లేరనే చెప్పవచ్చు. ఆ కాలంలో వీళ్ళకు చదువుకునే అవకాశాలే లేనప్పుడు ఇక రచయితలు ఎక్కడునుంచొస్తారు? స్వాతంత్ర్యానంతరం పుట్టి పెరిగిన తరంలోంచి చదువుకొని

జీవితాలను గెలుచుకున్న వాళ్ళున్నారు. వాళ్ళలోంచి రచయితలుగా, తాత్వికులుగా, రాజకీయ నాయకులుగా ఎదిగినవాళ్ళు ఉన్నారు. ఈ తరంలోంచి తెలంగాణ నుంచి రచయితలుగా ఎదిగినవాళ్ళలో చాలా మంది వెనుకబడిన, దళిత కులాల్నుంచి వచ్చిన వాళ్ళే. మొదటితరంలోనూ కొంతకొంతగా పీడిత సంస్కృతి రచనలకెక్కిన పీడిత కులాల్నుంచి రచయితలు వచ్చిన తర్వాత మరింత విస్తృతంగా పీడిత జన సంస్కృతిని కథల్లో కెక్కించడం ప్రారంభమైంది. ఆ క్రమాన్నే ముందుకు తీసుకెళ్తున్న మూడవతరం రచయిత నల్లాల లక్ష్మిరాజం.

ఈ సంపుటిలోని కథల్నిండా పీడితవర్గాలను అక్కున చేర్చుకోవడం కనపడుతుంది. కథలన్నిట్లోనూ తెలంగాణ పీడిత కుల సంస్కృతి చిత్రణ, ఉద్యమాలు తెలంగాణలో తీసుకొచ్చిన మార్పులు, అవ్వ బాంచెన్, అయ్యా బాంచెన్ సంస్కృతి అవశేషాలు, దొరలు కోరలు తీసిన పాముల్లా అయిన వైనం, భూస్వామ్య వ్యవస్థ పతనం చెందినతీరు చిత్రీకరించడం జరిగింది. "తిరుగు ప్రయాణం" కథలో దొరగూర్చి మాజీ పాలెరు కొడుకు, తన మాజీ పాలేరు కొడుకు నక్సలైట్‌గా మారిండేమోనని దొర, ఒకరినీడను చూసి మరొకరు భయపడడం వాస్తవికంగా చిత్రించబడింది. తెలంగాణ గ్రామాల్లో ఉన్న వాస్తవిక స్థితికి దర్పణమీ కథ. మొదటి తరంలో తెలంగాణా కథా రచయితలు కొంత గ్రాంధిక వాసనలున్న బాష, ప్రమాణిక భాష, పాత్రోచిత మాండలికం వాడారు. మొదటి తరం తర్వాత కొంత గ్యాప్ ఏర్పడినట్టనిపించినా అది గ్యాప్ కాదు. ఆ తర్వాత కలం పట్టినవాళ్ళు తెలంగాణా మాండలికాన్ని తనది చేసుకొని విస్తృతంగా కథలు రాసారు. ఆ సాంప్రదాయాన్నే నల్లాల లక్ష్మిరాజం తరం రచయితలు కొనసాగిస్తున్నారు. గ్రామీణ సంస్కృతిని, భాషను సజీవంగా బతికిస్తున్నవి గ్రామాలే. ఆ గ్రామాలను మన కళ్ళముందుంచుతున్నది కథా రచయితలే. తెలంగాణ మాండలిక భాషలోని జాతీయాలను, సామెతలను, పాత్రోచిత భాషను తన కథల్లో ఉపయోగించుకొని తన కథలకు మాండలిక పరిమళమద్దాడు రచయిత నల్లాల లక్ష్మిరాజం.

"మాలోని బతుకు మగులు మీది గడ్డి ... చెప్పేత్తే కుండకు తల్గది కాని టెంపర్ గాడ్డికొడుకులకు" లాంటి అరుదైన ప్రయోగాలు ఈ కథల్లో కనబడతాయి. తక్కువ కులాల వాళ్ళను కించపరిచే విధంగా వాడే సామెతలెన్నో సృష్టించారు

కులం మెట్ల సమాజసృష్టికర్తలు. గ్రామీణ జీవితంపై చక్కని అవగాహన, మాండలికం పై అధికారం, ప్రేమ, ఉన్నవాడయి గ్రామాల్లో నివసిస్తున్న రచయిత అయితేనే ఇలాంటి సహజమైన సామెతల్ని, భాషను వాడగలడు. తెలంగాణ మాండలిక భాషను రాసేవాళ్ళు, మాట్లాడెవాళ్ళు ఈ తరంలోనూ ఇంకా చాలా మందే ఉన్నారనడానికి నల్లాల లక్ష్మిరాజం కథలే నిదర్శనాలు. కులాల్లోని అంతరాలు, కులాల ప్రభావం, గ్రామాల్లో వాటి స్థితిగతులు మనకీ కథల్నిండ కనబడతాయి. పీడిత కులాల వాళ్లెంతగా పీడనకు, దోపిడికి గురవుతున్నారో దొమ్మరి గంగడు కథ చదివితే తెలుస్తుంది. మాల, వెలమ సంబంధాల్లాంటి అతి సూక్ష్మ విషయాలను కూడా తన కథల్లో తడిమాడు రచయిత నల్లాల లక్ష్మిరాజం.

ఊళ్ళో శాత్రాలు చెప్పుకుంటూ సంబరపడటం, ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో తియ్యదనం లాంటి మంచి విషయాలతో పాటు అక్రమ సంబంధాలు, పీడిత కుల స్త్రీలపై దొరల, రెడ్డిల సెక్స్‌దోపిడి, వరకట్న బాధలు, కట్నాల కోసం అప్పులు, అచారల పేరుమీద జరిగే ఘోరాల్లాంటి వాటిని దేన్ని వదిలిపెట్టకుండా తన కథల్లో దర్శింపజేసాడు రచయిత నల్లాల లక్ష్మిరాజం.

తలగపాలి లాంటి మారుమూల పల్లె పదాల్ని కూడా వాడి తన కున్న మాండలిక పరిజ్ఞానమేంటో వ్యక్తం చేసాడు రచయిత. "భలే బామ్మర్ది" కథను తీసుకున్నా మరే కథను చూసినా పల్లె సంబంధాలు, ఆత్మీయతలు, పల్లెలు అగ్నిగుండాలుగా మారడం లాంటి ఎన్నో విషయాలతో గ్రామాలను అక్కున చేర్చుకున్నట్టు కనబడుతుంది.

తెలంగాణా కథా రచయితల కథా వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్తు తమ ప్రాంత, పీడిత కుల సంస్కృతిని కథలుగా మలుస్తున్న ఈ రచయిత భవిష్యత్తులో మరింత మంచి కథకుడవుతాడనడానికి ఈ సంపుటిలోని కథలే నిదర్శనం. తెలంగాణ సాహితి ప్రపంచంలో వచ్చిన ఊపును మరింత ముందుకు తీసుకువెళ్తున్న ఈతరం కథా కెరటం నల్లాల లక్ష్మిరాజంను అభినందిస్తూ....

తిరుగు ప్రయాణం

'ఢాం' అన్న శబ్దంతో దొర గుండె గుభేల్‌మంది. కారు ఆగిపోయింది. అప్రయత్నంగా కళ్ళు మూసుకున్న దొర ముక్కోటి దేవతల్ని తలపించసాగాడు. "భగవంతుడా, నా చావు ఇట్ల రాసి పెట్టినావా? బయలు దేరంగా పిల్లి ఎదురైతేనే మనసు ఎదో కీడు శంఖించింది. అనుమానం వచ్చినప్పుడు అక్కడే ఆగిన మంచిగుండు."

కళ్ళు మూసుకున్న దొరకు ఎవరో దగ్గరకు వస్తున్నట్లు నీడగా అగుపించడంతో "అన్న... అన్న... మీకు దండం బెడ్తన్న.. నన్ను చంపకుండ్రి అన్న నేనేం పాపం చేయలేదన్న. గదొక్క చిన్న పొరపాటు తప్ప, నన్ను క్షమించుండ్రి అన్న, రేపోమాపో సచ్చే ముసలోన్ని నన్ను చంపితే ఏమత్తదన్న మీకు" బిగ్గరగా అరుస్తూ విలపించసాగాడు నారాయణరావు దొర.

"అయ్యా... అయ్యా"

"వద్దు వద్దు వద్దు నన్ను చంపకుండ్రి మీకు దండం బెడ్తన్న....."

"అయ్యా నేనయ్యా రమేష్‌ను డ్రైవర్ని" అన్నాడు రమేష్, దొర భుజం మీద చేతులేసి బలంగా కదుపుతు.

దొర భయం భయంగా మెల్లగా కళ్ళు తెరిచి చుట్టు చూసాడు. అక్కడ డ్రైవర్ రమేష్ తప్ప ఎవరు లేరు. రమేష్ దొర పరిస్థితిని అర్థం చేసుకొని "అయ్యా బాంబనుకొని భయపడ్డారా? కారు టైరు బ్లాస్టయింది అంతే. మీరు కారు దిగి కాసేపు ఆ చెట్టు నీడలో కూర్చుంటే పది నిమిషాల్లో టైరు మారుస్తా" అన్నాడు.

దొరకు చెమటలు కారుతూనే ఉన్నాయి. అంగీ, దోతి మొత్తం నానింది. తడి బట్టల్తో స్నానం చేసినట్లయిండు. కారు వెనుక సీట్లో చతికిల బడిపోయిన దొర రమేష్ సహాయంతో మెల్లగా క్రిందికి దిగి రోడ్డుకు అవతల వైపున ఉన్న కానుగు చెట్టు క్రింద కూర్చున్నాడు.

దొరకు వశపడని దూప అవుతుంది. కారులో వాటర్ బాటిల్ కూడా లేదు. రోడ్డు ప్రక్కనున్న కిలోమీటర్ ఖనిని చూసాడు. హైదరాబాద్ 60 కి.మీ. అని వ్రాసి ఉంది. "ఎట్లా"? అని రోడ్డుకు ఇరువైపులా పరికించి చూసాడు. దగ్గరలో ఏదన్నా ఊరుందోనని.... హైదరాబాద్ వైపు రోడు మలుపులో ఓ గ్రామం ఉన్నట్టుంది. రోడు ప్రక్కన చిన్న హోటల్ కనపడ్తుంది. పది నిమిషాలు నడిస్తే అక్కడికి చేరుకోవచ్చునని లేచి...."

"రమేష్ నాకు బాగా దూపైతుంది. అక్కడేదో హోటలున్నట్టుంది నీళ్ళు తాగి అక్కడే కూర్చుంట. కారు అటే తీసుకుకొనిరా..' అని చెప్పి పెద్ద పెద్ద జంగలేస్తు హోటల్ వైపు బయలుదేరాడు.

*** *** ***

దొర ఎగపోస్తు వచ్చి అయాసపడుతు హోటల్ ముందున్న బేంచి మీద కూలబడి వట్టి నీళ్ళంటే ఇస్తడో ఇవ్వడోనని "బాబు ఒక చాయి ఇయ్యవయ్యి" అన్నాడు.

హోటల్ గుడిసె లోపల ఇద్దరు యువకులు పేపర్ చదువుకుంటున్నారు. హోటలతను బొగ్గుల పొయిని "ఉఫ్ ఉఫ్" అంటూ ఊత్తున్నాడు. ఊదిన కొలది బూడిదంత అతని మీద పడుతుంది.

"బాబు కొద్దిగా తొందరగా ఇయ్యవయ్యా నోరెండి పోతుంది. ఎండలనడిసచ్చిన" అన్నాడు దొర ప్రాదేయపడుతున్నట్లు.

హోటలతను పొయి ఊదుడాపి జెగ్గును రంజన్‌లో ముంచి తెచ్చి ఇచ్చాడు పరాకుగా, దొర జెగ్గెడు నీళ్ళు గటగట త్రాగి గట్టిగా ఊపిరి బిగపట్టి వదిలి "అబ్బ... పోయిన ప్రాణం తిరిగివచ్చినట్లయింది." అంటూ జెగ్గు తిరిగి ఇస్తూ హోటలతను మోహంలోకి చూ... సా... డు........ అంతే.

దొర గుండెల్లో బాంబు పేలినట్లయింది. భూమి కదిలినట్లయింది. మళ్లీ చెమటలు పట్టినాయి. నోరు పిడచకట్టుకుపోయింది. నోట మాట రావడం లేదు. కొన్ని క్షణాల తర్వాత తన కళ్ళను తానే నమ్మలేనట్లు కళ్ళజోడు సరిగా జరుపుకొని పరీక్షగా చూసి.

"నువ్వు... నువ్వు రాయలింగని కాదు కాదు రాజలింగయ్య చిన్న కొడుకు రాజేష్వు కదు " అన్నాడు దొర భయం భయంగా.

హోటలతను "ఔను" అని తత్తరపడి దొర మొహంలోకి పరీక్షగా చూసి "దొర మీరా" వణుకుతూ అన్నాడు.

"నువ్వు అన్నల్లల్ల కేయి ఎప్పుడచ్చినవ్ రాజేష్" అన్నాడు దొర భయం భయంగానే.

ఆ మాటతో రాజేష్ మరింత వణుకుతు "నేను అన్నల్లల్ల ఎందుకు పోయిన దొర? మీ భయానికి దెంకచ్చి ఇక్కడ హోటల్ పెట్టుకొని బతుకుతున్న" అన్నాడు.

తను విన్నది కలా? నిజమా? అని దొర చేతిని గిల్లుకొని "నిజంగా నువ్వు అన్నల్లల్ల పోలేదా రాజేష్" అన్నాడు.

"నిజంగ పోలేదయ్య దేవుడు మీదొట్టు" అన్నాడు రాజేష్ తలపై చేతిపెట్టుకొని

"మరి ఆరోజు నేను నిన్ను కొట్టినప్పుడు అన్నలకు చెప్పి నీ సంగతి జాత్త అని ఏడ్చుకుంటు పోతివి గదా" అన్నాడు దొర ఆదుర్దాగా

"అన్నలంటే... మా రామన్నకు, లింగన్నకు ఇంటికి పోయి చెప్పిన, చెప్పితే వాళ్ళు నన్నే భయపెట్టిచ్చింండ్రు. గా... దొర జోలికి ఎందుకు పోయినవురా? ఆయన పోలీసొల్లతోని చెప్పి తన్నిపిత్తడు అని వాళ్ళు కూడ భయపడి కొన్ని రోజుల దాక ఏడన్న ఉండుపో అని రాత్రికి రాత్రే నన్ను బస్సెక్కిచ్చింండ్రు. అప్పటినుండి ఆ ఊరి మొఖం కూడా చూల్లేదు." అన్నాడు రాజేష్

దొరకు రాజేష్ చెంపమీద చటిల్లుమని సర్దమనిపించి 'అబ్బో వద్దు ఆరోజు ఆవేశంలో ఒక్క దెబ్బ కొట్టినందుకే ఐదేండ్లు అనుక్షణం భయం భయంతో అజ్ఞాతవాసంలో బతకవల్సి వచ్చింది.' అనుకోని రాజేష్ మోహంలోకి చూస్తు నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

రాజేష్ గ్లాసులో చాయి ఇచ్చాడు. దొర చాయి తాగుతు నిరాశగా నవ్వి "ఎంతపని చేసినవ్ రాజేష్ నువ్వు అన్నలకు చెప్తుత అనుకుంటుపోతే నక్సలైట్లల్లకు అనుకొని భయపడి, తెల్లవారి నీ గురించి మీ అన్నలను అడిగిన. ఆడు నిన్నటినుండి జాడ లేడయ్యా ఆనికోసమే వెదుకుతున్నాము అని మీ అన్నలు చెప్పినవొల్లే నా పంచప్రాణం ఎల్లిపోయింది. అదే రోజు రాత్రి మన పక్కూరు రాజగోపాల్‌రావు దొరను నక్సలైట్లు చంపింండ్రని మా పాలేరు భీమయ్య వచ్చి చెప్పిండు. నాకు నువ్వు నువ్వన్న మాటలే గుర్తుకు వచ్చినాయి. రాత్రంత గుమ్మిలింట్ల బిక్కు బిక్కుమని దాక్కున్న

పాపం భీమయ్య రాత్రంతా నాతోనే ఉండి ఏగిల్లు వారంగ పొలాల దారిగుండ పక్కూరు దాక వచ్చి లారెక్కిచ్చి పోయిండు. అప్పటినుండి ఇప్పటివరకు ఆ ఊరిలో అడుగుపెట్టలేదు. ఆ తర్వాత నువ్వు కనిపిస్తలేవని మా బంధువులు చెప్పడంతో నువ్వు ఖచ్చితంగా నక్కలైట్లల్ల కల్సినవని నిర్ణయించుకున్న. పాలు పోసే పిల్లగాడు వచ్చి తలుపు తట్టినా భయంతో గజగజ వనికిపోదుంటి. నేను బాత్రూంకు పోయి రావడం ఆలస్యం అయినా నా భార్య భయంతో కంగారు పడేది. ఆరోజు బండ మీద కూసున్న నువ్వు నన్ను చూసి కూడ లేవలేదని అహంతో ఆకారణంగా నిన్నో దెబ్బ కొట్టినందుకు లక్షలాది జనం మధ్య ఉండికూడ ఎడారిలో జీవించినట్లు జీవించిన, ఎవరులేని అనాధగా బ్రతికిన మరి నీవు కనీసం ఇంటికి ఉత్తరం కూడా రాస్తలేవ" అన్నాడు దొర ధోతి సింగుతో కళ్లు ఒత్తుకుంటూ.

"అమ్మో ఉత్తరం రాస్తే నేనున్న అడ్రసు తెలుసుకొని మీరు వస్తారని భయంతో రాయలేదు. మొన్న మా అవ్వ కలల కనపడ్డది. పోదామనిపించింది. కాని భయానికి పోలేదు." అన్నాడు రాజేష్ కళ్లు తుడుసుకుంటు.

దొర నిరాశగా నవ్వి "నా భయం నాది నీ భయం నీది. ఇద్దరం ఊరిడ్సిపెట్టినం. అయినా నేను ఎప్పుడు ఎవరిని కొట్టలేదు రాజేష్. ఆరోజు నా మీద శని కూసుందో ఏమో! నా తొందరపాటు తనానికి తగిన శాస్తి జరిగింది కాని నీవు అన్యాయంగా కష్టాలు పడ్డావ్. మరి ఇప్పుడైన మనూరికి పోతవా? ఇక్కడే ఉంటావా?" అన్నాడు.

"ఇంకేం భయము నాకు! ఇవ్వాలే పోతా! మా అవ్వమీద బాగ్గోట్టుకుంటుంది. మీ గ్గాడ రావాలని ఉందా మనూరికి"

"రావాలని ఉందా! నీ భయానికి ఊరెల్లి వచ్చిన గాని లేకుంటే దేవుడు దిగి వచ్చి చెప్పినా ఊరిడ్సిపెట్టేవాన్ని కాదు. ఇక్కడేముంది రాజేష్, ప్రాణం లేని యంత్రాలు తిరిగినట్లు మనుషులు బత్కుడు. మనుషుల మధ్య మానవ సంబంధాలుండయి. ఇరుగుపొరుగు ప్రేమలుండయి. కనీసం పక్కింటి వాళ్ళతో పరిచయం కూడా ఉండదు. పల్లెటూరిలోని ప్రేమ, ఆప్యాయత ప్రశాంతత ఇక్కడ మచ్చుకు కూడ కానరావు. ఎప్పుడు సచ్చిన శవం లాగా టీవి ముందు కూర్చోవాలి. అది నవ్వితే నవ్వాలి. ఏడిస్తే ఏడ్వాలి. పల్లెటూర్లో పుట్టి పెరిగినోల్లు పట్టణంలో బ్రతకడం కష్టం. ఒక్కగానొక్క కొడుకు లండన్‌లో సెటిలయ్యిండు. ఎప్పుడో ఏడాదికో రెండేండ్లకో వచ్చిపోతుంటడు. మమ్మల్ని అక్కడ్కే రమ్మంటుండు. కాని గీ హైదరాబాదులోనే ఉండలేక పోతున్నాము ఇంక లండన్‌లో ఎట్లుంటము. పాపం దేశం గాని దేశంలో ఉండే వాళ్ళ పరిస్థితి

ఏమిటో... ఛ... డబ్బు కోసం అన్ని వదులువోవాలి, సరేగాని రాజేష్ నీవు ఇవ్వాళ్ల పోకు, రేపు పోదాం రేపు ఎనిమిది గంటలకు తయారుండు." అంటు కారచ్చి ఆగడంతో చాయి బిల్లు ఇవ్వబోగా రాజేష్ నిరాకరించడంతో దొర నవ్వుతూ కారు వైపు నడిచాడు.

*** *** ***

చెప్పినట్లుగానే దొర కరెక్టు ఎనిమిది గంటలకు వచ్చి హోటల్ ముందు కారాపి "రాజేష్" అంటూ పిలిచాడు. నిన్న ఎడారిలా బోసిపోయిన దొర మొహం ఈ రోజు చిరునవ్వుతో నిగనిగలాడుతుంది. రాజేష్ ఆనందానికి అవధుల్లేవు. దొర పిలవగానే భుజానికి బ్యాగు వేసుకొని లేడిపిల్లలా పరిగెత్తుకు వచ్చి దొరకు నమస్కారం చేసి కారు ముందు డోరు తీసి ఎక్కబోయాడు.

వెనుక సీట్లో కూర్చున్న దొర రాజేష్ చేతిపట్టి ఆపి "వెనుక కూర్చుందురా.. మాట్లాడుకోవచ్చు" అన్నాడు. రాజేష్ ముందు సంశయించినా దొర మరోసారి అనడంతో వెనుక సీట్లో కూర్చున్నాడు. కారు కరీంనగర్ వైపు బయలుదేరింది.

దూర ప్రాంతంలో కల్సినప్పుడు ఇద్దరు ఆగర్భ శత్రువులు కూడా మిత్రులు అవుతారేమో! ఇద్దరు వయస్సులో పూర్తి బిన్నమైనప్పటికి ఒకే గ్రామానికి చెందినవారు కావడంచేత బాల్య స్నేహితుల్లా కల్సిపోయి ముచ్చట్లలో మునిగి పోయారు.

"అటే ఉంటావా మల్లీ ఇటత్తవా?" అన్నాడు దొర

"ఇంకా ఎందుకత్త అటే ఉంటా మల్లీ ఒకసారి వచ్చి గుడిసె అమ్మేసి సామాను తీసుకువెల్తాను మరి మీరు?" అన్నాడు రాజేష్

"నాకు ఈచివరి రోజుల్లోనైన పుట్టి పెరిగిన ఊరిలో జీవించాలని ఉంది. నాలాంటి వెర్రిబాగులోల్లు చేతులు కాలాక ఆకులు పట్టుకుంటారు. ఎద్దైన బాధ పడితే గాని బోద పడదు. ఎలా జీవించాలో ఎలా జీవించకూడదో నేను ఈ పట్నంలోనే నేర్చుకున్నాను. ఒక రోజు పేపర్ వేసే అబ్బాయిని ఏరా బాబు పేపర్ అట్లా విసిరికోడతావెందుకు? జెరా చేతికివ్వచ్చు గద అన్నందుకు అరేయ్ తొరేయ్ అంటున్నవు కామన్ సెన్స్‌లేదా ? అంటూ ఇంకేదో ఇంగ్లీషులో తిట్టుకుంటుపోయిండు. అప్పుడనిపించింది నాకు ఇన్ని రోజులు నేనెంత మూర్ఖంగా జీవించిన అని. మనిషిని మనిషి ప్రేమతో గౌరవించాలి కాని భయంతో కాదు. నీకో విషయం చెప్పనా! నేను చిన్నగున్నప్పుడు మీ తాత మాకు పాలేరుండే. నేను మీ తాతను తాత తాత అని పిలుస్తుంటి. అట్లా పిలవకు ఆడు తక్కో కులపోడని మా తాత కోప్పడుతుండే.

అగో... అప్పటినుండి నాలో దొర అనె అహం పెరిగింది. మనిషి వ్యక్తిగతంగా మంచోడు అయినప్పటికి పుట్టి పెరిగిన వాతవరణం పరిస్థితులు మారుస్తాయి. ఏది ఏమైన నాలాంటి మద్యతరగతి దొరలకు గడ్డు పరిస్థితి వచ్చింది."

"గింత బాధపడుతు ఇక్కడుండడం దేనికి దొర? మన గ్రామంలోనే ఉండుండ్రి అందరం కలిసి బతుకుదాం"

"అగో గా దొరన్న పదమే గిట్లా చేసింది. దొర దొర అన్ని నన్ను గొప్పోన్ని చేసి గౌరవించితే నాలో అహం పెరిగింది. ఈ గతి పట్టింది. అట్లా పిలవనంటే అక్కడే ఉంటా నువ్వొక్కడివే కాదు ఎవరుకూడ అట్లా పిలవద్దని అందరికి నువ్వే చెప్పాలి"

దొర ఇంత మారిండా అని రాజేష్ ఆశ్చర్యంగా చూసి "మరేమని పిలువుమంటరు?" అన్నాడు.

"తాత అని వరుసపెట్టి పిలువు. వరుసలు పెట్టి పిలుచుకోవడంలో దొరికే ప్రేమ, ఆప్యాయత, అనుభూతి దొర పటేలా, సారు అనే పదాల్లో దొరకవి."

కారు కరీంనగర్ దాటి జగిత్యాల వైపు ఎనబై మైళ్ల వేగంతో ఉరుకుతుంది. "దొర ఇప్పుడు మనూరు ఎట్లుందంటారు." అన్నాడు రాజేష్

"అదిగో మల్లి అట్లనే పిలుస్తున్నావ్... ఏముంది! నక్సలైట్లతో సంబందాలు పెట్టుకొని ప్రతి దానికి న్యాయం, ధర్మం అంటూ నాకు ఎదురు తిరిగే రాంరెడ్డి సర్పంచి అయ్యిండాట. ప్రశాంతంగానే ఉండి ఉంటుంది. ఐదేండ్ల నుండి కనిపించని మనం ఒకే కారులో ఒకేసారి కనిపిస్తే ఊరి జనమంత ఆశ్చర్యపోయి ముక్కున వేలేనుకుంటారు. విషయం తెలిసాక వక్కున నవ్వుతారు. ఆ సంఘటన తలుచుకుంటుంటే ఊరు ఇంకా ఎప్పుడు వస్తదా అనిపిస్తుంది. అబ్బా... పచ్చని పంట పొలాలను చూసి ఎన్ని రోజులు అయింది. "అదిగో! అటు చూడు ఆ తంగెడుపూలు, గునుక పూలు ఎంత బాగున్నాయి" అంటూ రాజేష్‌కు రోడ్‌కు ఇరువైపులా ఉన్న పంట పొలాలను, పూల చెట్లను చూపిస్తూ అమితానందం పొందసాగాడు దొర.

ఔను... తంగెడు పూలంటే గుర్తుకు వచ్చింది మనూర్లే బతుకమ్మ పండుగు రేపే కదా, మన ఊర్లో బతుకమ్మ పండుగు చూడక ఎన్నేండ్లాయెనో! అయిన మనం అదృష్టవంతులం. బతుకమ్మ పండుక్కు అందపోతున్నాము. "గత ఐదేండ్ల కిందటి బతుకమ్మ పండగ నాటి దృశ్యం కళ్ళముందు కదిలి తబ్బుబ్బిపోయాడు రాజేష్."

*** *** ***

కారు గ్రామం నడిబొడ్డులో ఆగింది. దొర రాజేష్ కారు దిగి వంగి జన్మభూమికి నమస్కారించి చుట్టు చూసారు. వారు ఊహించినట్లు ఎప్పుడు జనంతో కిటకిటలాడే గ్రామ చావడిలో ఈరోజు ఒక్క మనిషిగూడ లేరు. దూరంగా ఒక ఎడ్ల బండి పోతూ కన్పించింది. వారు ఆశ్చర్యపోయి అటు ఇటు తిరిగి చూసి చివరకు రాజేష్ ఇల్లు ఉన్న వాడకట్టువైపు బయలుదేరారు. ఊరంత నిర్మానుష్యంగా ఉంది. దొరకు, రాజేష్‌కు ఏమి అర్థం కాక మొహాలు చూసుకుంటూ నడవసాగారు.

నడుస్తున్న వారు ఠక్కున ఓ గుడిసేముందు ఆగిపోయారు. గుడిసెలో నుండి నిశ్శబ్దన్ని చీల్చుకుంటు ఎవరో మూలుగుతున్నట్లు విన్పిస్తుంది. కొంతసేపు తటపటాయించి గుడిసెలోకి తొంగి చూసారు. కుక్కి మంచంలో ముసలమ్మ దిగబడి ఉంది. లేచుటకు ప్రయత్నిస్తు గునుసుకుంటు ఏదో అంటుంది.

దొర రాజేష్ లోపలికి పోయి ముసలమ్మను లేపి కూర్చోబెట్టిండ్రు. ఆమె రాజేష్ అమ్మమ్మ చెల్లెలు.

"ఎవరయ్యా మీరు మీ బాంచెన్ కాల్మొక్త నన్నేం చేయకుండ్రి చచ్చే ముసల్దాన్ని ఎవరు సంపిడ్రో ఏమో నాకు తెలువదు" అంది ముసలమ్మ చేతులు జోడించి ఏడుస్తు....

"నేనమ్మ రాజేష్‌ను నన్ను గుర్తుపడుతులేవా?" ఆత్రుతగా అన్నాడు రాజేష్

"అయ్యో కొడుకా నువ్వా? ఇట్ల కూర్చో ఇప్పుడెందుకచ్చినవ్ బిడ్డా ఊరంత ఉస్కుడుకుతుంటే"

"ఊరిలో ఏమైంది అమ్మమ్మ"

"రాత్రి ఎవరో దొరను చంపిండ్రాట. ఊరొల్లంత పోలీసుల భయానికి చుట్టాలిండ్లల్లకు, బొంబాయి దెంకపోయిండ్రు. ఇండ్లల్ల ఒక్క పురుగు కూడ లేరు. కండ్లు కనిపించని ముసల్దాన్ని నేనెటు పోవాలే. కాటికి కాలుజాపిన ముసల్దాన్ని నన్నేమంటారని ఈన్నే పడిసచ్చిన..."

రాజేష్ దొర గుండెల్లో రైళ్ళు పరిగెత్తినయ్. రాజేష్ బిత్తరపోయి దొర మొహంలోకి చూసి...

"అమ్మమ్మ... దొర ఎప్పుడో ఊరిడ్సిపెట్టిపాయే. మరి ఇంకా దొరలెవరున్నారు మనూరిలో.."

"అయ్యో ఆ దొర గాదు బిడ్డ ఆ దొర ఇంత అధ్వానపోడు గాదు. ఆ దొర ఊరిడ్సిపెట్టిన్నుండే రాంరెడ్డి పటేలుకు పట్టా పగ్గాల్లేకుంటయినవి. పనికిపోయిన ఆడోళ్ళను కరాబు చేసుడు ఎవరన్న మొగోళ్ళు ఎదురు తిరిగితే ఇంట్లదోలి కొట్టుడు. అల్లు అన్నలో ఎవరో గాని రాత్రి పదిమందిదాక వచ్చి సంపి పాటలు పాడుకుంటు పోయింర్రాట. నువ్వెందుకచ్చినవ్ పో... ఇక్కడ మంచిగా లేదు... అక్కన్నే బత్కుపో... ఇంతకు ముందే బూట్ల చప్పుడు ఇనిపించింది. పోపో... పో..." అంటూ తొందరపెట్టింది ముసలమ్మ.

ఆ భయానక నిశ్శబ్ద వాతావరణం రాజేష్‌ను దొరను అక్కడ ఒక్క నిమిషం కూడా ఉండనీయడం లేదు.

'ప్రతిదానికి నన్ను ఎదిరించడం వెనుక రాంరెడ్డి అంతర్యంలో ఇంత పశుత్వం దాగి ఉందా?' దౌర్జన్యకారులు ఎక్కడినుంచో పుట్టుకురారు అజ్ఞానం, అమాయకత్వం ఉన్నంతకాలం తయారౌతూనే ఉంటారు. రాంరెడ్డి గురించి ఆలోచిస్తుంటే దొర హృదయం బరువెక్కింది.

రాజేష్ తేరుకొని కుక్కి మంచం కాలకట్ట గట్టిగా ఇగ్గి కట్టి ముసలవ్వను పడుకోబెట్టాడు. తలాపకు మంచినీళ్ళు పెట్టి "పోయస్తా అమ్మమ్మ" అన్నాడు. బొంగురు గొంతుతో హృదయం ద్రవించింది కళ్ళల్లో నీళ్ళు నిండినాయి.

"పో బిడ్డా ఎక్కడన్నా మంచిగా బత్కుపో" అంది ముసలమ్మ చేతిని దీవిస్తున్నట్లు పెట్టి.

దొర, రాజేష్ అడుగులో అడుగువేస్తు బిక్కుబిక్కు మంటు దిక్కులు చూస్తు కారు వైపు నడిచారు. ముసలవ్వను ఒంటరిగా వదిలిపెట్టిపోతున్నందుకు రాజేష్ గుండె తరుక్కుపోతుంది. తన ఇల్లును ఒక్కసారి చూడాలని దొరకు మనసులో అన్పించింది. కాని ధైర్యం చాలక కారు వైపు నడిచాడు. ఇద్దరు మౌనంగా కారెక్కి కూర్చున్నారు. అక్కడే ఉన్న రమేష్ కారు స్టార్ట్ చేసి వెనుకకు తింపి ఉరికిచ్చాడు. నిశ్శబ్దంలో కారు చప్పుడు తెలంగాణా పల్లె రోదనలా విన్పించసాగింది. ఆ రోదనలో భయంతో రెక్కలున్న పక్షులు వలసపోతున్నాయి. మట్టుకు కట్టేసిన పాడి ఆవులు భయంతో పరుగెత్తలేక గజగజ వణుకుతూ "అంబా" అని అరుస్తున్నాయి.

❀ ❀ ❀

రాజవ్వ కొడుకు

"ఓరి పోడ ఇట్రా" పిలిచాడు రాజేశ్వర్‌రావు దొర.

బడికి వెళ్తున్న దేవయ్య ఆగి 'ఏంటి' అన్నట్లు చూసాడు.

"గా కోమటోనింటికి పోయి నా పేరు చెప్పి ఒక పొగాకు రెమ్మ ఇయ్యిమనుపోర".

"నేను పోను నాకు బడికి ఆలస్యమైతది"

"ఏందిరో! పని చెప్పితే మర్ర వడుతున్నవ్ కావురమార"

"నువ్వు పని చెప్పితే చేసుటానికి నేను నీకు జీతమున్నన"

"నువ్వు అంటావ్‌రా మాల గాడ్డికొడుక ! నాలుగక్షరాలు రాంగానే కళ్లు నెత్తికెక్కినాయిర" బూతులు తిడుతు ఆ చెంప ఈ చెంప వాయించాడు దొర. దేవయ్య శోకం పెట్టినా దొర కొట్టుడు ఆపలేదు. కాలేజికి బయలుదేరబోతున్న రాజేశ్వర్‌రావు దొర మనవరాలు భారతి ఆ దృశ్యం చూసి పరుగున వచ్చి "ఏంటి తాతయ్య గా... చిన్న పిల్లగాడిని పట్టుకొని కొడుతున్నావు ఛీ.." అని కసురుకుంటూ దేవయ్యను విడిపించింది. "ఊరుకో బాబు ఊరుకో... నీపేరేంటి" అంటూ దేవయ్య కళ్లు తుడుస్తూ బుజ్జగించింది. దేవయ్య వెక్కి వెక్కి ఏడుస్తూ "దే..వ..య్య" అన్నాడు ముక్కు ఎగబీలుస్తూ "ప నేను బడిదాక తోలేసి వస్తా" అని దేవయ్యను తోడ్కోని బడి వైపు కదిలింది భారతి. ఏడుస్తూ వెళుతున్న దేవయ్యను చూస్తు దొర తృప్తిగా నవ్వుకొని "మాలోని బత్కు మగులు మీది గడ్డి, చెప్పెత్తే కుండకు తల్లది కాని, టెంపర్ గాడ్డి కొడ్కులకు" అనుకుంటు మళ్లీ గద్దెమీద కూర్చొని జేబులోంచి పొగాకు రెమ్మ తీసి నోట్లో వేసుకొని నిమ్మలంగా నమలసాగాడు.

రాజేశ్వర్‌రావు దొరకు డెబ్బై ఏళ్ళు నిండినా పొన్నకాయలా గట్టిగా ఉన్నాడు. అర్థ శతాబ్ది గ్రామంలో తిరుగులేని దాదా గిరి చలాయించాడు. వృద్ధాప్యం పై బడటంచే కాలక్షేపం కోసం రోజు ఉదయం సాయంత్రం ఇంటి ముందు సిమెంటు గద్దె మీద కూర్చొని తన కులం వారితో బాతకానీలు కొడుతు దొరొంటి నడిచే ఇతర కులస్థులను అనవసరంగా మాట్లాడిస్తు, ఎగతాళి చేస్తు, మాటలతో హింసిస్తు ఆనందిస్తుంటాడు. మారుతున్న సమాజాన్ని చూసి ఓర్వలేక కళ్ళల్లో నిప్పులు పోసుకుంటాడు. ఆయన

ఇంటి ముందు ఉన్నాడంటే ఇతర కులస్తులు దారొంటి నడవడానికి జడుసుకుంటారు. ఆయన కంపు మాటలు భరించడానికి నానా అవస్థలు పడుతుంటారు. వెలమ కులస్థులు మాత్రం తమ కుల గౌరవం కాపాడే పెద్దమనిషని, "ఇలవేల్పు"లా రాజేశ్వర్‌రావు దొరను గౌరవిస్తారు పెద్ద దొర అని సంబోదిస్తారు.

*** *** ***

రాజనర్సయ్య ఇంటికి వస్తూనే కొడుకును పట్టుకొని "ఔర పెద్దొరను ఎమన్నవ్‌ర! బండ బూతులు తిట్టేనెంర" అంటూ చేతిలో ఉన్న ముల్లు కట్టెతో చదువుకుంటున్న దేవయ్య పిర్రలపై రెండు దెబ్బలు కొట్టాడు. నిప్పురాయి తాకినట్లు సురుక్కుమనిపించి దేవయ్య మొత్తుకున్నాడు. కొడుకు ఏడుపు విని బోళ్ళు తోముతున్న రాజవ్వ పరిగెత్తుకొచ్చి "ఏమైంది? ఎందుకు కొడుతున్నవు" అని భర్తకు అడ్డం నిల్చుంది.

"అసలు వాన్ని కాదే నిన్ను తన్నాలి. నువ్వు జేయవట్టే ఆడు ఇట్లా తయారయిండు" అంటూ ముల్లు కట్టెతో భార్య చేతుల మీద కొట్టాడు. ఇంకోటి కొట్టబోతున్న భర్త చేతిలోని ముల్లుకట్టెను దొరకబట్టి "ఓ నల్లమొఖపోడ అసలేం జరిగిందో చెప్పిన కొట్టు" అంది రాజవ్వ ఉక్రోషంగా.

"ఈడు ఏం జేసిండో తెల్సా? పెద్దొరకు మర్రవడ్డడాట అయినే పిలిచి అవ్వనక్కను తిట్టవట్టే. నాకు తలకాయ తీసేసినట్లయింది. మొన్ననేమో మందకాడికి పోయే గొల్లకుర్మోల్లను ముట్టుకుంటే పాపం వాళ్ళు సద్దులు పారేసింద్రాట. గిట్లా తయారయిండు నీ చిన్న కొడుకు మన ఇంటా వంటలేని చదువు మనకెందుకు? ఏ కాపయ్యకన్న జీతముంచితే నాల్గుంచాల దినుసు ఇత్తరంటే నువ్వు ఇనకపోతివి. చదువుకోని రాజ్యాలు ఏలుతాడని బడికి తోలవడితివి" అంటూ ముల్లుగట్టెను పందిరికి చెక్కి "భూమ్మీద పడ్డందుకు నలుగురితో సరే అనిపించుకొని మంచిపేరు తెచ్చుకోవాల్నే చదువెందుకు చంక నాకేతందుకా?" అదురుకుంటు తాను జీతమున్న రామిరెడ్డి పటేలు దొడ్డిలోని ఆవుల పెండకాళ్ళు తీసుటకు వెళ్లాడు రాజనర్సయ్య.

దేవయ్య తల్లిని గట్టిగా కావలించుకొని వెక్కివెక్కి ఏడ్వసాగాడు. రాజనర్సయ్యకు దేవయ్యను చదివించడం సుతారము ఇష్టం లేదు. పెద్దకొడుకులు లింగయ్య, రాజయ్య లాగా ఏ పటేలుకన్న జీతం ఉంచితే తన కుటుంబానికి సరిపడే ఓ నెల రోజుల గాసం వస్తుందని ఆశ. పెద్దకొడుకులు ఇద్దర్ని దొరలు పటేండ్లు పనిమంతులని మెచ్చుకుంటుంటే తన పేరు నిలబెట్టే కొడుకులని ఉప్పొంగి పోతుంటాడు రాజనర్సయ్య.

ఒక్క రాజనర్సయ్యనే కాదు మాల కులస్థులందరు తమ కొడుకులను దొరలకు, పటేండ్లకు పాలేరు తనం ఉంచి బిడ్డలను ఎనకంతులకు ఉంచి మంచి

పోరగండ్లని, పనిమంతులని దొరలు, పటేండ్లచేత అనిపించుకోవటం కోసం తాపత్రయ పడుతుంటారు. ఇతర కులస్థులు కూడా తమ పిల్లల్ని దొరలు పటేండ్లు మంచివారు అంటే మంచివాడని, చెడ్డవారు అంటే చెడ్డవాడని నమ్ముతుంటారు. ఒకరి పిల్లల మంచి చెడులను ఒకరు ప్రచారం చేసుకుంటారు. ఏది మంచో, ఏది చెడో తర్కించి విశ్లేషించుకునేవారు కాదు. తమ పిల్లలను తల్లి ఒడిలో నుండి దొరల పటేండ్ల పనిలోకి పంపించి 'నా కొడుకు ఆరుకుంచాల జీతగాడు అయ్యిండంటే, నా కొడుకు ఎనిమిది కుంచాల జీతగాడు అయ్యిండని' ఒకరికొకరు గర్వంగా చెప్పుకుంటూ సంతోషిస్తారు.' అంతేకాకుండా దొరలకు పటేండ్లకు జీతాలు ఉండటం, తరతరాలుగా వస్తున్న తమ కులం ఆచారమని భావిస్తారు అది భగవంతుడే పెట్టాడని నమ్ముతారు.

*** *** ***

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ఆటలపోటీలలో గెలిచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు రాజేశం గ్రామ సర్పంచ్ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తున్నారు. ముగ్గురు విద్యార్థులకు ఇచ్చిన తర్వాత పరుగుపందెంలో గెలిచిన దేవయ్యను పిలవగా వేదిక వద్దకు వచ్చాడు.

"అగో ఈ పోరడు ఎండ్ల గెలిచిండు" అన్నాడు సర్పంచ్ బాపురెడ్డి వెటకారంగా. బహుమతి అందుకొంటున్న దేవయ్య మొహం వివర్ణమయింది.

" నా పేరు పోరడు కాదు దేవయ్య" అని గట్టిగా నొక్కుతూ అనే సరికి అవాక్కయి చూస్తున్న సర్పంచ్ చేతుల్లోంచి బహుమతి స్టీలు గ్లాసును, లాక్కున్నట్లు తీసుకొని వెళ్లాడు దేవయ్య.

ఆ సంఘటన చూసి ఉపాధ్యాయులంత నవ్వుకున్నారు. సర్పంచ్ అవమానంతో కృంగిపోయి సమావేశం ముగిసిన తర్వాత "పోరగండ్లకు మీరు నేర్పే చదువు ఇదేనా" అంటూ ఉపాధ్యాయులపై మండిపడ్డాడు. దేవయ్య పేరు బడిలోనుంచి తొలగించుమని ఆజ్ఞాపించి వెళ్లాడు. అంతటితో ఊరుకోక నుంకరి ద్వారా రాజనర్సయ్యను ఇంటికి పిలిపించి "ఏంరా రాయనర్సుగా నీ కొడుక్కు కండ్లు నెత్తిమీదున్నయ్ చిన్న పెద్ద తేడా లేకుండా మాట్లాడుతుండు" అన్నాడు.

"ఏమన్నడు బాంచెన్ ఏమన్న అంటే క్షమించుండ్రి తెలియని పోరడు" అన్నాడు రాజనర్సయ్య చేతులు జోడించి.

"ఏం చిన్న పోరడురా, ఆనికి మత్తి బాగుంది. పిడుగుల్లాంటి మాటలు మాట్లాడుతుండు. చీరి పోగులు పెడుదుంటి. కాని నీ మొహం చూసి ఊరుకున్న. మూడో తరగతి చదివితేనే గింత జాం వత్తె ఇంకా పెద్ద పెద్ద చదువులు చదివితే

ఎట్లరో! అయిన మీ మాల బూటకమా ! ఆనికి చదువెందుకురా బందుపెట్టి ఎవలకన్న జీతముంచు. లేకుంటే చెడిపోతడు, నీ మంచికోరే చెబుతున్న లేకుంటే నీ కొడుకు నీగ్గాకుండా పోతడు" హెచ్చరిస్తున్నట్లు అన్నాడు సర్పంచ్ బాపురెడ్డి. రాజనర్సయ్య తలూపి దండం బెట్టి బయటికి వచ్చాడు.

సర్పంచి మాటలతో తీవ్ర మనస్తాపం చెందిన రాజనర్సయ్య ఇంటికి వచ్చి ఉగ్ర నరసింహ అవతారమెత్తాడు. దేవయ్య పరిగెత్తినా, దొరికిచ్చుకోని కొట్టి, కండ్లల్ల కారం పెట్టాడు. అంతటితో కోపం చల్లారక ముంతపొగ పెట్టాడు అడ్డు వచ్చిన భార్యను కొట్టాడు. "రేపట్నుంచి బడి గిడి అంటే నీ నెత్తురు కండ్ల జాత్త" అని హెచ్చరించి అలిగి మూలమంచమెక్కి పడుకున్నాడు.

రాజనర్సయ్య పొద్దుగూకంగా లేచి పెండ్లాన్ని, కొడుకును కొట్టానన్న బాధతో మనసున పట్టక మండువకు పోయి తాటికల్లు త్రాగి ఇంటికి వచ్చి కొడుకును పట్టుకొని బావురుమని ఏడ్చాడు.

దేవయ్య రెండు రోజుల నుండి బడికి రాకపోవడంతో రాజేశం పంతులు "దేవయ్యను తీసుకు రాపో" అని శప్రాసి రాజును పంపించాడు. శప్రాసి ఇంటికి వచ్చి చెప్పింది విని "ఆడు బడికి రాడని చెప్పిరాపో" అని భార్యను పురమాయించాడు రాజనర్సయ్య. కొడుకును తీసుకొని రాజవ్వ స్కూలుకు బయల్దేరింది.

"ఏమైందమ్మా దేవయ్య బడికి వస్తలేడు" అన్నాడు రాజేశం పంతులు.

"ఏం బడో ఏమో సారు వీన్ని చదువుకోర అంటే అందరితోని లొల్లులు సంపాయిస్తుండు. ఆళ్ల చెప్పిన కొద్దీ వీనయ్యనేమో కొట్టవట్టే, మొన్న సర్పంచి పటేల్కు మర్రవడ్డడాట అయినే పిలిచి చెప్పినవోల్లె ఓ.... వీనయ్య పెద్ద కొల్లపురం చేసిండు" అంటూ చీర కొంగుతో కళ్ళు తుడుసుకుంది రాజవ్వ. ఇవేమి పట్టించుకోకుండా తన క్లాస్‌రూం పిల్లలనే తదేకంగా చూస్తున్న దేవయ్యను చూసి అచ్చెరువొందాడు రాజేశం పంతులు.

"చూడమ్మా దేవయ్య అటువంటోడు కాదు మంచి పిల్లవాడు. చదువులో కూడా ఉషార్ ఉన్నాడు. ఆ రోజు సర్పంచ్ గారికి మర్రవల్లేదు. ఆయనే కించపరిచినట్లు మాట్లాడిండు. అనవసరంగా బడి బంద్ చేయ్యకుండ్రి రేపట్నుంచి తోలియ్యుండ్రి."

"మీరేమో మంచోడు అనవట్టిరి, దొరలు పటేండ్లేమో గడుసోడు, రంకులోడు, లంగ పోరడని తిట్టవట్టిరి కొట్టవట్టిరి. చిన్న కులపోడు చదువుకోవట్టేనని, కండ్లల్ల నిప్పులు పోసుకుంటుండ్రు ఏంది.? మా అటువంటోల్లు ఎట్లా బత్కిన తిప్పలే ఉంది సారు" అంది రాజమ్మ బాధపడుతు.

"దేవయ్యను చూసి ఇంకా మిగతా వారు చదివిస్తే వారికి పాలేర్లు దొరకరని భయం కావచ్చు. లేకుంటే చదువుకుంటే వారి మాట వినరని భయమో! ఏమో! ఏ ఊరిలో అయినా ఇంతేనమ్మా. చిన్న కులస్థులు చదువుకోవటాన్ని పెద్ద కులస్థులు జీర్ణించుకోరు. ఈ సంస్కృతిని మార్చడానికి ముందు నడిచేవారు అవమానాలను, ఆటుపోట్లను ఎదుర్కొనక తప్పదు"

"ఏం కులమో ఏమో సారు ఈ కులం గంగలవోను. పోరడు చదువుకుంటే మాకులపోల్లు కూడా ఓర్వడు లేదాయే. మమ్ముల పాలేరు తనం ఉండి బ్రతుకుమని దేవుడే చెప్పిండాట...." అని రాజవ్వ చెబుతుంటే ప్రధానోపాధ్యాయులు రాజేశం పంతులు ప్రక్కనున్న మరో ఇద్దరు పంతుల్లు నుదురు చిట్లించి ఆసక్తిగా వింటున్నారు.

"ఎనుకట దేవుడు అన్ని కులపోళ్లను పిలిచి తలోటి ఇస్తూ మా మాల కులపోనికి కఱ్ఱు నాగలి ఇచ్చి ఎవుసం చేస్కోని బత్కుపో అండాట. అవి తీసుకోని రాంగా ఓ పటేలయ్య ఎదురై అవి నాకియ్యవ అని బతిమిలాడితే, సరే నేను మల్లా అడ్కచ్చుకుంటా అని అవి ఆయనకు ఇచ్చి మల్లీ దేవుని దగ్గరకు పోయి ఇషయం చెప్పి మల్లీ ఇయ్యుమండాట. దేవుడు నవ్వి "కఱ్ఱు నాగలి ఎవలకిచ్చినవో ఆయనకే జీతముండి, తల్లిని ఆలిని తిట్టి తవ్వేడు ఇచ్చిన కాడ తంగెళ్ళు పీకి బత్కుపో అని దీవించిండాట. అగో అప్పటినుంచి మా మాలోల్లు కాపోల్లకు జీతముండే బత్కుతుంద్రాట. బోళ్ళకోరు తనానికి పోతె బోకెలు చెతికచ్చినాయి గాని లేకుంటే ఎవుసం మాకే ఉండేదని చెబుతుంటరు మా పెద్దలు" అంది రాజవ్వ

ప్రధానోపాధ్యాయుడు రాజేశం గాఢంగా నిట్టూర్చి "ఇది ఎవరు అల్లిన కట్టుకథనో కాని ప్రతి పల్లెలోను ప్రచారంలో ఉంది. కొన్ని గ్రామాల్లోనేమో మాలవాల్లు, వెలుమ వాళ్ళు, పాలివాళ్ళని చెప్పుకుంటారు అట్లంటే మా గౌండ్ల కులం గురించి ఎన్నో కట్టు కధలు ఉన్నాయి. మా తల్లిదండ్రులు వాటిని నమ్మితే నేను గీ బడిపంతుల్ని అవుదుంటినా? ఈదులు తాళ్ళు గీసుకుంటూ కల్లు అమ్ముకుంటూనే బతకవలసి వచ్చేది. కొన్ని కులాల వాళ్ళు తమ అవసరాలు తీర్చుకొనుటకు ఇతర కులాలపై ఇలాంటివి ఎన్నో సృష్టించి మానసికంగా దాడి చేసి లోబర్చుకున్నరు. అవన్ని అబద్దాలు వాటిని నమ్మద్దు" అన్నాడు.

అంతవరదాక ముసిముసి నవ్వుతున్న గుండయ్య పంతులు మొఖం మాడ్చిండు.

"రాజవ్వ మరి, దేవయ్యను జగిత్యాల్లో హాస్టల్లో చేర్పించుమంటావా? అక్కడైతే ఇట్లాంటివి ఏ బాధలుండవు" అన్నాడు రాజేశం పంతులు.

"అయ్యో సారు గంత దూరం ఒంటిగా ఒక్కడు ఎట్లుంటడు బెంగటీలడ?"

"ఎంత దూరం పది కిలోమీటర్లే. ఒక్కడు కాదు యాభై అరవై మంది దాక ఉంటారు. పుస్తకాలు, బట్టలు, అన్ని సర్కారే ఇస్తుంది. ఇంటికాడ కంటే మంచిగుంటది నామాట విను"

"మీ ఇట్టం సారు, మీకు తోసినట్టు చేయ్యుండ్రి. వీళ్ళయ్యను కూడ పంపిత్తా జెర సంజాయించి చెప్పుండ్రి". అని రాజవ్వ దండం పెట్టి దేవయ్యను తీసుకొని ఇంటికి వచ్చి మొగనికి విషయం వివరించి "ఓసారి పెద్దసారును కలిసి రాపో" అంది. రాజనర్సయ్య దేవయ్యను చదివించుటకు ససేమిరా ఒప్పుకోలేదు.

రాజవ్వ కూడ మొండికేసింది "ఎలుకల బాధకు ఇల్లు కాలపెట్టుకుంటరా పిసోడ" అంటూ మొగన్ని ఎదిరించింది అలిగి, అటంజేసి ఎట్టకేలకు ఒప్పించింది.

రాజేశం పంతులు సహాయంతో దేవయ్యను హాస్టల్లో చేర్పించి వార్డెన్ వెంకట్రాములుతో "అయ్యా! నా కొడుకును మీ చేతుల్లో పెడుతున్న ఆపత్కి, సంపత్కి మీరే జెర మంచిగా చూసుకోండ్రి" అని దండం పెట్టి ఇంటికి వచ్చి మనసు దిట్టం చేసుకుంది రాజవ్వ.

దేవయ్యకు హాస్టల్ వాతావరణం, ఆహారం వేళలు మొదట్లో కొంత కష్టమనిపించినా అలవాటయ్యాక పిల్లలతో పాటు కలిసిపోయాడు. అరవైమంది పిల్లలతో ఒకే కుటుంబంగా జీవించడం చాలా ఆనందంగా అనిపించింది. ఒకరి కష్టసుఖాలు ఒకరు పంచుకునేవారు. కుటుంబ స్థితిగతులు గూర్చి చెప్పుకునేవారు. ఒక్కో విద్యార్థి వెనుక చాంతాడంత కథే ఉంది. వార్డెన్ కూడా వారితో పిల్లవాడిలా కలిసిపోయేవాడు. వారి కష్టాసుఖాలను పంచుకునేవాడు. "సంఘంలో జీవించడానికి మీకు హాస్టల్ జీవితం ట్రైనింగ్ లాంటిది, భవిష్యత్తులో కూడా మీరు ఎక్కువగా కమ్యూనిటీ జీవితాన్నే కోరుకుంటారు" అని చెప్పేవాడు.

దేవయ్యను ఎక్కువగా తల్లే వచ్చి చూసిపోతుండేది. సెలవులకు మాత్రమే ఇంటికి వెళ్ళేవాడు. దూరంగా ఉండటంచే దేవయ్య ఇంటికి వచ్చినపుడు రాజనర్సయ్య ఆప్యాయంగా చూసుకునేవాడు. పెద్ద వాల్లను చదివిపియ్యకపోతి వాళ్ళు పెద్దపెరిగినంక 'వాన్నేతీర మమ్మల్నేతీర చూసిండ్రని అంటారేమో' అని బాధ పడేవాడు.

దేవయ్యకు తండ్రంటే భయం తొలగిపోతున్న సమయంలో ఒకరోజు ఇంటిలో శుక్రవారం (లక్ష్మి) పూజ పెట్టుకొని కుటుంబ సభ్యులంత అయ్యగారి (మాలజంగం) కాళ్లకు మొక్కి, దేవయ్య మొక్కనని మొండికేసినందుకు రాజనర్సయ్య చితకబాధడంతో తండ్రంటే మరింత భయం పెరిగింది.

దేవయ్య పదవతరగతి ఫస్టుక్లాసులో పాసయ్యాడు. హాస్టల్‌ను విడిచి వెళ్ళేటపుడు చాలా బాధపడ్డాడు. తన హాస్టల్ జీవితానికి గుర్తుగా తాను ఇన్ని రోజులు తిన్న ప్లేటును వార్డెన్‌ను అడిగి వెంట తీసుకెళ్ళాడు. హాస్టల్ విద్యార్థులు ఎవరి ప్లేట్లపై వారి పేరును మొలతో చెక్కుకుంటారు. కొన్ని ఏళ్ళ తరబడి అదే ప్లేటులో తింటారు కాబట్టి, తిరిగి ఇచ్చేటపుడు బాధపడతారు.

కాలేజికి వెళుతున్న దేవయ్యకు హాస్టల్ వార్డెన్ వెంకట్రాములు ఎదురై "ఏం దేవయ్య బాగున్నవా" అన్నాడు సైకిల్ దిగుతూ. దేవయ్య నమస్తే పెట్టి "కష్టాలు మళ్లీ ఎదురైనాయి సార్, కాలేజి హాస్టల్ లేక రూం తీసుకుని చదువుడు కష్టమైతుంది. పప్పు, ఉప్పు, నెలనెల రూం కిరాయి ఇచ్చుటానికి ఎల్లక మా అయ్యా చదివిన చదువు చాలు బందుచెయ్యుమని లొల్లి బెడుతుండు. మొన్న పరీక్ష ఫీజు కట్టాలని అడిగితే మా అవ్వ ఇంట్లో ఉన్న పాత ఇనుప సామాను అమ్మి ఇచ్చింది." అన్నాడు బాధపడుతు.

"చూడు దేవయ్య కష్టాలు నీ కొక్కడికే కాదు ఎంతో మందికి ఉన్నవి. పని చేసేటప్పుడు మనకన్న పైనున్న వారిని చూడాలి, ఎక్కువ పని చేయగలుగుతాం. అన్నం తినేటపుడు మనకన్న కిందనున్న వారిని చూడాలి తృప్తిగా తినగల్గుతాం. నేను ముప్పయి ఏళ్ళ క్రిందట నీ కన్న ఎక్కువ కష్టాల్లో ఉండి చదువుకున్న, మాది నిరుపేద పద్మశాలి కుటుంబం మా తండ్రి చిన్నప్పుడే చనిపోయిండు. నేను బడికి పోయి వచ్చిన తర్వాత మా అవ్వకు బీడీలకు దారం కట్టేవాడిని, కల్లు మాండువకు పోయి గారెలు, శెనగలు అమ్మేవాడిని" అంటూ తన బాల్యంలో అనుభవించిన కష్టాలను చెప్పి జేబులోనుండి వంద రూపాయలు తీసి ఇవ్వబోతే దేవయ్య నిరాకరించగా బలవంతంగా జేబులో పెట్టి "పిచ్చి పిచ్చి ఆలోచన్లు పెట్టుకోకు మంచిగా చదువుకో" అని చెప్పి వెళ్ళిపోయాడు వార్డెన్ వెంకట్రాములు.

ఆ సంఘటన జరగక పోతే దేవయ్య జీవితం మరోలా ఉండేదోమో!

వార్డెన్ ఇచ్చిన స్ఫూర్తితో తన రూమ్మేట్స్‌తో కలిసి రాత్రిళ్ళు కొత్తగా కడుతున్న ఇండ్లకు బరంతు నింపపోతు, న్యూస్ పేపర్లు పంచుతూ, ట్యూషన్లు చెప్తూ డిగ్రి పూర్తి చేసి, పెళ్లి చేస్తామని తండ్రి ఎంత మొత్తుకున్నా వినకుండా హైద్రాబాద్ 'లా' కాలేజిలో చేరాడు దేవయ్య.

*** *** ***

ప్రైమరి స్కూల్‌కు హెడ్మాస్టార్‌గా పని చేసిన రాజేశం పంతులుకు గుండయ్య పంతులు శికాయితితో సర్పంచ్ బాపురెడ్డి బదిలీ చేయించగా పదహారేళ్ళ తర్వాత ప్రమోషన్‌పై మళ్ళీ అదే గ్రామానికి అప్పర్ ప్రైమర్ స్కూల్ హెడ్మాస్టర్‌గా వెళుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది.

బస్సు దిగిన రాజేశం పంతులు చుట్టు పరికించి చూసాడు. 'గ్రామం చాల మారిపోయింది. అప్పుడు దొరల రెడ్డీల ఇండ్లు తప్ప మిగతా కులాల వారివి చాలా మట్టుకు పూరి గుడిసెలే ఉండేవి. ఇపుడు అన్ని బెంగుళూరు గూనతో చూడ ముచ్చటగా ఉన్నవి. గుడిసెలు మచ్చుకు కూడా కనిపిస్తలేవు.' అని ఆలోచిస్తు నడుస్తున్న రాజేశం పంతులును మధ్యమధ్య గ్రామస్థులు గుర్తుపట్టి ఆప్యాయంగా పలకరిస్తున్నారు.

చార్జి ఇచ్చిన తర్వాత "సర్పంచ్ గారిని పరిచయం చేస్తా పదండి" అని పాత హెడ్మాష్టర్ మల్లయ్య యాదవ్ రాజేశం పంతులును గ్రామ పంచాయితీ కార్యాలయానికి తోడ్కొని వెళ్ళాడు.

గ్రామ పంచాయతి కార్యాలయం ముందు సమావేశంలో మండల అధికారులతో జన్మభూమి కార్యక్రమాలపై, గ్రామ సమస్యలపై చర్చిస్తున్నాడు సర్పంచ్. చుట్టు ఉన్న గ్రామస్థులు ఆసక్తిగా చూస్తున్నారు.

మధ్య కుర్చిలో కూర్చుని ఉన్న సర్పంచితో "వీరు మనకు కొత్తగా వచ్చిన హెడ్మాష్టర్" అని పరిచయం చేసాడు పాత హెడ్మాష్టర్. రాజేశం పంతులును చూసి సర్పంచ్ అచ్చెరువొంది పిడుగుపాటున లేచి రాజేశం పంతులు పాదాలకు నమస్కరించాడు. ఆశ్చర్యంగా చూస్తున్న రాజేశం పంతులుతో "నేను సార్! దేవయ్యను నన్ను గుర్తు పడ్తలేరా మీరే గదా నన్ను హాస్టల్లో చేర్పించింది" అన్నాడు.

రాజేశం పంతులు ఆశ్చర్యంలోంచి తేరుకొని "ఆ... బాబు నువ్వా? సర్పంచివైనావా" అంటూ కౌగిలించుకున్నాడు. ఉద్వేగ భరితంగా చూస్తున్న మండల రెవెన్యూ అధికారులు ఉత్సాహంతో చప్పట్లు కొట్టడంతో గ్రామస్థులు శ్రుతి కలిపారు.

దేవయ్య న్యాయ శాస్త్రం (ఎల్.ఎల్.బి.) చదివిన తర్వాత ప్రాక్టీసు చేస్తూనే గ్రామస్థులకు చేదోడువాదోడుగా ఉంటూ అంబేడ్కర్ యువజన సంఘాలు, కుల సంఘాలు పెట్టించి ప్రజలను చైతన్య పరుస్తున్న సమయంలో సర్పంచ్ ఎస్సీ రిజర్వ్డ్ కావడంతో గ్రామస్థుల ప్రోద్బలంతో పోటీ చేసి గెలిచాడు. ఏడాదిన్నర కాలంలోనే గ్రామాన్ని ఎంతో అభివృద్ది పరిచాడు. ఇప్పుడు దేవయ్యను చూసి గ్రామంలోని ప్రతికులం వారు తమ పిల్లలను బడికి పంపిస్తున్నారు.

రిపబ్లిక్ డే సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు రాజేశం ఉపన్యాసం ఇస్తూ స్వాతంత్ర్యం, చదువు యొక్క ఆవశ్యకత గురించి చెప్పుచూ దేవయ్య చదువుకున్న తీరును ఉదాహరిస్తూ దేవయ్య తల్లిదండ్రులు అభినందనీయులని చెప్పుకు పోతుంటే విద్యార్థులు గ్రామ ప్రజలు రెప్పవాల్చకుండా చూస్తున్నారు. జనం వెనకాల గోడకు జారగిల బడి నిల్చుండి వింటున్న రాజనర్సయ్యకు శెమటలు పట్టినాయి. రాజేశం పంతులు దేవయ్య పేరును

ఉచ్చరించినప్పుడల్లా ఆనందంతో చప్పట్లు కొడుతున్నాడు.

తర్వాత దేవయ్య విజేతలకు బహుమతులు అందజేస్తూ చిరునవ్వుతో వారి బుగ్గ గిల్లుతుంటే కన్నార్పకుండా తదేకంగా దేవయ్యనే చూస్తున్న రాజేశం పంతులుకు ఆనాటి సంఘటన గుర్తుకు వచ్చి నవ్వుకున్నాడు.

తదుపరి దేవయ్య మాట్లాడుతూ అందరు చదువుకున్నప్పుడే స్వాతంత్ర్యం సంపూర్ణం అవుతుందని చదువు యొక్క గొప్పతనం గురించి చెబుతూ వుంటే దేవయ్య మాట్లాడే తీరుకు, వాగ్దాటికి రాజేశం పంతులు, మిగతా పంతుల్లు గ్రామస్థులు మంత్రముగ్ధులయ్యారు.

బడిలో జరుగుతున్నదంతా రాజేశ్వర్‌రావు మనవరాలు భారతి, బాపురెడ్డి కూతురు పద్మ బంగ్లా మీది నుండి చూస్తున్నారు. దేవయ్య అనర్ఘలమైన ఉపన్యాసానికి భారతి అశ్చర్యపోయి 'ఆనాటి దేవయ్య ఇంతగొప్ప వక్త, ఇంత పెద్ద మేధావి అయ్యిండా!' అని అచ్చెరువొంది ముక్కుపై వేలేసుకుంది. 'ఇతను భవిష్యత్తులో మరెన్నో ఉన్నతమైన పదవులను అలంకరించి ఈ గ్రామానికి, తన తల్లిదండ్రులకు గొప్ప పేరుప్రతిష్టలు తీసుకురావాలి' అని నిండు మనసుతో దీవించింది. 'ఇట్లాంటి కొడుకు ఒక్కడున్న చాలు' అని తన సంతానలేమి గుర్తుకు వచ్చి కంటతడి పెట్టింది.

"ఔను ఆంటీ... ఇంత గొప్ప మేధావి, వక్త మన గ్రామంలోనే ఉండంగా మరి మా మమ్మీ, డాడీ నాకు ఎక్కడెక్కడో సంబంధాలు వెతుకుతుండ్రు అనవసరంగా." అంటూ ముసి ముసి నవ్వింది పద్మ.

భారతి నవ్వుతూ "అమ్మదొంగా" అంటూ పద్మ బుగ్గ గిల్లింది.

నోరు తెరిచి చూస్తున్న రాజనర్సయ్య "వీడు నాకొడుకేనా? నాతో ఎన్నో సార్లు దెబ్బలు పడ్డ మా దేవడేనా" అని ముక్కున వేలేసుకున్నాడు. భార్యతో ఎప్పుడు వెటకారంగా 'నీ చిన్న కొడుకు' అనేది గుర్తుకు వచ్చి ఔను వీడు నా భార్య కొడుకే ఈ పేరు నా భార్యకే దక్కాలి నాక్కాదు. ఆనికి నేను ఏమి ఇవ్వలేదు. తన్నులు, గుద్దులు తప్ప. ఇంటికి పోయి 'నీ చిన్న కొడుకు పని మంతుడే కాదు బుద్ధిమంతుడు, గొప్ప తెలివిమంతుడు కూడా' అని నా భార్యను మెచ్చుకోవాలి అనుకోని ఇంటికి వెళ్తున్న రాజనర్సయ్య, రాజేశ్వర్‌రావుదొర కూర్చుండే గద్దెవైపు చూస్తు 'తుప్పు' అని ఊమ్మి వడివడిగా నడవసాగాడు.

*** *** ***

దొమ్మరి గంగడు

పోలీసులు రావడం చూసి దొమ్మరి గంగడు ఇంటి వెనకనుండి పారిపోయాడు. గంగని భార్య కళావతి వంట చేస్తోంది. పోలీసులు ఇంట్లోకి ప్రవేశించి "నీ మొగుడేడే లంజె" అనడంతో బిత్తరపోయింది. పోలీసులు ఇల్లంత కలియతిరిగి ఇల్లంత ఆగమాగం జేసి "మర్యాదగా దొంగిలించిన సొమ్ము ఏడ బెట్టిండో చెప్పు" అంటూ కళావతిని కొట్టి "దొంగిలించిన మూడు తులాల బంగారాన్ని లేదా ఇరవై వేల రూపాయలు పట్టుకొని వచ్చి లొంగిపొమ్మను కేసు మాఫీ చేస్తాం లేకుంటే కేసుపెట్టి జేలుకు పంపుతాం" అని వెళ్ళిపోయారు.

గప్పుడే బడినుండి వచ్చిన గోపి పోలీసుల బీభత్సానికి భయపడి మూలకు ఒదిగాడు. పోలీసులు వెళ్ళిపోయిన తర్వాత "మన అయ్య దొంగతనాలు జేసుడు మానుకున్నాడు కదామ్మ. మరి పోలీసులు మన అయ్య దొంగతనం చేసిండు అంటారేంది?" అన్నాడు.

"దొంగతనం చేయకుంటే పోలీసులు ఊరుకుంటారా? చేయలేదంటే నమ్ముతారా? ఎక్కడ దొంగతనం జరిగినా దొమ్మరోల్లు అల్కగున్నారని తీస్కపోయి కేసులు పెట్టవట్టిరి ఈ కులానికి అగ్గిదల్గ ఈ కులంలో ఎందుకు పుట్టిమిరా దేవుడా! లంజె లంజంటే లంజె పేరు. దొంగ దొంగంటే దొంగ పేరు ఎంత మంచిగా బత్కిన గాని దొమ్మరోల్లు దొంగలు లంగలు అనవట్టిరి. ఇపుడు ఇరవై వేల రూపాయలకు ఏడికోవుడురో నా కొడుకా" అంటూ కొడుకును పట్టుకొని బోరుమంది కళావతి.

గంగడు చిన్నగుండంగా దొమ్మరోల్లు ఆడే ఆటల్లో (జిమ్నాస్టిక్) పేరెల్లినవాడు. దొమ్మరోల్ల ఆటలకు జనాదారణ తగ్గి గంగడు కూలీగా మారి రైసు మిల్లులో పనిచేస్తున్నపుడు బియ్యం దొంగిలించాడని అనుమానంతో పోలీసులకు పట్టించాడు మిల్లు యజమాని. అప్పటి నుండి పోలీసులు గంగని మీద ఎన్నోసార్లు కేసులు పెట్టి జైలుకు పంపారు. ఇప్పుడు గంగడు పోలీసుల రికార్డు ప్రకారం పేరు మోసిన గజదొంగ. గంగనికి గజదొంగగా పేరు తప్ప సంపాదించుకున్నది ఏమీ లేదు తన్నులు గుద్దులు తప్ప. గదే గుడిసె, గదే బత్కు, కొన్ని కేసులు కొట్టుడు పోయినవి. కొన్ని కేసులకు కోర్టుకు నడుస్తుండు.

ఒక గంగడి మీదనే కాదు ఆ చుట్టు ప్రక్కల ప్రాంతంలో ఎక్కడ దొంగతనం జరిగినా మొట్టమొదట ఆ ప్రాంతంలోని దొమ్మరి వాడలపైనే దాడి చేస్తారు పోలీసులు, దొరికిన వారిని దొరికినట్లు తీసుకపోయి కేసులు పెడతారు. కేసుల్లో ఇరుక్కోనివారు, పోలీసుల చేత దెబ్బలు పడనివారు ఆ వాడల్లో అరుదుగా ఉన్నారు.

ఓ వకీలు బ్రోకరును పెట్టుకోని వారి కేసులతో మూడంతస్తుల బిల్డింగు కట్టుకున్నాడు. కాని వారి జీవితాల్లో ఏమాత్రం ఎదుగుదలలేదు.

గంగనికి ముగ్గురు బిడ్డలు ఒక్క కొడుకు. పెద్ద బిడ్డ సరోజ వ్యభిచార వృత్తి చేయనని మారాం చేస్తే గంగడు కొట్టి తిట్టి దందలోకి దించితే కొన్నాళ్ళకు ఎయిడ్స్ రోగంతో మరణించింది. రెండో కూతురు లత లారీ డ్రైవర్ లక్ష్మణ్‌తో లేచిపోయింది. చిన్న కూతురు కవిత ఇంకా పెద్దమనిషి కాలేదు. గోపి చిన్నప్పుడు ప్రక్క వీధిలోని శీను సోపతి పట్టి సంబరంగా బడికి పోతానంటే గంగడు తోలేసిండు. గోపికి పదేళ్ళు దాటిననుండే చదువు బందు చేయుమని మొదలు పెట్టిండు గంగడు. గోపి చదువు బందు చేయలేదు. గంగడు గోపిని తిట్టి, కొట్టి యాష్టకు వచ్చి వదిలేసిండు.

గంగడు పొరుగూరిలో ఉన్న బందువు దగ్గర ఇరవై వేలు అప్పు తీసుకుని పోలీసులకు ముట్టజెప్పిండు. పోలీసులు ఆ రూపాయలతోని బంగారం కొనిపించి గంగడి మీదే కేసుపెట్టి జైలుకు పంపిండ్రు. గంగడు నాలుగు నెలల తర్వాత బెయిలు మీద బయటకు వచ్చేసరికి చిన్న కూతురు కవిత పుష్పవతి (పెద్దమనిషి) అయ్యింది. కవిత చేత దంద చేయించి బాకీలు తీర్చాలని గంగడు ఓ ఆసామిని వెయ్యి రూపాయలకు మాట్లాడి కార్యానికి (కాల్లగోల్లు) ఏర్పాట్లు చేసాడు. కవిత దంద చేయడానికి ఒప్పుకోలేదు. గంగడు కవితను కొట్టిండు. బార్య కొడుకు అడ్డం పోతే "పెద్దదేమో అట్ల చచ్చిపోయింది. నడ్పిదేమో తక్కో కులం వానితో లేచిపోయింది. ఈడేమో చదువు బందు పెట్టి ఏదైన పని చేయరా అంటే చేస్తలేడు. ఇప్పుడు దీనితోని దంద చేయించద్దు అంటుండ్రు మరి ఇల్లు ఎట్ల గడుస్తుంది. బాకీలు ఎట్ల తేర్చుడు నీ కాన్పు కగ్గిదల్గ గిట్ల తయారైంది" అంటూ భార్యను కొడుకును కూతుర్ని చావబాదాడు.

గోపి కాలేజీలో చేరిండు గోపి క్లాసుమేట్సు కొందరు "మీ అక్క దగ్గర్కి రమ్మంటావ" అంటూ గోపిని ఎగతాళి చేస్తు ఆట పట్టించుడు మొదలు పెట్టిండ్రు. గోపికి ఓపిక నశించి తిరిగి అదేమాట అన్నందుకు "మమ్మల్ని గంత పెద్ద మాట అంటావారా దొమ్మరి లంజకొడుక" అంటూ పెద్ద గొడవ చేసి గోపిని కొట్టినారు. గోపి చాలా బాధ పడ్డాడు. క్లాసుమేట్సు వింత చూపులు వ్యంగ్యం మాటలు భరించలేక కాలేజి మానేసిండు.

గంగనికి రొట్టె విరిగి నోట్లో పడ్డట్లయింది. గోపి చదువు మానేసినందుకు చాలా ఆనందించాడు. "నేను చెప్పితే ఇన్నావా బయటకు పోతే మనలను ఓ పురుగును చూసినట్లు వింతగా చూస్తారు. మన ఇండ్లల్లకు వచ్చేటోల్లు కూడా మనం బయట కనపడితే మాట్లాడరు. అయినా వాళ్ళు ఇలువ ఇత్తేంది ఇయ్యకపోతేంది. మన ఇలువ మనకుంది మన పని మనం చేసుకుందాం. నా మాట విని కవితతోని దంద చేయించుదాం లేదా నాతో ఒక్కసారి దొంగతనానికిరా బాకీలు తీర్చి నువ్వన్నట్లు బత్కుదాం" అన్నాడు. గోపి ఒప్పుకోలేదు.

గంగడు చిర్రెత్తిపోయి "కవిత దంద చేయడానికైనా ఒప్పుకో లేదంటే నువ్వు నాతో దొంగతనానికైన రా లేదంటే ఈ కత్తితోని మీ అవ్వను పొడిసి నేను పొడుచుకుంట, ఇయ్యాల అటో ఇటో తేలిపోవాలి" అంటూ కత్తి తీసి బెదిరించిండు.

గోపి భయపడి దొంగ తనానికి ఒప్పుకున్నాడు. గోపికి దొంగతనంలోని మెళకువలు నేర్పి గంగడు ముందుగా వేసుకున్న పథకం ప్రకారం నడిజాము రాత్రి దాటినంక గోపిని వెంటబెట్టుకోని ఫైనాన్స్ పెట్టి మందిని ముంచి లక్షలు సంపాదించిన కొండల్‌రావు ఇంటికి బయలుదేరాడు.

అనుకున్న ప్రకారం దొడ్డి దారి గుండా ఇంటిలోకి ప్రవేశించి దొంగతాళంచేవులతో బీరువా తీసి చేతికందినదంత మూటగట్టుకొని బయటకు వస్తుండగా ఇంట్లో వాళ్ళు మేలుకొని కేకలు వేస్తే, చుట్టు ప్రక్కల వారు గంగని, గోపి వెంట పడ్డారు. గంగడు, గోపి ఇండ్లు దాటేసి పంట పెరండ్లల్లకు పరుగుదీసింండ్రు. అడవి పందుల కోసం శికారి గాళ్లు పెట్టిన కరంటు తీగ షాక్ తగిలి "అవ్వా" అంటూ పడిపోయిండు గంగడు. వేనక ఉరికి వస్తున్న గోపి "అయ్యా" అంటూ గంగన్ని పట్టుకొని ఏడ్వసాగాడు.

"ఏడ్వకు బిడ్డా, ఈ డబ్బుల ముల్లే, నా తలను నరుక్కోని తీస్కోనిపో" అన్నాడు గంగడు.

"లేదయ్యా నిన్ను దావఖానకు తీస్కపోయి బతికించుకుంట" ఏడుస్తు అన్నాడు గోపి.

"నేను బాగ సేపు బత్క బిడ్డా జనం దగ్గరికత్తుంండ్రు, వాళ్లకు దొరికితే నిన్ను గూడ చంపేత్తరు ఆలోచించకు ఇగో కత్తి" అంటు బోడ్లో ఉన్న కత్తి తీసాడు గంగడు.

"నేను ఆ పని చేయలేనయ్యా" అంటూ ఏడ్వసాగాడు గోపి.

గంగడు కోపానికి వచ్చి "నేను నీకు దొంగతనానికి రాంగ ఏమని చెప్పిన?

దొంగతనానికి వచ్చినపుడు మనకు పాపం, గోష, జాలి ఉండకూడదు. ఈ డబ్బు తీసుకపోయి నీకిష్టమయినట్లు బతుకు మంచిగా చదువుకో, నా మాట విను, ఈ ముల్లెను నా తలకాయను తీసుకపోకుంటే మీ అవ్వమీద ఒట్టే" అంటూ కత్తితో మెడపై నరుక్కున్నాడు. గోపి కళ్ళు మూసుకున్నాడు. గంగని ప్రాణం పోయింది. జనం కేకలు వేస్తు దగ్గరగా వస్తున్నారు. గోపి ఏడుస్తూ జనం వైపు చూసి ఆలోచించకుండా డబ్బుల మూటను తండ్రి తలను నరుక్కొని పరుగందుకున్నాడు.

తెల్లవారి పోలీసులు గంగని తల లేని మృతదేహంను గుర్తుపట్టలేదు. కరెంటు షాకు వల్ల శరీరమంత కమిలిపోయి నల్లగా అయింది. మొండెం ఎవరైంది గుర్తుపట్టడానికి ఆ ప్రాంతంలో దొంగలుగా ముద్రపడి జీవించే వారి గ్రామాలలో గంగని మొండెంను ట్రాక్టర్ పై పెట్టి తింపుతున్నారు పోలీసులు. చూపించిన ప్రతి గ్రామంలో మొండెం ఎవరైంది గుర్తుపట్టలేదు. చివరగా జగిత్యాలలో ఇందిరానగర్ కాలనీకి తీసుకవస్తుండ్రని తెలవగానే గోపి భయపడ్డాడు. శవాన్ని చూసి తల్లి తప్పకుండా ఏడుస్తుంది పోలీసులకు అనుమానం వచ్చి పట్టుకోకముందే లొంగిపోవాలనుకున్నాడు. గోపికి మరో అనుమానం వచ్చి ఆ ప్రయత్నం మానుకున్నాడు. ఇపుడు పోలీసులకు లొంగిపోతే దొంగగా ముద్ర పడుతుంది. ఇక ఎక్కడ దొంగతనం జరిగినా పోలీసులు జీవితాంతం వేదిస్తూనే ఉంటారు. దొంగగానే జీవితాంతం బత్కవలసి వస్తుంది. పైగా ఆ డబ్బును ఓ పవిత్ర కార్యానికి ఉపయోగించాలి. దొంగిలించిన డబ్బుతోనే మావాళ్ళ జీవితాలను మార్చాలి అని నిర్ణయించుకొని తల్లికి విషయం చెప్పి ఏడవవద్దని ధైర్యం చెప్పిండు.

తలలేని మృతదేహాన్ని కాలనిలోని ప్రతి ఇంటిముందు ఆపి ఇంటివాళ్లని పిలిచి చూపిస్తున్నారు. చూడకుండా ఒక్కరిని కూడా వదిలిపెడతలేరు పోలీసులు. శవం గంగని ఇంటి ముందుకు వస్తుంది. గోపి తల్లి మొఖంలోకి చూసాడు. కళావతి కళ్లల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. గోపి ముందుగా చెప్పినట్లుగా ఆనంకాయ తెంపటానికి గుడిసె పైకి ఎక్కి కాలుజారి కిందపడ్డాడు. కళావతి కొడుకును పట్టుకోని "ఆనంకాయ తెంపుమనకున్న మంచిగుండు కొడుకా" అంటు బావురుమంది.

పోలీసులకు అనుమానం రాలేదు. కొడుకుకు దెబ్బ తగిలినందుకు ఏడుస్తుంది అనుకొని వెళ్లిపోయినారు.

తెల్లవారింది గోపి గండం గట్టెక్కిందనుకొని ఊపిరి పీల్చుకుంటే తల్లి మరో సమస్య తెచ్చి పెట్టింది. "తండ్రికి కొడుకు తలకొర్రాయి పెట్టకపోతే, మొండెం ఓ చోట తల ఓ చోట కాలబెడితే మీ అయ్యకు ఆత్మశాంతి ఉండదు మొండెం కాలేసిన చోటనే తలను కూడా కాలేసిరాపో" అని పోరు పెట్టింది. తల్లి పోరు పడలేక గోపి

ఒప్పుకున్నాడు.

తలలేని మృతదేహంను శ్మాసనంలో కాలబెట్టారు. పొద్దంత పోలీసులు కాపలగా ఉండి చీకటి పడుతుండగా నలుగురు సుంకరోల్లను కాపలగా ఉంచి వెళ్లిపోయారు.

విషయం తెలుసుకున్న గోపి నడిజాము రాత్రి తండ్రి తలతో శ్మాశానానికి చేరుకోని తండ్రి తలపై గ్యాసు పోసి నిప్పంటించి భయంకరంగా అరుస్తూ తండ్రి మొండెంను కాలబెట్టిన చితి వైపుగా పరుగుతీసాడు. సుంకరోల్లు జడుసుకోని "వామ్మో దయ్యం దయ్యం" అంటూ పరిగెత్తారు. గోపి తండ్రి తలను మొండెంను కాలబెట్టిన చితిపైనే కాలబెట్టి పిడికెడు బూడిదను తీసుకొని ఇంటికి తిరిగి వచ్చాడు.

తెల్లవారి విషయం తెలుసుకున్న పోలీసులు "వాడెవడో చనిపోయిన వ్యక్తికి రక్త సంబంధీకుడు అయి ఉంటాడు వాడు తప్పకుండా బూడిదను గోదావరిలో కలపడానికి వస్తాడు" అని ఆ ప్రాంతంలో గోదావరి నదికి రేవులు ఉన్న ప్రతి చోట నలుగురేసి పోలీసోల్లను కాపలా పెట్టినారు.

గోపి తండ్రి బూడిదను గోదావరిలో కలపడం కష్టమనిపించి తల్లిని విచారించాడు. తల్లి ఉపాయం చెప్పింది. తల్లి చెప్పినట్లుగా గోపి మబ్బుల లేచి గూల్లోల్లు (బెస్తవాల్లు) వాడే చాపల వలను తీసుకొని చేపలు పట్టడానికి గోదావరికి బయలుదేరాడు. గోపి చేపలు పట్టుకుంటు ఓ రేవు వద్దకు వచ్చాడు. తల్లి కడవలో బూడిద పోసి పైన బువ్వ పెట్టుకొని రేవు వద్దకు వచ్చి "బువ్వ తిందురారా పొద్దు బాగా ఎక్కింది కొడుకా" అంటు పిలిచింది.

గోపి గోదావరి ఒడ్డు వద్దకు వచ్చి కోపంతో "నీ యవ్వ గింత పొద్దెక్కేదాక ఏం జేసినవే నేనిక్కడ ఆకలితో సత్తున్న" అంటూ తల్లిని ఓ దెబ్బ కొట్టి నూకేసినాడు. తల్లి తుల్లిపడి కడవతో సహా గోదావరిలో పడ్డాది. గోపి కంగారు పడి "అవ్వ" అంటూ గోదావరిలో దూకి తల్లితో పాటు మూడుసార్లు మునిగి తల్లిని తీసుకొని ఒడ్డుపైకి వచ్చిండు.

అక్కడ ఉన్న పోలీసులు "తల్లిని కొడుతావురా పిచ్చోడ ఇంటికి తీసుకపో" అని మందలించిండ్రు. గోపి తల్లిని తీసుకొని ఇంటికి వచ్చిండు.

సంవత్సరం తిరిగేలోగా గోపి ఇందిరానగర్ కాలని దొమ్మరివాల్ల పిల్లలకోసం స్కూలు భవనాన్ని కట్టించిండు. భవనాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రిచే ప్రారంభోత్సవం జరిపించి గోపి ఇంటింటికి తిరుగుకుంటూ దొమ్మరివాల్ల పిల్లలను బడికి తీసుకవచ్చి తానే చదువు చెప్పుచూ పంతులయ్యిండు.

❀ ❀ ❀

మావూరి ముచ్చట్లు

నడిజాము నాత్రి దాటింది కావచ్చు. గప్పటి దాక మా అయ్యా సాత్రాలు జెప్పుతుంటే మేమంత మక్కబూరు తీసి గప్పుడే పడుకున్నం. కన్నంటుకుంటుంది ఎవరో వచ్చి దబదబ తలుపు కొడుతు "పోచన్న పోచన్న" అని పిలిచిండు. అందరం లేచి కూసున్నం. ఎండకాలం పూట అసలే దొంగల భయం. మా అన్న అటుకుమీదున్న దుడ్డుకర్ర తీసిండు. మా అయ్య సరాయించుకుంటు తలుపు తీసి చూస్తే రాజన్న. మా ఇంటికి రెండిండ్ల అవతలుంటది రాజన్న ఇల్లు.

"ఏందిరా గింత రాత్రచ్చినవ్" అన్నాడు మా అయ్య ఆవులిస్తూ...

"మా అదినెను చుక్కారెడ్డి గాన్ని దొరకబట్టినామే" అన్నాడు రాజన్న అసపోసుకుంటు,

'ప' అంటూ నడిచాడు మా అయ్య వారి వెనక మా లింగన్న కాసే గట్టిగా చెక్కి దుడ్డు కర్ర ఊపుకుంటు నడిచిండు వారి వెనుక మా అవ్వ పండుకున్న మా చెల్లెను భుజానేసుకొని "మనం కూడ పోదాం ప" అంటూ నన్ను వెంట తీసికెల్లింది.

మా అయ్యకు రాజన్న తమ్ముని వరసవుతాడు. బాల్ తాతకు ఇద్దరు కొడుకులు. నర్సయ్య పెద్దోడు, రాజన్న చిన్నోడు, నర్సయ్యకు లగ్గమయింది, ఒక కొడుకు. రాజన్నకు ఇంకా లగ్గం కాలేదు. రాజన్న చిన్నగుండగనే తల్లి చచ్చిపోయింది. బాల్తాతనే ఆడిపని మొగ పని చేసుకుంటు ఇద్దరు కొడుకులను సాదుకుంటు వచ్చిండు. నర్సయ్యకు లగ్గమయినంక బాల్తాతకు ఆడిపని తప్పింది.

గంత రాత్రి గంత మందికి ఎట్లా తెలిసిందో ఏమో మావాడకట్టు మందంత గుమి గూడింద్రు. మగవాళ్ళు కోపంతో ఊగిపోతుంద్రు. ఆడవాళ్లు గుసగుస పెట్టుకుంటు పెదవులు విరుస్తుంద్రు. మా అయ్య తలుపు తీయగానే కొందరు చుక్కారెడ్డిని, శాంతమ్మను కొట్టుటానికి ఉరికింద్రు. మా అయ్య వారిని అడ్డగించి "ఆగుంద్రా ఉరుకులాటెందుకు" అంటూ వారిని బయటకు నూకేసిండు. చుక్కారెడ్డి మంచం మీద కూసోని బీడి తాగుతు చెమటలు తుడుసుకుంటుండు. శాంతమ్మనేమో మూలకు కూసోని నాలెమొఖమేసింది. మా అయ్య ఇద్దర్ని తేరిపార చూసి "పెద్ద

కులమని నీల్గుతవ్ గదా, మరి గిదేంటిది" అంటూ థు అని ఊంచిండు చుక్కారెడ్డిని చూస్తు.

మా అయ్య వెనక నిల్చున్న బాల్ తాత "ఈనితోని మాటలేందిర తన్నేదానికి" అంటూ మోకాలుతోని చుక్కారెడ్డిని గుద్దిండు. బాల్తాతకు అరవై ఏళ్లుంటాయి కావచ్చు కోపంతో పడుచోనిలాగ ఊగిపోతుండు.

మా అయ్య బాల్తాతను గట్టిగా దొరకబట్టి "ఆగే చిన్నయ్య ఎందుకు తొందర పడుతున్నవ్" అని శాంతమ్మ వైపు చూస్తు "నర్సయ్య ఎటు వేయిండే" అన్నాడు.

మూడోసారికి "పటేండ్లింటికి కావలివేయిండు" అంది శాంతమ్మ నాలెగీతలు గీస్తు.

"ఆం... ఆన్నేమో కావలితోలి ఈనితోని కులుకుతున్నవ్, థు నల్లి లంజె ఎడన్న నూతిల దునికి సావుపో" తిట్టుకుంటు కోడలు మీదికి ఉరికిండు బాల్తాత.

మా అయ్య అడ్డం నిలబడి "ఆగే నర్సడైతే రాని..." అని ప్రక్కనున్న ఎల్లయ్య తోని "నువ్వు పోయి నర్సయ్యను తీస్కరాపో, ఆనికి ఏక్దం గిట్లా అని చెప్పకు ఏదో ఓటి చెప్పి తీస్కొనిరా" చెప్పి తోలేసి పోషమ్మను పిలిచి "దాని దగ్గరే ఉండుండ్రి ఇజ్జత్కి ఏమన్న చేస్కోయిక్క" అన్నాడు.

కొద్ది సేపట్కి నర్సయ్యను తోలుకొని వచ్చాడు ఎల్లయ్య. నర్సయ్యకు విషయం అర్థమయింది కావచ్చు వత్తెనే నాలెకు మొఖమేసిండు.

"నువ్వెందుకురా బాధపడ్తవ్ ఆ లంజెను తల్లిగారింటికి పంపిద్దాం" అంటూ నర్సయ్యను పట్టుకొని బోరుమని ఏడ్చిండు బాల్తాత.

"ఇగో... ఏ విషయం పొద్దుగాల మాట్లాడుకుందాం ఇప్పుడెందుకు" అన్నాడు మా అయ్య.

"పొద్దుగాల దాకెందుకే ఇపుడే చీరిపోగులు పెడదాం" అంటూ పళ్ళు కొరుక్కుంటూ లేచాడు రాజన్న.

నర్సయ్య గబాల్న రాజన్న గల్లపట్టుకొని "ఏందిరా లావ్ ఉరుకులాడుతున్నవ్ ఓవల్ను చంపుతావ్‌రా? చంపుటానికి నువ్వొవన్విరా, ఇగో... మీ అందర్కి చెప్పుతున్న నా పెండ్లాన్ని గాని, పటేల్నుగాని ఎవలు ఏమనేది లేదు. నా పెండ్లాం నా ఇష్టం మీకెందుకు? మర్యాదగా ఎక్కడోల్లక్కడ ఎల్లిపోండ్రి" అనడంతో అక్కడున్న వాళ్ళంత

ఖంగుతిని మొఖాలు చూసుకున్నారు.

బాల్ తాతకు కోపం పొడుచుకొచ్చింది. "థు ఆడిగుల్లోడ నీది ఒక బత్కేనార, పొర చిన్నోడ, మనం ఈ ఇంట్ల ఉండద్దు ఎక్కడన్న బతుకుదాం ప..." అని చిన్న కొడుకును తీస్కోని కదిలాడు.

"పొంగ్రి ఇంకేం జాత్తుంగ్రు ఇదేమన్న బాగోతమా, ఆనికే లేనప్పుడు మనకెందుకు" మా అయ్య అనడంతో అందరు లేచి నడిచారు.

బాల్తాత రాజన్నను తోలుకొని ఎనిమిది రోజులు చుట్టాలిండ్లల్ల ఉండి, తిరిగి వచ్చి నర్సయ్య ఇంటికి దూరంగా పెరట్లో గుడిసె వేసుకున్నారు. గ్రామంలో కొన్ని దినాలదాక అందరి నోట్లో ఇదే విషయం నానింది. మా కులం వాళ్ళంతా కూసుండి "నర్సయ్య ఇంటికి ఎవరు పోవద్దు, వాళ్ళతో ఎవరు మాట్లాడద్దు, ఆ ఇంటికి అగ్గినీళ్ళు బందు పెడ్దాం, ఈ కట్టుబాటును ఎవరైన దాటితే జరిమాన విధించుదాము" అని తీర్మానించినారు.

ఏడాది తర్వాత బాల్తాత కుక్కిల పడ్డాడు. బాల్తాత, మా అయ్యను ఎల్లయ్యను, బంగారయ్యను పిలుచుకొని "నాకు ఊరు దూరమైతుంది, కాడు దగ్గరవుతుంది. నేను చచ్చిపోకముందు నా కొడుక్కు ఎడన్న పిల్లను జూసి లగ్గం జేయుంగ్రి, ఆడు జీతం పోయచ్చి అండుకునుటానికి యాష్టకత్తుండు" అని దండం బెట్టిండు.

కుల పెద్దలు పిల్లకోసం ఆవూరు ఈ వూరు తిరిగితే "తోడబుట్టిన అన్నగాడు పిల్లనడుగ ఎందుకు రాలేదు" అని అనుమాన పడుతు పిల్లనిచ్చుటానికి ఎవ్వరు ముందుకు రాలేదు.

చివరకు ఊల్లేనే పిలగాడు మంచోడని ఎల్లయ్య బిడ్డ అమ్మక్కను మాట్లాడి లగ్గం జేసింగ్రు. లగ్గమప్పుడు తోడబుట్టిన తోడు గదా నర్సయ్యను కూడ లగ్గానికి పిలుద్దామని మా అయ్య అంటే "ఆన్ని పిల్తే నేను నూతిల దూకి సత్తా" అని మంకు పట్టు పట్టిండు బాల్తాత.

పాపం నర్సయ్య దూరం నుంచే చూసుకుంటు ఏడిసిండు.

చుక్కారెడ్డి నర్సయ్య ఇంటికి రావడం మానలేదు. చుక్కారెడ్డి వచ్చినపుడు నర్సయ్య ఇంటికాడ ఉంటే, చుక్కారెడ్డిని ఆప్యాయంగా పలకరించి కుర్చీవేసి కూర్చుండబెడుతున్నాడు. నర్సయ్య కొడుకు శంకరిగాడు కూడా చుక్కారెడ్డి సైకిల్ మోటార్ ఇస్తే చాలు ఎగిరి గంతేసి చెప్పిన పనల్ల చేస్తున్నాడు. పటేలా పటేలా అంటూ

సుందరయ్య గ్రంథాలయ
A.C. No 81910

చుక్కారెడ్డి ముడ్డెంబడే తిరుగుచున్నాడు. విచిత్రమైన వారి ప్రవర్తన అర్థం కాక మావాల్లు బుర్రలు గోక్కుంటున్నారు. సిగ్గుతో తలదించుకుంటున్నారు.

చుక్కారెడ్డిని బాల్‌తాత చూస్తే మాత్రం చించుకుంటున్నాడు, పొడకంటు మాటలంటు కుక్కమీద, నక్కమీద పెట్టి గాలికి తిట్టుకుంటున్నాడు. ఎన్ని తిట్టినా చుక్కారెడ్డి పట్టించుకుంటలేడు. పాపం బాల్‌తాత అదిరి అదిరి కొన్నాళ్ళకు సచ్చిపోయిండు.

చుక్కారెడ్డి పైసలు నింపి నర్సయ్యను దుబాయి తోలేసిండు. నర్సయ్య దుబాయి నుంచి రూపాయలు పంపిచ్చినపుడు, చుక్కారెడ్డే శాంతమ్మను తోలుకొని బ్యాంకుకు పోతున్నాడు., నర్సయ్యకు ఉత్తరాలు రాయడం, వచ్చిన ఉత్తరాలను చదడం అన్ని చుక్కారెడ్డే చూసుకుంటున్నాడు..

కులం వాళ్లు కొంత మంది శాంతమ్మతోని చాటుమాటుకు మాట్లాడుతుండ్రని తెలిసి కులం పెద్ద మనుషులు పిలిచి మందలించిండ్రు. శాంతమ్మకు తాగుడు అలవాటు కూడా చేసిండు చుక్కారెడ్డి, శాంతమ్మ తాగినప్పుడు కులపెద్దలను కుక్కమీద నక్క మీదా పెట్టి పేర్లాల పెట్టుకుంటు తిట్టుడు మొదలు పెట్టింది. శాంతమ్మ బండబూతులు భరించలేక ఆమె నోటికి భయపడి ఎవరు ఎదురు చెప్పలేదు. మా అయ్య గూడ "నాకెందుకు అందరితోని కంటు" అని ఊరుకున్నాడు.

శాంతమ్మకు సోపతి మరో నలుగురు ఆడవాళ్ళు తయారయింర్రు. సినిమాలకు పోయిన ఎటుపోయిన కలిసే పోతున్నారు. అప్పుడప్పుడు దావతులు కూడా చేసుకుంటున్నారు. ఇపుడు కులం మీదా వారిదే పెత్తనం, వారి మాటకు ఎదురులేదు.

ఈసారి సర్పంచి పదవి మా ఎస్సీ ఆడవాళ్లకు వచ్చిందని తెలియగానే మా మాలమాదిగోల్లంత కూసుండి "ఎవరిని సర్పంచిగా పెట్టుకుందాం మన ఆడవాళ్ళల్లో ఎవరు తెలివైన వారు?" అని ఆలోచిస్తే, చుక్కారెడ్డి ఆయన బంధువులేమో మా వాళ్ళ ఆలోచనకు పూర్తి విరుద్దంగా "ఎస్సీల ఆడవాళ్ళలో ఎవరు తెలివిలేని వారు? ఎవరు మన చెప్పుచేతల్లో కాలికింద చెప్పుల పడి ఉంటారు?" అని ఆలోచించి శాంతమ్మను ఎంచుకున్నారు.

మా మాలమాదిగిండ్లల్ల ఒక్క ఎల్లయ్య కోడలు లచ్చుమక్క ఒక్కత్తే కొద్దిగంత చదువుకుంది. మా వాళ్ళంత కలసి లచ్చుమక్కను సర్పంచి పదవికి పోటీకి నిలబెడదామని అనుకున్నారు. కాని చుక్కారెడ్డి సాగనీయలేదు. "సర్పంచికి పోటి

నిలబెట్టకపోతే గ్రామ అభివృద్ధికోసం సర్కారు పదివేల రూపాయలు ఇస్తుంది. ఊరికి ద్రోహం చేసేవాళ్ళే పోటికి నిలబెడతారు." అని చుక్కారెడ్డి ఆయన బంధువులు ప్రచారం చేసి ఇతర కులస్తులను నమ్మించి మా వాళ్ళ మీదికి ఉసిగొల్పి శాంతమ్మకు పోటీ లేకుండా చేసింద్రు.

సర్పంచి అయిన తర్వాత శాంతమ్మలో చాలా మార్పు వచ్చింది. కట్టుబొట్టు మార్చింది. శూన్యంగా మాట్లాడుతుంది. శాంతమ్మ పేరుకు మాత్రమే సర్పంచి అధికారమంతా చుక్కారెడ్డిది, ఆయన బంధువులదే. శాంతమ్మ పేరుకు మాత్రమే సర్పంచి అయినా, ఆ పేరుకే తెగ సంబరపడిపోతుంది. మా ఎస్సీలమీద మాత్రం పెత్తనం చెలాయించాలని చూస్తుంది. ఎవరైన ఎగతాళిగానైన సర్పంచమ్మా అంటే చాలు వారితో తీయగా మాట్లాడుతుంది. మెచ్చుకొనివాళ్ళను చీదరించుకుంటుంది. "పెద్ద పెద్దోల్లు అటువంటిది నాకు విలువ ఇత్తుంద్రు మీరు ఇత్తె ఎంత ఇయ్యపోతే ఎంత. ఎంతైన చిల్లరోల్లు చిల్లరోల్లే, అయ్యో మా చిన్న కులంల ఓ తెలివి మంతురాలు సర్పంచి అయింది దానితోని ఎప్పుడైన పనిపడుతుంది, దానితోని మంచిగా కలిసుందాం అన్న ఇంగిత జ్ఞానం లేదు. బత్కనేర్పు లేదు చిల్లర కులపోల్లకు. గందుకే గీపాటి బతుకుతుంద్రు," అంటు దెప్పుతుంది.

ఎవరైన "ఇప్పుడన్న అందరితోని మంచిగా కలిసుండు అందరితోని కొట్లాట ఎందుకు పెట్టుకుంటావు" అంటే "ఇగో మీరు ఓట్లేత్తే నేను సర్పంచిని కాలేదు. నేను మిమ్మల్ని ఓటేయ్యమని మీ కాళ్ళు మొక్కలేదు. నన్ను సర్పంచిని చేసింది పటేండ్లు, మీతో నాకేం పని?" అని ఎదురు ప్రశ్నిస్తుంది.

మా మాలమాదిగి ఆడవాళ్ళందరికంటే తాను తెలివిపరురాలు, మాటకారి కావటం వలనే సర్పంచిని అయినాను అనుకుంటుంది శాంతమ్మ. కాని అష్టకష్టాలు పడుతు అజ్ఞానంతో అట్టడుగు స్థాయిలో జీవిస్తున్న మాలాంటి వారు అభివృద్ధి చెందడం కోసం అంబేద్కరయ్య ఎంతో కష్టపడి కల్పించిన రిజర్వేషన్ సౌకర్యాన్ని చుక్కారెడ్డి అక్రమ సంబంధాన్ని అడ్డం పెట్టుకొని దొడ్డి దారిన దొంగిలించాడని తాను, తన జాతి వాళ్ళు తెలివికి రాకుండా, ఎదగకుండా చేస్తున్నాడని శాంతమ్మకు తెలియదు. తన కులం వాళ్ళు వెలివేసిన ఎగతాలి చేసిన చుక్కారెడ్డి ఆయన బంధువులు చేరదీసి సర్పంచిని చేసి విలువ గౌరవం కల్పించినారని విశ్వాసంతో వారికి అణిగి మణిగి ఉంటూ, అయ్యా బాంచెన్ అంటూ విదేయురాలుగా మెదులుతుంది. చిన్న కులస్థులను మాత్రం చీదరించుకుంటుంది.

ఆపీసు పనిమీద చుక్కరెడ్డి శాంతమ్మ కలిసి చిలకాగోరింకల్ల సైకిల్ మోటర్

మీద జగిత్యాలకు పోతుంటే గ్రామం నివ్వెరపోయింది. భగ్న ప్రేమికులని కొందరన్నారు, ముచ్చటైన జంట అని కొందరు మెచ్చుకున్నారు. మా వాళ్లేమో మొఖాలు మాడ్చుకున్నారు.

*** *** ***

ఏడాది తర్వాత మా అయ్య నన్ను చుక్కారెడ్డికి జీతముంచిండు. జీతము కుదిరిన మొదట్లో చుక్కారెడ్డితోని, ఆయన భార్య మంగవ్వతోని వారి పిల్లలతోని బిడియంచేత భయం భయంగా మాట్లాడితే. "ఆడ పిల్లవారా లావ్ సిగ్గు పడుతున్నవ్" అని మంగవ్వ నన్ను దెప్పి పొడిచేది. మంగవ్వ మంచిదే కాని ఆరితోరి అని పిలిస్తేనే గుండెల్లో కెలికినట్లనిపించేది.

కొన్నాళ్ళకు బిడియం తేలిపోయి కొద్దికొద్దిగా మెలితమయిన కాని నాతోటి పాలేరు బుచ్చన్న తోటే తిప్పలుంది. బుచ్చన్న మాపాలోడే వరుసకు అన్నవుతడు. ఒట్టి కండ్లమంట మనిషి. మంగవ్వతోని కొద్దిగా మంచిగా మాట్లాడితే చాలు కడుపెర్రి చేసుకుంటాడు. ఒట్టిగానే కసురుకుంటాడు. అతనిమీద నేనేమైన ఎక్కిరాలు చెబుతానని భయమో ఏమో? అయిన మా అయ్య జీతము కుదరంగనే చెప్పిండు ఆడు పుండకోరు మనిషి ఆనితోని జెర జాగ్రత్తగా ఉండుమని.

మిరపతోటకు పురుగుల మందుకొట్టి వచ్చి మోటర్‌ను గుమ్మిలింట్ల దాచి పెడదామని ధనధన పోయి గుమ్మిలింట్లోని దృశ్యాన్ని చూసి భూమి గిర్రున తిరిగినట్లనిపించి కళ్ళు మూసుకున్న. నన్ను చూసి మంగవ్వ, బుచ్చన్న లేచి మూలకు ఒదిగింద్రు. మనసు మనసులో లేదు మౌనంగా బయటకు వచ్చిన.

మా చిల్లరకులంలోనే అనుకున్న వీళ్ళదాంట్లో కూడా.... మరి శాంతమ్మ, చుక్కరెడ్డి సంబంధం గురించి ఊరందరికి తెలిసి ముచ్చట్లు పెట్టుకున్నట్లు, మంగవ్వ, బుచ్చన్న సంబంధం ఎందుకు బయటకు పొక్కలేదు? ఒకవేల తెలిసినా ముచ్చట్లు పెట్టుకోవడానికి జనం భయపడ్డారా? ఏమైన పెద్దోల్లు, పెద్దోల్లే, చిన్నోల్లు, చిన్నోల్లే. పెద్ద కులపోల్లు తప్పు చేసినాగాని గౌరవించబడతారు. అదే తప్పు చిన్న కులపోల్లు చేస్తేనేమో చులకనౌతారు. ఇందులోని మతులబు ఏమిటో అర్థమయి సావదు.

తెల్లవారి నేనే తప్పు చేసినవాడిలా మంగవ్వ మొహంలోకి సూటిగా చూసే ధైర్యంలేక నాలె గీతలు గీసిన. మంగవ్వలో మాత్రం ఏలాంటి మార్పులేదు. బుచ్చన్నతో కూడా ఎప్పటిలాగే మాట్లాడుతుంది. "ఔర బుచ్చిగా" అని ఆరితోరి పిలుపు

కూడా మానలేదు.

నర్సయ్య రెండేండ్లకు దుబాయి నుండి వచ్చిండు. మనిషి ఎర్రగా, బుర్రగా అందంగా తయారయిండు. చుక్కారెడ్డికి మంగవ్వకు వారి పిల్లలకు బట్టలు, గడియారాలు, బోలెడంత సామాను పెట్టిండు.

నేను బుచ్చన్న కరెంటు మొటర్ పెట్టి పల్లి చేనుకు నీళ్ళు కడుతున్నాము. కరెంటు పోయింది.

"పల్లికాయ కాల్చుకుందాం పార మల్లిగా కరెంటు వచ్చేదాక" అన్నాడు బుచ్చన్న..

"దబ్బున పటేలత్తే తిడుతడే" అన్నాను భయపడుతూ..

"అత్తే భయమా ఏందిరా? ఒట్టి ఔలగానివున్నవు నీవు" అంటూ పదిగల్ల పల్లి దంట్లు పీకి కట్టెలు జమ చేసి కాల్చిండు.

"మిరిగుడ్లు పెట్టుకొని ఏం జూత్తున్నవ్ వచ్చి బుక్కు" అన్నాడు పల్లికాయలు బుక్కుతూ...

ఈని కొంప కాలిపోను, ప్రతి మాటకు తిట్టుడే. వీడో పెద్ద జగమొండి, అన్ని మొండి పనులే, పిలిచి పిల్లనిత్తంటే వయసు ముదురన్నట్లు, ప్రేమ కొద్ది పిలిచినప్పుడు ఎందుకు వద్దందమని పోయి పల్లికాయలు బుక్కుతూ బుచ్చన్న మొఖంలోకి చూస్తే ఎందుకో జాలి అనిపించింది బుచ్చన్న మొన్నటిది ఏంపనే పటేల్‌కు తెలిస్తే ప్రాణం మీదికత్తది." అన్నాను నీ మంచి కోసమే చెప్తున్న అన్నట్లు పోజు పెట్టి

బుచ్చన్న నా మొహంలోకి చూసి నవ్వి "ఓరి పిచ్చోడా! పటేల్కు తెలువదనుకుంటున్నావా? ఒకసారి నర్సయ్య..."

నర్సయ్య పేరెత్తంగనే నా గుండె ఝల్లుమంది ఇంకేమి వినవలసి వస్తుందోనని... అంతట్లకే అనుకోకుండా పటేల్ వచ్చి "కరంటు బందుపెట్టి కడుపులు ఎల్తి ఉన్నాయని పల్లికాయ కాల్చుకుని బుక్కుతున్నార్రా" అంటూ బూతులు తిట్టుడు మొదలు పెట్టిండు.

"ఏ నేను బుక్కుతలేను పటేల కరంటు పోవుట్ల వట్టిగానే కూసున్న, వీడే, వద్దు పటేలత్తే తిడుతడని నేను చెప్పంగ కూడా కాల్చుకొని బుక్కుతుండు." అంటూ నా ముందటున్న పల్లికాయ పొట్టును చూపించిండు బుచ్చన్న. నేను నివ్వెరపోయిన నోట మాటరాలేదు, పటేలు తిట్టినందుకేమో కాని బుచ్చోని దగుల్బాజి తనానికి దుః

ఖమచ్చింది. వీడు పల్లికాయ బుక్కుతూ పొట్టు నా ముందట వేస్తే, ఒక్క దగ్గర కుప్పగా ఉండాలని వేస్తుండు కావచ్చు అనుకున్నాను. కాని గింత ఉషార్ తనం చేస్తడని అనుకోలేదు, గింత తాడు దొంగతనామా? మీది కుండ మీదుండంగా కింది కుండ తప్పదీసే రకం వీడ. ఊలపెట్టేది వీడు, నిందమోసేది నేనా? ఇట్లా ఎన్నోసార్లు జరిగింది. కాని ప్రతిసారి అట్లనే జేస్తడ అనుకుంటు నమ్మి మోసపోతున్న. పటేల్ తిట్టి తిట్టి పోయినంక బుచ్చోడు నన్ను చూసుకుంటు ముసి ముసి నవ్వితే నాకు కడుపంతా ఎదిరింది.

"ఒరేయ్ పుండకోరోడ నా పాపందల్లి చచ్చేటప్పుడు పురుగుల వడిసత్తవురా, పుట్టంగనే పుట్టెడు అబద్దాల తోని పుట్టినావురా ఇషప్పుచ్చోడ" అంటూ పెద్దోడని చూడకుండా నా ఇష్టమచ్చినట్లు తిట్టినా. ఎంత తిట్టినా నవ్వుతూనే ఉన్నాడు నల్లమొఖపోడు కుళ్లుబుద్దోడు.

*** *** ***

ఈ లంగ బుచ్చోని తోటి నాకు తిప్పలే ఉంది. ప్రాణం మంచిగా లేదని పనికి తప్పించి దావఖానకు పోతున్నానని పటేల్కు చెప్పి జగిత్యాలకు పోయిండు. వాని అగలన్ని నాకు మా ఏర్పాటే, జగిత్యాల్లో కొత్త సినిమా పడ్డప్పుడల్లా ఆనికి పాణం మంచిగుండది. ఈడ చిన్నపని, పెద్దపని అన్ని నేనే చేసి సావాలే. పటేలు ఇంటి పట్టున ఉండడాయే. ఎప్పుడు రాజకీయాలేనాయే. అదురుకుంటు పొలంలో నారుమడి దున్నుటానికి బయలెల్తు నాగలికి ఎడ్లను కడుతున్న. మంగవ్వ పక్కింటి సత్తవ్వతోని ఏదో విషయం మాట్లాడుతూ "మాల మాదిగ జాతి చిల్లర జాతి గదా, వాళ్లకు సిగ్గు మానం ఎక్కడ్డి" అంది. ఆ మాటతో నా గుండె చిట్టినట్లయింది. 'ఏంది మాలమాదిగి జాతి చిల్లర జాతా ఎందుకు దేనికి? పల్లికాయలు కాల్చుకున్న సంఘటన గుర్తుకు వచ్చి లపంగి, తాడుదొంగ బుచ్చోడు కండ్లల్ల మెదిలిండు ఈమె కూడా అచ్చం మా బుచ్చోని సాత్రమే. మా బుచ్చోన్ని తియ్యరాదు, ఈమెను పెట్టరాదు దొందు దొందే అవకాశవాదులు. ఎంత ఆపుకుందామనుకున్న ఆవేశం ఆగలే, సర్రున పోయి "ఔనవ్వ, మా మాలమాదిగోళ్ళం తప్ప అందరు సక్కటిపూసలే, రంకు నేర్చి, బొంకనేర్చుడు అందరికి చేతనవుద్దా?" చూడు తల్లి! ఏ కులంలోనైనా మంచోల్లు ఉన్నరు, చెడ్డోల్లుఉన్నరు. కులం పేరు పెట్టి తిట్టుడెందుకవ్వ" అన్నాను.

సత్తవ్వ కల్పించుకొని "అవును బిడ్డా నువ్వన్నట్లు ప్రతి కులంలోనూ మంచోల్లు ఉన్నరు, చెడ్డోల్లు ఉన్నరు. కులం పేరు పెట్టి అనుడు తప్పే" అంది. నేను అదే కోపంతో విసురుగా వచ్చి నాగలి ఎడ్ల మెడల మీద పారేసుకొని పొలానికి బయలెల్లిన,

చీ మాటలకు చేతలకు పొంతనుండని ఇట్లాంటి మనుషుల మధ్య ఇముడుడు కష్టం అనుకున్నాను.

నేను చుక్కారెడ్డికి జీతం బందయి మా అన్న తోని చిల్లర పనికి (క్రికిలి) పోతున్నా, నర్సయ్య రెండేండ్లకొకసారి వచ్చుకుంటు పోతుండు. నర్సయ్య కొడుకు శంకరిగాడు చదివే కాలేజీలోనే చుక్కారెడ్డి బిడ్డ రజితవ్వ చదువుకుంటుంది. ఎన్ని రోజులవుతుందో వాళ్ళు ప్రేమించుకోవట్టి. పరీక్షలు రాసినంక ఎవరికి చెప్పకుండా ఎటో లేచిపోయింట్రు. ఈ కథ ఇలా మలుపు తిరుగుతుందని నేను ఏనాడు అనుకోలేదు.

చుక్కారెడ్డి ఆయన బంధువులు కోపంతో ఊగిపోతు శాంతమ్మ ఇంటికి వచ్చి ఇంట్లోని సామానులను ఆగమాగం చేసి "నీ కొడుకేడే? లంజకొడుక్కు మా అమ్మాయే కావల్సి వచ్చిందా? మా ఇజ్జతి తీసిన గాడ్డికొడుకును బతకనియ్యం ఎక్కడున్నడో చెప్పు." అని బాధిచ్చుకుంటు శాంతమ్మను కొట్టింట్రు.

"మీకు ఎక్కడెక్కడ చుట్టాలున్నారో అక్కడక్కడ తిరిగి మా అ అమ్మాయిని మాకు అప్పగించక పోతే ఊళ్లెకేయి ఎల్లగొడ్తం లంజే" అని బెదిరించి పోయింట్రు.

శాంతమ్మను కొట్టంగా మా కులం వాళ్ళు ఎవరు అడ్డం పోలేదు. "అడ్డం పోయేమొఖముంచిందా" అని తిట్టుకున్నారు కులం లేని పక్షి వనం ఇడిసిన కోతిలా అయింది శాంతమ్మ పరిస్థితి. ఇన్ని రోజులు ఆప్యాయంగా చూసుకొన్న చుక్కరెడ్డి ప్రేమ ఎట్లాంటిదో అర్థమయింది శాంతమ్మకు. నిప్పులు గక్కుతున్న చుక్కరెడ్డి నిజ స్వరూపం చూసి భయపడింది. గప్పుడు శాంతమ్మ మా ఇంటికి వచ్చి మా అయ్యను పట్టుకోని బోరుమని ఏడ్చింది.

ఇప్పుడు మావూర్లే ఎక్కడ జూసిన ఇదే ముచ్చట ఇద్దరికో గుంపు, ముగ్గురికో గుంపు. 'గింత పాపమా' అనికొందరు, "చిల్లర కులపోల్లకు కావురలచ్చినాయి" అని కొందరు, "కలికాలం, దునియా కరాబయింది" అని మరికొందరు. ఊరంత పొగసూరినట్లు ముచ్చట్లే ముచ్చట్లు ముచ్చట్ల పండుగోలే.

కాని ఇందులో ఇంత విడ్డూరమేముందో? జరగరాని విచిత్రం ఏం జరిగిందో? మా శంకరిగాడు కానిపని ఏంజేసిండని ఎందుకు ఇంతగానం ఆడిపోసుకుంటు ముచ్చట్లు పెడుతుండ్రో నాకు మాత్రం ముక్క కూడా అర్థం కావటంలేదు.

ఒకవేళ వాళ్ళు లేచి పోవడం విచిత్రం అనుకుంటే, ఇరవై ఏండ్ల పొద్దునుండి, శాంతమ్మకు భర్త ఉండంగా కూడా సొంత పెండ్లం తోని కులికినట్లు కులికిండు

చుక్కారెడ్డి. కులం ఐకమత్యాన్ని దెబ్బతీసి కులం కట్టుబాట్లను కాలరాసిండు. అప్పుడు మా కులం ఇజ్జతి పోలేదా? అప్పుడు కొన్ని రోజుల దాకా మా వాళ్ళ మొఖాల మీద నెత్తురు చుక్క లేదు. అది విచిత్రం కాదా? ఆయన బంధువులకు అపుడు లేని కోపం ఇపుడెందుకు? ఇజ్జతి పోయిందని లబలబ మొత్తుకుంటుండ్రు. అపుడు ఇజ్జతు పోలేదా? కులంగాని దానితోని అక్రమ సంబంధం పెట్టుకుంటే పెద్దిర్క మనుకున్నరా! అక్రమ సంబందానికి అడ్డురాని కులం పెండ్లి జేసుకునుటానికి అడ్డమత్తుందా? చట్ట ప్రకారం నేరమైన అక్రమ సంబంధాన్నేమో ఒప్పుకుంటున్నారు. అదే చట్ట ప్రకారం న్యాయమైన బంధాన్నేమో తప్పు పడుతుండ్రు అంటే వీళ్ళ దృష్టిలో శీలం కంటే కులం గొప్పదేమో! ఏమో ! ఈ మనుషుల మనస్తత్వం అర్థం కాదు.

ఎనిమిది రోజులకు తెలిసింది. మా శంకరిగాడు, రజితవ్వ కోర్టులో పెండ్లి చేసుకున్నారని మళ్లీ మా ఊరు జనం ముచ్చట్లకు మూతులు చాపిండ్రు, చెవులు కొరుక్కుంటుండ్రు నొప్పి పెట్టేలా....

❀ ❀ ❀

పునరావృతం

సూరీడు కొలువుకు బయలుదేరక ముందే రామయ్య పొలము దున్నుటకు మట్టుకు కట్టేసిన ఎడ్లను ఇడిసి నాగలికి కట్టుతుండగా...

పొరుగూరికి ఇచ్చిన చెల్లెలు సరస్వతి ఏడుస్తూ వచ్చింది. బావి దగ్గర బోల్లు తోముతున్న అవ్వను పట్టుకొని ఏడుస్తూ... "అవ్వ నేను ఆ కొంపకు పోను. ఆ రాచ్చసి నన్ను సూటి పోటి మాటలతో రోజు తిడ్తుంది, కొడ్తుంది." అంది.

"ఏమైందే... ఎవలేమన్నరే...? ఇంత పొద్దుగాలనే వచ్చినవేందే ?" గాబరా పడిపోతు అడిగింది సరస్వతి తల్లి లస్మవ్వ.

"ఇంకెవలు? మా అత్త రాచ్చసి. మీరు ఒప్పుకున్న కట్నం వాయిదా దాటిపోయిన నుంచి నేను చేసే ప్రతి పనిలో వంకలు పెడ్తు తిడుతుంది. చుట్టు పక్కల అమ్మలక్కలను పిలిచి మరీ ఆరాలు తీస్తూ దెప్పుతుంది...

ఇయ్యాల్ల పొద్దున బోల్లు నూతికాడ పెట్టి పొచి వాకిలి ఊడుత్తున్నా. ఎక్కడికేయో కుక్కచ్చి పొసి బోళ్ళను నాకుతుండగా మా అత్త చూచి... బోళ్ళను కుక్క నాకుతుంటే కండ్లు కనబడతలేవే? నంగనాచిదాన... పంజేసుడు సాతకాకపాయె. పైసలు దెచ్చుడు సాతకాకపాయె. ఈడ నీ అయ్యా సంపాయించిన సొమ్ముంది తిని కూసుంటవా? ఆ నూతిలో దూకి సావు ! నా కొడుకు ఇంకోదాన్ని చేస్కోనైనా సుఖపడ్తడు అని తిట్టుకుంటూ నా సికెంటుకలు పట్టుకొని కొట్టింది" అంటూ సరస్వతి వెక్కి వెక్కి ఏడ్వ సాగింది.

"అదేందమ్మా... ఈ యేడు వర్షాల్లేక పంటలు పండలేదు. పంట మీద పెట్టిన పైసైనా దక్కలేదు. కట్నం రూపాలు అచ్చే యేడు మిత్తితో గల్పి ముట్టజెప్పుతానని బావను బతిమిలాడాను గదా. బావ కూడా సరే అన్నాడు. మరీ..." అని రామయ్య ఇంకేదో చెప్పబోతుంటే...

"అన్నా! ఆ యింట్లో పెత్తనం అంతా మా అత్తదే. మీ బావ మాటకు ఆ ఇంట్లో ఆవగింజంత ఇలువ లేదు. మా అత్తకు మా మామనే ఎదురుజెప్పడు. నన్ను

కొట్టంగా మీ బావ ఆడనే ఉండి కూడా నోరిప్పకపాయే. అడ్డం రాకపాయె. దాని నోటికి జడిసి. ఇగనుంచి నేను ఈకాడనే ఉంటా. కైకిలు జేసుకోనైనా కలో గంజి తాగైనా కట్టమో, నట్టమో మీ కాడనే బతుకుతా. కాని ఆ పిశాచి ఇంటికి మాత్రం నన్ను పంపకుండ్రి..." అని సరస్వతి బోరున ఏడ్వసాగింది.

"మేనోల్లని కాదని ఈళ్ళ కిచ్చినందుకు భలే మంచిగనే జేత్తుండ్రు. అసలు వీన్ని అనాలి. మేనోల్లు బొంబాయిలో బతుకవట్టిరి. చెల్లె కళ్ళముందే ఉండాలని పొరుగూరికిద్దామని గీ నిర్వాకం జేసె... దూరమైనా మేనోల్లయితే మంచిగుంటదంటే ఇనకపాయె..." అని సరస్వతిని పట్టుకొని విలపించ సాగింది లస్మవ్వ.

"అవ్వా! ఇపుడేం జరిగిందని... వాళ్ళకిచ్చే కట్నం ముట్టజెప్తే అయిపాయె..." అన్నాడు రామయ్య.

"ఎట్లా ముట్టజెప్పుతావురా లగ్గానికి జేసిన అప్పు ఆడనే ఉండే. గా యేడాది వానల్లేక అట్లింత అప్పాయే." అంది లస్మవ్వ.

"ఏదోటి జేసి ముట్టజెప్పుదాం లేవే... నువ్వైతే మొఖం కడుక్కోని బువ్వ తినుపో" అని చెల్లెను ఓదార్చి కట్టిన నాగలి ఇడ్సేసి ఊళ్లోకి బయలుదేరాడు రామయ్య.

*** *** ***

సాయంత్రం రామయ్య భూషణంను తీసుకొని వచ్చాడు ఇంటికి. భూషణం వచ్చిన విషయం చెప్పగానే లస్మవ్వకు గుండె ఆగినట్టయింది.

"అదేంట్రా పొలం అమ్ముతననంటవ్... నీకెందుకొచ్చింది ఆ దరిద్రపుగొట్టు ఆలోచన? మనకున్నది గా ముప్పయి గుంటల పొలమేనాయె... ఆయింత అమ్ముకొని అడుక్కుతిందామా?" అని లస్మవ్వ రామయ్యను కోపగించింది.

"అవ్వా... పొలం అమ్మితే ఎల్లిన వరకు కొన్కోవచ్చు... కానీ ఇప్పుడు కట్నం ముట్టజెప్పకపోతే చెల్లె బతుకుల మన్ను పోసినట్టయితది. బాధ పడకే... ఎడ్లయితే ఉన్నయి... దేవుడిచ్చిన కాలు సేతులు సక్కంగానే ఉన్నాయి... ఊరు గొడ్డుపోయిందా? ఏదో పొలంలో దున్న బోయైనా బతకలేమా? లేక ఎవరి పొలమన్న కౌలు జేసుక బతకలేమా? మన బతుకు మనం ఎట్లనో బతుకొచ్చులే... ముందయితే దాని బతుకు బాగు పడితే అంతేచాలు నాకు అడ్డు చెప్పకు." అన్నాడు రామయ్య.

అన్న మాటలు విన్న సరస్వతి వంటగది నుండి పరుగున వచ్చి "అన్నా!"

అంటూ రామయ్యను కౌగిలించుకొని బోరున ఏడుస్తూ "వద్దన్నా... వద్దు... నాకోసం మీ బతుకులు బజారున పడేసుకోవద్దు... అవ్వ జెప్పినట్టిని పొలం అమ్ముడు మానెయ్యి" అంది సరస్వతి.

"ఎడ్వకే సెల్లె ఏడ్వకు! ఆస్తులు పోతే మళ్ళీ సంపాయించుకోవచ్చు. కాని బతుకు బుగ్గిపాలైతే మళ్ళీ సక్కబెట్టుకోలేం. అది తిరిగి సంపాయించుకునేది కాదు... అవ్వకైనా నీకైన నే సెప్పేదంతే నా నిర్ణయం నాది" అన్నాడు రామయ్య.

*** *** ***

రామయ్య అయిదవ తరగతి చదువుతుండగానే తండ్రి పిడుగుపడి చనిపోతే రామయ్య తన చదువు మధ్యలోనే మానేసి, పదేండ్ల వయస్సు నుండే కుటుంబ బరువుబాధ్యతలు నెత్తిన ఎత్తుకున్నాడు. నాటి నుండి నేటి వరకు కూడా సరస్వతి కంటతడి పెట్టుకుంటే రామయ్య తట్టుకోలేడు. చెల్లెపై తనకున్న మమకారం, ప్రేమానురాగాలతో చిన్న నాటి నుండే ఎంతో గారాబంగా చూసేవాడు రామయ్య. తన చెల్లెలికొచ్చిన కష్టాలన్నీ తనవిగా భావించేవాడు. తనలోని బాధను ఎన్నడూ తన చెల్లెలికి కనపడేలా ప్రవర్తించలేదు. చెల్లెలిని తిరిగి అత్తారింటికి పంపినపుడు "అత్తా ఈ సొమ్మునే కాదు... నా చెల్లినీ, పాణాన్నీ కూడా నీ చేతిలో పెడ్తున్నా.... కన్న బిడ్డలా చూసుకో" అని సరస్వతి అత్త కాళ్ళు బట్టుకొని బతిమిలాడాడు.

చెల్లెలుకు ఇచ్చే కట్నం ముట్టజెప్పిన తర్వాత కూడా తన చెల్లెలి కోసం ఎన్నో కష్టాలు పడ్డాడు. చెల్లెకు కొడుకు పుట్టినప్పుడు, బిడ్డ పుట్టినప్పుడు పురుడు, పుట్టువెంట్రుకలు చేసుడే కాకుండా వారి చదువులకు కూడా ఖర్చు పెట్టిండు.

రామయ్య కూతురు లక్ష్మి పుట్టినపుడు తనకొడుక్కే చేసుకుంటానని సరస్వతి అంగి, రవిక పెట్టి పేరు పెట్టుకుంది. రామయ్య రేయింబవళ్ళు కష్టపడుతూ తన కుటుంబాన్ని పోషిస్తూ, మేనమామగా తన బాధ్యతలు నెరవేర్చుకుంటూ ఎకరం పొలం ఎకరం పెరడి సంపాదించుకున్నాడు. గడచిన ఈ ఇరువది సంవత్సరాలలో, ఇపుడిపుడే ఓ మెరుగైన స్థితికి వస్తున్నాడు రామయ్య.

*** *** ***

"ఇదే రావడమ అన్నయా!" అంటు నీళ్ళ చెంబు చేతికిచ్చింది సరస్వతి.

"అవునమ్మ! బావ లేడా." అంటూ నీళ్ళు తాగి కుర్చీలో కూసున్నాడు

రామయ్య.

"లేడన్నయ్యా ఏదో పనుందని బజారుకు పోయిండు. చాలా సేపయింది. కాసేపట్లో రావొచ్చు. టి.వి. చూస్తుండన్నయ్యా... చాయె పెడ్త" అంటూ సరస్వతి వంటగదిలోకి వెళ్లింది.

"వదినమ్మ... మంచిగుందా..." అంటూ టీ గ్లాసు చేతికందించింది సరస్వతి.

"మంచిగనేవుంది" అంటూ టీ తాగిన తర్వాత "నీతో ముఖ్యమైన విషయం మాట్లాడాలని వచ్చిన్నమ్మా" అన్నాడు రామయ్య.

"ఏం విషయం చెప్పు అన్నయ్యా" అంది.

"అదేనమ్మా, లక్ష్మి పెండ్లీడుకొచ్చింది కదా! ఇందాకైతే అల్లుడికి నౌకరి వొచ్చేదాక ఆగుదామన్నావు. మరి అల్లునికి నౌకరి కూడా వచ్చింది. ఇంకా ఆలస్యం దేనికి? వచ్చే నెలలో మంచిరోజులున్నాయని పంతులు గారు నిన్ననే చెప్పిండు. అందుకే నీతో పెళ్ళి విషయం మాట్లాడుదామని... మీ వదినే కూడా ఇదే మాట నీతో విచారం చేసి రమ్మంది." అన్నాడు రామయ్య.

"నేను అదే విషయం అందామని అనుకుంటున్నా. మీ బావ గారు వచ్చిన తర్వాత, ఆ కట్నకానుకల విషయం కూడా మాట్లాడుకుంటే సరి" సరస్వతి అంటుండగానే రామయ్య బావ చంద్రయ్య వచ్చాడు.

"ఏమోయ్ ! ఎప్పుడచ్చినవోయ్ కంటికే బంగారమైపోయినవ్" రామయ్యకు ఎదురుగా కూర్చుంటూ... పలకరింపుగా అన్నాడు చంద్రయ్య.

"ఏంజెయ్యమంటవు బావా... కరెంటు మీద భరోసా పెట్టుకుని పెరడంతా పసుపు వేసినందుకు పాణం మీదికొచ్చింది. కరెంటు పాడుగాను సక్కగుంటలేదు. ఇప్పటికే అప్పు లెన్నో జేసి భూమ్మీద పెట్టినా... ఎర్రటెండలేమో మండిపోతున్నాయి. భూమి నెర్రెలు గొట్టింది. ఎటు మనసున వడుతలేదు. నాకదే పెద్ద రంది పట్టుకుంది." తన బాధంత చెప్పుకున్నాడు రామయ్య.

"ఆ... రందెందుకోయ్ ఎట్ల జరిగేదుంటే అట్ల జర్గద్ది. ప... అట్లా మండువకేయి పోయొద్దాం..."

"వద్దు బావ జెల్ది పోవలే..."

"ఏ... పావోయ్... జెల్దీ రెండు దమ్ములు పట్టద్దాం. మీ ఇంటికత్తే తాగిపియ్య పడ్తదని తప్పించుకుందామనుకుంటున్నావా!"

తప్పదనుకొని రామయ్య లేచి చంద్రయ్య వెంట నడిచాడు.

చంద్రయ్య తలగామిలి దాటుతుండగా ఏదో జ్ఞాపకం వచ్చి... "సరస్వతి" అని పిలిచి, "చికెన్, పంపిత్తా మేమొచ్చే సరికి వండు" అని చెప్పి చంద్రయ్య, రామయ్యతో కలిసి మండువకు బయల్దేరారు. వరసకి బావ, బామ్మర్దులే అయినా మంచి స్నేహితులుగా ఉంటారు.

*** *** ***

అన్నం తింటున్న రామయ్య దృష్టంత టి.వి. మీదనే ఉంది. టి.వి.లో దానవీర శూరకర్ణ ఎయన్.టి.రామారావు సినిమా వస్తుంది. కృష్ణుడు, దుర్యోధనుడు మరియు కర్ణుడుగా యన్.టి.ఆర్. విభిన్నమైన మూడు పాత్రలను అద్భుతంగా నటించి, మెప్పించగలగడం ఒక రామారావుకే సాధ్యం. ఏ పాత్రలో నటిస్తే, ఆ పాత్రలోనే జీవించడం రామారావుకే చెల్లుతుంది. స్వాభిమానం, పరాక్రమవంతునిగా దుర్యోధనుని పాత్రలో... పరాక్రమవంతుడుగా, స్నేహశీలియైన కర్ణుడుగా, మహా మాయావి... మహాభారత మూల విరాట్టు శ్రీకృష్ణునిగా రామారావు త్రిపాత్రిభినయం అమోఘం, అనిర్వచనీయం.

రామయ్య ఆ సినిమా ఎన్నిమార్లు చూసిన తనివితీరనిలాగానే ఉంటుంది. అందుకే వచ్చినపనిని మర్చిపోయి... టి.వి.లో నిమగ్నమై ఉన్నాడు.

"ఏవోయ్... లక్ష్మి శేఖర్‌ల పెండ్లి ఈ వచ్చే ముహూర్తాలలో చేసేద్దామంటుండు మీ అన్నా, మరి నువ్వేమంటవ్..." అన్నం తింటున్న చంద్రయ్య సరస్వతితో అన్నాడు.

"నేనేమంటానండి! మరీ... కట్న కానుకల విషయం కూడా మాట్లాడుకుంటే ఓ పనైపోతది...!"

"ఏమోయ్... సప్పుడు జేయవు... మీ చెల్లేమంటుందో వింటున్నావా... కట్న కానుకల విషయం మాట్లాడుకుందాం అంటుంది." రామయ్యను చూస్తూ అన్నాడు చంద్రయ్య.

"కట్నం విషయం... అంటే నా పరిస్థితి మీకు తెలియందేముంది? మీరే

అడుగుండ్రి..." అన్నాడు రామయ్య.

"అడిగేదేముంది అన్నయ్య... మొన్నోసారి పక్కవూరి నుంచి ఓ సంబంధం వచ్చింది... లక్ష రూపాయలు కట్నం ఇచ్చి అల్లునికి సైకిల్ మోటర్ పెడతమన్నారు. మా అన్నయ్య కూతురుంది అని చెప్పి నేనే సంబంధం ఎత్తగొట్టిన." అంది సరస్వతి.

చంద్రయ్యకు సరస్వతి అనే మాటలు ఒక్క ముక్క కూడా అర్థం కావడం లేదు. "పక్కూరు సంబంధమేంటి ఎప్పుడచ్చింంద్రు" అని ఇంకేదో అంటుండుగా సరస్వతి సైగ చేస్తూ...

"ఆగండి.. మీకేం తెలియదు. నేను మాట్లాడుతున్నా గదా..." చిరుకోపంతో అని "ఇదిగో అన్నయ్యా... మంది మాటెందుకు కాని, మనం మనం ఒక్కటి లక్ష రూపాయలు, బండి పెట్టుండ్రి. తిరిగేది నీ కూతురు అల్లుడే కదా... కాదంటే మరి చెప్పు..." అని ఖరాఖండిగా అనేసింది సరస్వతి...

రామయ్య మీద పిడుగు పడ్డట్టయ్యింది.

"గంతంటే... ఎట్లాగమ్మా... చిన్నప్పటి నుండి... నా పరిస్థితి నీకు తెలియందా..!" తడబడుతూ వచ్చాయి రామయ్య మాటలు.

"అలాగంటె ఎట్లా! బయటి సంబంధమైతే రెండు లక్షలైనా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. చిన్నప్పుడే పేరు పెట్టుకున్నాం కాబట్టి లక్షకు ఓ పదివేలు తక్కువ ఇయ్యుండ్రి. లేదంటే మీ ఇష్టం." నిర్మొహమాటంగా అంది సరస్వతి.

రామయ్యకు ఏం మాట్లాడాలో తోస్తలేదు. చెల్లెలి ముఖంలోకి చూడడానికి కూడా ధైర్యం వస్తలేదు. కొద్దిగా ధైర్యం చేసుకుని, "ఈమె... నా భుజాల మీద ఎత్తుకుని ఆడిపించిన చెల్లెలేనా? వరకట్నం కోసం అత్త కొడితే ఏడుస్తూ పుట్టింటికి వచ్చిన చెల్లెలేనా?" అని మనస్సులోనే తలపిస్తూ, సరస్వతి ముఖంలోకి చూసాడు.

ఆ చూపులకర్థమేమిటో సరస్వతి అర్థం చేసుకుని "మేమడిగేది మాకోసమా? నీ కూతురే సుఖ పడ్తది..." అంటుండగానే టీపాయ్ మీద ఉన్న ఫోన్ ట్రింగ్... ట్రింగ్... మంటూ మ్రోగసాగింది. సరస్వతి రిసీవర్ ఎత్తి మాట్లాడసాగింది.

"హలో...! బాగున్నావా బాబు! మీ మామయ్య వచ్చిండు. నీ పెళ్ళి విషయమే మాట్లాడుతున్నం. తొంబై వేల రూపాయలు, బండి ఇస్తరట. ఒప్పేసుకోమంటవా? ఆ... సరే... నువ్వు ఎప్పుడు వస్తావు?... ఆ... అట్లనా నువ్వు జాగ్రత్తగా ఉండు బాబు.

ఉంటాను. బిల్లు ఎక్కువైతది." సరస్వతి రిసీవర్ పెట్టేసి

"అబ్బబ్బ ఏం సమ్మెలో... ఏం ధర్నాలో... కరెంటు బిల్లులు పెరిగినందుకు, ధరలు దించాలని కొందరు ధర్నా చేస్తే, పోలీసులు లాఠీ చార్జి చేసింద్రట. అందుకు వారు లాఠీ చార్జీ చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని టౌనంతా బందు పెట్టింద్రట. పోలీసులంటే భయం లేకుండా పోయింది జనానికి. మిలట్రీని దించి ఎక్కడివాళ్ళను అక్కడ దొరికినోళ్ళను దొరికినట్లు కొడితేగాని, పోలీసులంటే ఏందో తెల్వది." అని ఆడిపోసుకుంటూ "ఆ... చెప్పన్నయ్యా... కాయో పండో ఏదో ఒకటి చెప్పేయ్." కాయ కొరికినట్టు అంది సరస్వతి.

రామయ్యకు చెల్లెల్ని చూస్తే ఓ కొత్త వ్యక్తిని చూసినట్లు అనిపించింది. ఏడాది క్రిందట అల్లుడు శేఖర్ తన కాలేజీ యువకులతో కలిసి ఏదో విషయమై ధర్నా చేస్తే అప్పుడు ఇట్లాగే పోలీసులు లాఠీ చార్జి చేసింద్రు. అపుడు పోలీసోల్లకు సరస్వతి పెట్టిన శాపనార్థాలు గుర్తుకువచ్చాయి. "వాళ్ళ చేతులిరిగిపోను! వాళ్ళ పెండ్లాల పుస్తెలు తెగిపోను... సమస్యలత్తె ధర్నా చేస్తే తప్పా... ఇది ప్రజాస్వామ్యమా? లేక పోలీసు రాజ్యమా? పోలీసులు రౌడీల కంటే అధ్వాన్నంగా తయారైంద్రు." అని ఇంకా ఎన్నో శాపనార్థాలు పెట్టింది. ఇపుడు తన కొడుకే పోలీసు అవడం వల్ల, పోలీసు పక్షాన మాట్లాడుతుంది. ఇందాక నుంచి టి.వి.లో వస్తున్న దాన వీర శూర కర్ణ సినిమాలో ఎన్టీఆర్ ఎంతో గొప్పవాడు అనుకున్న రామయ్యకు ఒక కూతురుగా, ఒక చెల్లెగా, కోడలుగా, తల్లిగా, అత్తగా జీవితంలో విభిన్నమైన పాత్రలు పోషించే చెల్లెలు రామారావు కంటె గొప్ప వ్యక్తిలా అన్పించింది. ఏ స్థానములో ఉంటే అదే స్థానము గూర్చి మాట్లాడే ప్రతివారు ఎన్టీఆర్ కంటె గొప్పనటులే...! అలా నటించని వారే జీవితంలో ఓడిపోతారు నాలాగా, సరస్వతి చెల్లెలు పాత్ర నుండి మారి కోడలు పాత్రలోకి ఆ తర్వాత తల్లిగా ఎదిగి ఇప్పుడు అత్త పాత్రను పరిపూర్ణంగా పోషించబోతుంది. కాని నేను అక్కడే ముప్పయి ఏళ్ళ కిందటి అన్న పాత్ర వద్దనే ఆగిపోయాను." అని మనసులోనే విలపించాడు రామయ్య.

రామారావు సినిమాల్లోనే విభిన్నమైన పాత్రలు పోషించి మెప్పించాడు. కాని నిజ జీవితంలో నటించలేక పోయాడు. జీవిత కాలచక్రమనె నాటకంలో అందరూ నటులే. అందులో కొందరు పాత్రకు తగినట్లుగా మహా అద్భుతంగా నటించి, మహా నటులౌతారు. మరికొందరు గతాన్ని మర్చిపోయి నటించడం చేతకాక, మధ్యలోనే ఆగిపోతారు.

*** *** ***

అలసటగా వచ్చిన రామయ్యకు జానకి ఎదురుగా వచ్చి "ఏమైందండీ! ఏమన్నది మీ చెల్లె ! " అంది.

"తర్వాత చెపుతాను కానీ కొన్ని మంచినీళ్ళు ఇవ్వు" అని కుర్చీలో కూలబడ్డాడు రామయ్య. రామయ్య జానకిచ్చిన నీళ్ళు తాగిన తర్వాత మెల్లగా "పెండ్లి వచ్చే ముహూర్తాలలో చేద్దాం అంటుండ్రు కానీ..." అని మధ్యలోనే చెప్పడం ఆపేశాడు రామయ్య.

"ఆఁ... కానీ ఏమైందండీ" అంటూ జానకి గాబర పడిపోతూ అడిగింది.

"ఏంలేదు... తొంబైవేల రూపాయలు సైకిల్ మోటర్ కట్నం కింద అడుగుతుండ్రు." నీరసంగా జవాబిచ్చాడు రామయ్య. "గవన్నీ! మనతోటి ఏమైతవి? మన పరిస్థితి మీ చెల్లెకు తెల్సిందే కదా మీ చెల్లెకు నచ్చ చెప్పక పోయినవ్."

"అవన్ని అడిగింది మా చెల్లెనే, మా బావ కాదు ఆయన మాట అయింట్లో పారదని ఇరవయ్యేండ్ల కిందనే సర్టిఫికటిచ్చే".

"మరి ఇపుడు ఏం జేద్దామండీ...!" చెంపలపై నుండి కన్నీళ్ళు జారుతుంటే కొంగుతో తుడుచుకుంటూ అంది జానకి.

"ఏం చేసుడేంది? పొలం, పెరడి అమ్మేస్తే... లక్షా యాభై వేల దాకా వస్తాయి... ఇంకేమైనా తక్కువయితే ఇల్లు కుదవెడదాం" అన్నాడు.

"ఉన్న భూమంతా అమ్మేస్తే... మనమెట్లా బత్కుతం. పోరడు ప్రయోజకుడన్న కాకపాయె. పోనీ పెండ్లి అయినంక ఏడాదికో రెండేండ్లకో ఇత్తమని అనకపోయినవా?"

"అట్లా ఒప్పుకొని పెండ్లి జేత్తె తర్వాతైనా ఏడనుండి తెత్తాము? వాయిదా దాటిపోతే బోళ్ళు కుక్క నాకితేనో, పిల్లి పాలు తాగితేనో, మన బిడ్డ పుట్టింటికి తిరిగి వత్తది. ఇది ఇదివరకు జరిగిన పాత కథే కదా? నా బిడ్డ నా చెల్లెను రాక్షసిని జేసి తిట్టితే నా మనసు తట్టుకోదు. నా చెల్లెను పరాయి మనిషైనా అత్త తిడితేనే ఆ చిన్న వయసులోనే పొలం అమ్మేసినా. అటువంటిది నా ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించిన చెల్లెను నా బిడ్డ తిడితే ఓర్చుకునే శక్తి నాకు లేదు ఇంకొన్ని నీళ్ళివ్వు భూషణం దగ్గరకు పోయస్తా" అన్నాడు రామయ్య.

నీళ్ళు తాగి బయలుదేరుతున్న రామయ్యకు ఎదురుగా కూతురు లక్ష్మి వచ్చి "నాన్న...! నాకు పెండ్లి వద్దు ఏమివద్దు. నేను మీతోనే బతుకుతా. మీరు నాకోసం భూమి అమ్మి దిక్కులేని వారయితే నేను అత్తవారింటా సుఖంగా ఎట్లుండ గలను?" అంది బాధ పడుతూ.

ఆ మాటలకు అంత బాధలో కూడా రామయ్యకు గతంలో చెల్లెలు అనిన మాటలు గుర్తుకు వచ్చి నవ్వు వచ్చింది. కానీ నవ్వును పెదాలు దాటి రానివ్వలేదు. కూతురు తలపై చేయి వేసి నిమురుతూ... మనస్సులో 'కాబోయే అత్తవు. కన్నీళ్ళు పెట్టకోవద్దు' అనుకొని "బాధపడకమ్మా ఈ బరువు బాధ్యతలు మోయడం నాకు చిన్ననాటి నుండే అలవాటైందమ్మ" అని భూషణం వద్దకు బయలుదేరాడు.

భూషణం వద్దకు వెళుతున్న రామయ్య కాళ్ళు అప్రయత్నంగానే కన్న తల్లిగా చూసుకున్న భూమిని చివరిసారిగా చూసుకొనుటకు పడమర దిక్కున ఉన్న పొలం వైపు పయనం సాగించాడు పడమర సూరీడు అస్తమిస్తుండగా.....

❀ ❀ ❀

భలే బామ్మర్ది

అసహనంతో అల్లాడిపోతున్నాడు వర్క్ ఇన్‌స్పెక్టర్ ఇనప్పెట్టెల వెంకటేశం. కొత్తగా వచ్చిన (డిప్యూటి ఇంజనీర్) ఆఫీసర్‌ను ఎలా మచ్చిక చేసుకోవాలో? అనే ఆలోచన ఆయన మస్తిష్కాన్ని వేదిస్తోంది. అంతలో పైరవీలతో పబ్బం గడుపుకొనె ఓ పైరోకారి "నమస్తే సార్" అంటు రావడంతో ఆలోచన్లకు స్వస్తి చెప్పి "ఆం... నమస్తే... నమస్తే రండి కూర్చోండి" అని అటెండర్‌ను పిలిచి "ఏయ్ సూర్యం రెండు టీలు పట్టుకురాపో" ఆజ్ఞాపించాడు. "టీలకు డబ్బులివ్వండి" అంటు చేతి చాపాడు అటేండర్ సూర్యప్రకాశ్. "డబ్బులు తర్వాత ముందు టీలు తీసుకురాపో" కసురుకుంటు చెప్పడంతో ఆఫీసు ముందున్న తడికెల గుడిసె హోటల్‌కు వెళ్ళాడు అటెండర్.

వెంకటేశం లోగొంతుతో చుట్టు ఉన్న కొలీగ్స్‌కు వినపడకుండ పైరోకారితో "చూడండి ! మీ బిల్స్ గురించి కొంత కాలం ఆగండి. కొత్త ఆఫీసర్ రెండు రోజుల క్రితమే జాయినయ్యాడు. చాల స్ట్రిక్ట్ అంటుంన్రడు. ఆయన వీక్‌నెస్ తెలుసుకోవాలంటే కొంత టైం పడుతుంది. దొంగ బిల్లుల వ్యాపారం గదామరి. పాత ఆఫీసర్ అయితే మనం ఎంతంటె అంతే అన్నాడు. వాటాలుగా పంచుకున్నాము. ఇల్లు ఎవరిది? కట్టింన్రా? లేదా ఏ విషయం అడగలేదు, ఏ ఊరిలో చెక్ చేయలేదు" అంతలో అటెండర్ వట్టి చేతుల్తో రావడంతో "టీలు తెమ్మంటి గద, చేతులు ఊపుకుంటు వచ్చినవేంటి" కోపంతో అన్నాడు.

"డబ్బులు ఇస్తేనే టీలు పోస్తానన్నాడు" కాయకొరికినట్లు చెప్పాడు అటెండర్. కుడిదిల పడ్డ ఎలుకయ్యాడు వెంకటేశం. పైసపోతె ప్రాణం పోయే మనస్తత్వం ఆయనది, పరమ పిసినారి. లంచగొండి, చెంచాగాడు లాంటి మరెన్నో బిరుదులు ఆయన ప్రతిభను గుర్తించి ప్రేమతో పెట్టారు. హౌజింగ్ బోర్డు ఆఫీసు స్టాపంత. పైరోకారి ముందు పరువు నిలబెట్టుకోవడానికి "నా పేరు చెప్పుపోవయ్య" హుందాగా అన్నాడు.

"మీ పేరు చెప్పిన తరువాతే పొయ్యనన్నాడు" ఆమాటతో ఖంగు తిన్న వెంకటేశం అభ్యర్థిస్తున్నట్లు మొహం పెట్టి "పోనీ ఆఫీసు ఖాతాలో తీసుకురాపోవయ్యా"

"ఆఫీసు ఖాతాలో తెస్తే ఆఫీసర్ నా పీక నొక్కేస్తాడు" చేజారి పోతున్న పరువు దక్కించుకోవడానికి వెంకటేశం బలవంతంగా నవ్వి పైరోకారితో "వాడు నా బావమర్దండి. ఖాళీగా ఉన్నాడని నేనే నౌకరి పెట్టిచ్చాను. ఆ చనువుతో ఆఫీసులో కూడా జోక్ చేస్తుంటాడు. అసలు హోటల్లో టీ లేనట్టుంది. చిలిపి...." అంటూ సూర్యప్రకాశ్ వంక చూసాడు.

"అదేం కాదు టీ ఉంది నేను తాగొచ్చాను కూడ" జన్మజన్మల వైరముందేమో, కుండ బద్దలు కొట్టినట్లు నిజం చెప్పేసాడు సూర్యప్రకాశ్.

వెంకటేశం ముఖం పాలిపోయింది. పైరోకారి అదేం పట్టించుకోకుండ "వెళ్లొస్తాను సార్ ఎట్లైన చేసి బిల్లు శాంక్షన్ అయ్యేటట్లు చూడండి" అని వెళ్ళిపోయాడు.

వెంకటేశం సూర్యం వైపు ఉరిమురిమి చూసాడు.

---- ---- ----

సాయంత్రం వెంకటేశం ఇంటికి వస్తూనే "ఏమోయ్ జయ మీ తమ్మునికి అసలు బుద్దుందా?" భార్యను సంబోదిస్తు అన్నాడు.

"మళ్ళీ ఏం జరిగిందండీ" మంచినీళ్ళు అందిస్తు నెమ్మదిగా అన్నది జయ. "ఏం జరిగిందో మీ తమ్మున్నే అడుగు" అని వెనకాలె వచ్చిన సూర్యం మోహంలోకి ఓ వింత చూపు చూసి లుంగి కట్టుకొని మొహం కడుక్కొని వచ్చి టీ తాగుతు తాపీగా లెస్సన్ మొదలు పెట్టాడు. "ఔర సూర్యంగ, నీకు ఆ ప్రభాకర్ గాడికి ఏం స్నేహంరా....? వాడో గుమస్త వెధవ నువ్వో శప్రాసి సన్యాసివి. వాని సోపతి పట్టే నువ్వు బొత్తిగా శెడిపోయినవ్‌రా... అరే.... వాడో పిచ్చోడు వానితో స్నేహం చేయకురా... అని ఎన్నిసార్లు చెప్పాన్‌రా...!"

"అదేంటి బావ! అందరేమో ఆ ప్రభాకర్ నిజాయితి పరుడని అంటారు...." "అదే గా పిచ్చోడనే వానితో స్నేహం చేయద్దంటున్నాను. నిజాయితికి అర్థం పిచ్చేరా. ఉట్టి పిచ్చి కాదు, బ్రతకలేని పిచ్చి. వాడు బ్రతకడు వేరొకర్ని బ్రతకనివ్వడు. మనిషి అన్నప్పుడు ఓ లక్ష్యం ఉండాలిరా. నన్ను చూడు అంచెలంచెలుగా ఎట్ల పైకి వచ్చిన్నో!"

"అంచెలంచెలుగాన, లంచా లంచాలుగాన"

"అదే... గా డబుల్ మీనింగ్ మాటలకే మండుద్ది నాకు. అసలు... నాకు తెలియక అడుగుతాను..." పూర్తి చేసేలోగానే.

"ఎవరైన తెలియకనే గదా అడిగేది. తెలిసి ఎందుకు అడుగుతారు" అన్నాడు సూర్యం మధ్యలో అడ్డు తగులుతూ వెంకటేశం దుఃఖంతో సంతోషంగా నవ్వి "గా.... గేలిచేసే మాటలు మానేసి నీ జీవితానికో లక్ష్యం ఏర్పర్చుకోరా".

"లక్ష్యం ఉంటే ఏం లాభం బావ లక్షలు లేంది."

"అంటే నీ లక్ష్యం లక్షలతో కూడుకొన్నదా? ఏం...టో అంత పెద్ద లక్ష్యం?"

"పెద్దది అంటే పెద్దది ఏం కాదు చిన్నదే, కాలం కలిసి వస్తే రాష్ట్రపతిని కావాలని ఉంది"

"ఆం... ఏంటిరా... రా...ష్ట్ర...ప...తా...? ప్రదానమంత్రి వద్దా?"

"వద్దు వద్దు ప్రతిపక్షంతో అగచాట్లు, సొంత పార్టీతో సిగపాట్లు, పైగా మైనార్టీ ప్రభుత్వం అయితే మిత్రపక్షంతో పీకులాట. పాలకపక్షం మీద మిత్రపక్షం వారు నోరు తెరచుట భయం. ప్రతిపక్షం వారు మేం ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం అనుడు ఆలశ్యం లేదు వీళ్లను సాదలేక వాల్లను కొనలేక అనుక్షణం టెన్షన్‌తో బ్రతకాలి. పదవి దిగితే కారాగారం భయమొకటి? ఆ రాష్ట్రపతి కూడా మెజార్టీ ప్రభుత్వం అయితేనే ఉంటాను. లేకుంటే ప్రధానమంత్రులతో ప్రమాణ స్వీకారాలు చేయించుటతోటే నా పదవి కాలం కాస్త గడిసిపోతది అటువంటిది నాకు వద్దు నాకు టెన్షన్ లేని జీవితం కావాలి?"

"అయితే బామ్మర్ది, ఓ పని చేయి ఈ జన్మలో లక్షలు సంపాదించు వచ్చే జన్మలో ఆ లక్షలతో రాష్ట్రపతివి అవుదువు."

"ఈ జన్మలోని డబ్బులు వచ్చే జన్మలో ఎట్లా గుర్తుంటవి?"

"నా దగ్గర పెట్టు నేను గుర్తు చేసి ఇస్తా నీకు"

"నీ మీద నాకు అస్సలు నమ్మకం లేదు బావ. పోయిన జన్మలో ఇచ్చినవే ఇప్పటికి తిరిగి ఇస్తలేవు"

"ఆఁ.... పోయిన జన్మలో నువ్వు.... నాకు డబ్బులిచ్చినావా ?"

"మరదే! నీకేమో గుర్తు లేదు, నేను గుర్తు చేస్తేనేమో తప్పించుకుంటవ్"

"ఒరే బామ్మర్ది నీకో దండంరా! నీ మాటలతో నాకు పిచ్చి లేపకు. ఏదో బావమర్ది బ్రతుకు గోరాలని బుద్ది గడ్డి తిని నిన్ను ఓ దారికి తెద్దామనుకున్నాను.

కాని నీతో మాట్లాడుతుంటే నా బ్రతుకు గోదారి పాలయ్యేటట్లుంది. జీవితాంతం శ్రాసిగానే చిప్పలు కడుక్కుంటు బ్రతుకు నాకెందుకు?.... జీన్స్‌ప్రాబ్లం. అసలు మిమ్మల్నని ఏం లాభంరా! మా అమ్మనవాలి సంబంధం కలుపుకొనేటపుడు ఇటేడు తరాలు, అటేడు తరాలు చూడాలంటారు. మా తమ్ముడు మా తమ్ముని బిడ్డని నాకు కట్టబెట్టి నా కొంపముంచే"

" మీ అమ్మ ఏం చేసింది బావ నువ్వేగదా మా అక్కను ఇవ్వకుంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తివి."

వెంకటేశం సంతోషంగా ఏడుస్తూ "జ్ఞాపకముందా? జ్ఞాపకం ఉన్నదో లేదో అని కొట్టి చూసాను అంతే, ఎమ్మే చదివినవ్ ఏం లాభం నయాపైసకు కొరగాకుండ నీ తెలివి గిట్లేడ్చింది."

"నేను చదువుకున్నది డబ్బు సంపాదించడానిక్కాదు"

"ఆఁ.... మరి ఎందుకో?"

"వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడానికి మనిషిగా జీవించడానికి డబ్బు సంపాదించాలంటే చదువే అక్కరలేదు"

"నువ్వు గవ్వేడి పోరన్వి నీకు ఇంకా డబ్బు విలువ తెలువది. తెలిస్తే ఇట్లా మాట్లాడవ్ అయినా మీ ఇంట్లో ఎవరికి తెలిసి సచ్చిందని ? జీన్స్ ప్రాబ్లం ఏదో ఉట్టి పుణ్యానికి మీ అక్కకు నౌకరి ఉన్న భర్తను దొరికాను"

"అదేంటి బావ మా అక్కను చేసుకున్న తర్వాతే గదా నీకు ఉద్యోగం వచ్చింది" వెంకటేశం రియాక్షన్ నవ్వో, ఏడుపో గ్రేట్ సైకాలజీ ఫిలాసపర్‌కు కూడా అర్థం కాదేమో!

"అంటే .... అంటే మీరు ఇచ్చిన కట్నం తోనే నాకు ఉద్యోగం వచ్చిందని గదా నీ మాటలకు అర్థం"

"నాకు ఆ సంగతి తెలువది బావ ఇపుడు నువ్వు చెప్పేదాక"

"తెలుస్తది... తెలుస్తది... ఏం చేద్దాం రా... జీన్స్ ప్రాబ్లం అన్ని తండ్రి బుద్దులే... ఉద్యమాలతోనే జీవితం గడిపే మీ నాన్న. పల్లెటూరిలో పనికి రాకుండ పోతవని ఏదో బామ్మర్దన్న ప్రేమతో తీసుకు వచ్చి నౌకరి పెట్టిస్తే ఏ మాత్రం విశ్వాసం లేదాయే."

"విశ్వాసం నాకెందుకు లేదు బావ నామీదికేయి కుక్కగూడ వేస్తే"

"అంటే... దానర్థం నీతో కుక్కలాగ వెట్టిచాకిరి చేయించుకుంటున్నానని గదా. మార్కెట్కు, కిరాణం కొట్టుకు తప్ప ఇంకేదైన పని చెప్తుతున్నాన్‌రా? పిచ్చి పిచ్చి మాటలు మాని మంచిగా బ్రతికి కనీసం మీ నాన్న పేరైన నిలబెట్టురా"

"అబ్బో.... అంత త్యాగం నాతో కాదు. ఆయనకు చెడ్డపేరు తేకుండా బ్రతుకుత అంతే"

"అంటే... మీ నాన్నో సుభాష్‌చంద్రబోస్, నీవో భగత్ సింగ్‌వన్నమాట"

"అదేమో నాకు తెలియదు కాని ఈ రోజుల్లో ఒకరికి అన్యాయం చేయకుండ బ్రతికేవాడు అల్లూరి సీతారామరాజు అంతటోడు అనుకుంటాను"

"అబ్బ... అబ్బ.... నీలాంటి వాళ్ళు నలుగురు బావమరుదులుండాలె గాని బావ బ్రతికుండగానే కాటికి మోసుకెళ్తార్రా?"

"అదేంటి బావ అట్లా మాట్లాడ్తవ్ మా చిన్నమ్మ కొడుకులు ముగ్గురు నీకు బావ మరుదులు కార ఏంటి !"

"ఔనౌను, ఐతే ఇంకేం మోసుకెళ్ళుండ్రి"

"ఏంటి బావ మమ్మల్ని దిక్కులేని పక్షుల చేస్తావ కనీసం నా పెండ్లి అయ్యే వరకన్న అట్లాంటి ఆలోచనలు రానీకు"

"నీ పెండ్లికి నా చావుకు సంబంధమేంటిరా...?"

"మరి నా పెండ్లికి మా అక్కకు పట్టుబట్టలు పెట్టుడుండదా ? "

"అంటే... మీ అక్క పట్టు బట్టలు కట్టుకోవడం కోసమైన నేను బ్రతికుండాలంటావ్?

"అట్లానీ... నిన్ను ఇబ్బంది పెట్టేదేం లేదు. బాగ రోజులు ఆగుడు కష్టమనుకుంటే ఇప్పుడే పెండ్లి జేసుకుంట"

"శభాష్ బావమర్ది! నీలాంటి బామ్మర్ది ప్రపంచంలో మరెవ్వరికి దొరకడు, అట్లాంటిది నాకు దొరికినవంటే అది నా పూర్వ జన్మ సుకృతం."

"అబ్బా.... మిలీనియం మాట మాట్లాడినవ్ బావ, హండ్రెడ్ పర్సెంట్ నిజం."

జయ వారి ముందు గారెలు పెడుతు "ఒరే తమ్ముడు రోజు అటు ఆఫీసులో ఇటు ఇంట్లో ఆయనతో తంటాలు పడే బదులు ఏక్కడైన... చిన్న రూం చూసుకొని హాయిగా ప్రశాంతంగా ఉండొచ్చు గదరా..." అంది.

"అదిగో నువ్వు అట్లనే మాట్లడుతవు అంటే రోజు నేను వాన్ని సతాయిస్తున్ననని గదా నీ ఉద్దేశ్యం, ఒక్కడు తలదాచుకోవడానికి రూమెందుకు కిరాయి దండగా, పైగా రూం రెంటెంతో కరెంటు బిల్లు అంత కట్టాలి. అదే మనతోనే ఉంటే రూం రెంటైన, కరెంటు బిల్లయినా వాడు సగం, మనం సగం కట్టుకుంటున్నాం. అటు వానికి సేఫ్టీ, ఇటు మనకు సేఫ్టీ నువ్వు వానికి గట్లాంటి మాటలు నూరి పొయ్యకు."

"అక్క ! నీవెందుకు బాదవడ్తావు బావ నామీద భారీ ఆశలు పెట్టుకున్నట్టున్నాడు. ఆ ఆశలు ఏవో నెరవేర్చుకోనియ్, అయినా నేను పెట్టేది నా మేనల్లుడు మేనకోడల్కే గదా ఇంకెన్ని రోజులు నా పెండ్లి అయ్యేదాకనే కదా."

---- ---- ----

మరుసటి రోజు ఉదయం రథం పై కృష్ణార్జుల్లాగా ఒకే సైకిల్ పై ఆఫీసుకు బయలుదేరినారు బావబామ్మర్దులు.

వెనుక రూర్చున్న వెంకటేశం "ఒరే సూర్యం జెర తొందరగా పోనియ్‌రా" అన్నాడు.

"అదేంటి బావ రోజు కంటే ఇవాళ ముందే బయలు దేరినాం. తొందరెందుకు ఇంకా చాలా టైముంది."

"కొత్తగా వచ్చిన ఆఫీసర్ దగ్గర మార్కులు కొట్టేయాలంటే ఆయనకు అందరికంటే ఐదు నిమిషాలు ముందే కనపడాలి. ఏం పని చేయకున్నగాని ఆయన ఖుషి అవుతాడు. అదే ఆలశ్యముగా పోయి ఎంత పని చేసిన కాని అది లెక్కకు రాదు చివాట్లు తప్పవు. తెలివి తక్కువ సన్యాసివి ఇవన్ని నీకు అర్థం కావు గాని లైటింగులు కొట్టుకుంటు సోకుల తొక్కుడు తొక్కకు తొందరగా పోనియ్"

"పెంటల పారెస్తే పెంట మెచ్చని ఈ కుక్కి సైకిల్‌తో లైటింగులు కొట్టుడు ! పైగా నిన్ను కూర్చోబెట్టుకుని ! పూరావస్తుశాఖ వాళ్ళు దీన్ని చూస్తే.... మరీ ఫైన్ కట్టిచ్చుకోని గుంజుకెల్తరు దీన్ని. ఔనుగాని బావ నాదో బ్రహ్మాండమైన అలోచన. ఆటోలు రిక్షాలు ప్యాసింజర్స్‌ను చేరవేసినట్లే ఈ సైకిల్ మీద ప్యాసింజర్స్‌ను చేరవేస్తే

రోజు ఎంతో కొంత సంపాదించవచ్చు గదా''

''అంటే రోజు నీతో సైకిల్ తొక్కించుకొని ఆటో చార్జీలు మిగిలిచ్చుకుంటున్నానన నీ ఉద్దేశ్యం. ఆపురా... ఆపు'' సైకిల్ దిగి విసురుగా వెళ్ళి స్వీట్ హౌస్‌లో దూరి బేరమాడి రెండు లడ్డూలు పట్టుకొచ్చాడు.

"ఇంత ప్రొద్దున స్వీట్ తినడం నాకు ఇష్టముండదు బావ"

"స్వీటు తినిపించేటంతటి ఘనకార్యం నువ్వేం చేయలేదు నీ కోసం కాదు గాని పోనియ్'' సైకిల్ హౌజింగ్ బోర్డు ఆఫీస్ వైపు బయలు దేరింది.

---- ---- ----

నెల రోజుల తర్వాత

ఆఫీసులో స్టాఫ్ మీటింగ్ జరుగుతున్నది. ఆఫీసు బాస్ మాట్లాడుతు "చూడండి పేద ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన కూడు గుడ్డ గూడు పథకాలలో ఇదొకటి. నిరుపేద ప్రజలు ఇండ్లు నిర్మించుకొనుటకు మనము ఇచ్చే సబ్సిడీ రుణంలో సగం మనమే మింగేస్తున్నట్లు అపవాదు మనపై పడింది. అటువంటి వారు కొంత మంది నా దృష్టికి వచ్చిండ్రు కూడా అందులో ప్రభాకర్ ముఖ్యుడు. అతన్ని అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ క్రింద ట్రాన్స్‌ఫర్ చేయమని హెడాఫీసుకు లెటర్ రాస్తాను. ఇంకా అటువంటివారు ఎవరైన ఉంటే వారి ప్రవర్తన మార్చుకోండ్రి. వెంకటేశం లాంటి వాళ్లను చూసి నేర్చుకోండ్రి. పిచ్చి పిచ్చి వేశాలు వేస్తే తోకలు కత్తిరిస్తాను. మీకు వా గురించి తెలుసనుకుంటాను. అవినీతి పరులకు చండశాసనున్ని'' కట్టే, కొట్టే తెచ్చే అని మూడు ముక్కల్లో చెప్పేసి సమావేశం ముగించి చాంబర్‌లోకి వెళ్ళిపోయాడు బాస్.

ఆఫీసు స్టాఫంత ఆయోమయంలో పడ్డారు. నీతి పరుడైన బాస్ వెంకటేశం భరతం పడతాడనుకుంటే ఆయననే నెత్తికెక్కిచ్చుకోవడమేమిటి? పైగా నిజాయితే ఊపిరిగా బ్రతికే ప్రభాకర్‌ను బదిలి చేయడమేంటీ? చిదంబర రహస్యం ఎవరికి అర్థం కాక బుర్రలు పీక్కుంటు ప్రభాకర్‌ను ఓదార్చారు. అందులో సూర్యం చాలా బాధపడ్డాడు.

సాయంత్రం ఇంటివద్ద వెంకటేశం తనలో తానే నవ్వుతు "ఇవాళ నాకు చాలా సంతోషంగా ఉందిరా సూర్యం ఈ రోజు నాకు నువ్వు పార్టీ ఇవ్వాలి'' అన్నాడు.

"నీకు సంతోషంగా ఉంటే నువ్వు నాకు పార్టీ ఇవ్వాలి గాని, నేనెందుకు ఇచ్చుడు? అయినా నా దగ్గర డబ్బులేక్కడున్నవి."

"అదంతె నాకు సంతోషంగా ఉన్నా నీకు సంతోషంగా ఉన్న నువ్వే పార్టీ ఇవ్వాలి అది పద్దతి నేను బావను నీవు బామ్మర్దివి పైగా ఉద్యోగం ఇప్పించాను. డబ్బులు లేకపోతే నన్ను చేబదులు అడగచ్చు గదా"

"అడగచ్చు అడగచ్చు ఇదేమన్న మనకు కొత్తనా నువ్వు నాకు అప్పివ్వడం నేను నీకు పార్టీ ఇవ్వడం సంతకం నాది జీతం నీది" గొణిగాడు సూర్యం "ఏం గుల్లుతావులే ఇవాళ నేనే నీకిస్తా..." అంటు ఇనప్పెట్టెలో నుండి యాభై రూపాయల నోటు తీసి "ఇదిగో క్వాటర్ విస్కి తీస్కురాపో" అంటు ఇచ్చాడు వర్క్ ఇన్స్పెక్టర్ ఇనప్పెట్టెల వెంకటేశం.

"ఇవాళ వరదలు వచ్చి ఏ ఊరు మునిగిపోతదో పాపం అయినా పాపాన్ని నేనెందుకు పంచుకునుడు గాని, అప్పుకిందనే రాసుకో" అంటూ నోటు మీదున్న అక్షరాలను క్రింద సంతకాన్ని చూసి విస్తుపోయాడు సూర్యం.

"ఒరేయ్ ఇవి లంచం సొమ్ము గాదురా నా రెక్కల కష్టం. ఏమిట్రా ఆ నోటును అంత పరీక్షించి చూస్తున్నావు. ఏమున్నది దానిమీద" అంటు సూర్యం చేతిలోని నోటు తీసుకొని చూసాడు "లంచావతారం" అక్షరాలను చూసి "ఇదా ఎవడో నీలాంటి వెర్రిబాగులోడు రాసుంటాడు"

"ఎవడో కాదు అది రాసింది నేనే, ఏడాది క్రితం నాకు నౌకరిచ్చుటకు మీ ఆఫీసర్ లంచం అడుగుతుండని నువ్వంటే ఊరిలో ఉన్న భూమిని అమ్మికవచ్చి నీకు ఇచ్చిన ముప్పయివేలల్లో ఇదో నోటు"

వెంకటేశం భుజాలు తడుముకొని "అరరే, భలే విచిత్రంగుంది ఏడాదికి తిరిగి మన నోటు మన చేతికే రావడం వింతైన విషయం. ఎవ్వరైన చూస్తే ఆఫీసర్ పేరు చెప్పి ఆ డబ్బులు నేనే నొక్కేసిన అనుకుంటారు. భలే విచిత్రం జరిగింది. పో...పో... జెల్ది పోయిరాపో, ఇదిగో బ్రాండీ షాపులో నా పేరు చెప్పు తక్కువ ధరకు ఇస్తాడు" అని ఓ పిచ్చి నవ్వు నవ్వాడు.

"ఏంటి ! నీ పేరు చెప్పితే తక్కువ రేటుకు ఇస్తాడా ? నీవేమైన పోలీస్ ఇన్స్పెక్టరువా లేక ఎక్సైజ్ ఇన్స్పెక్టరువా నీ పేరు చెప్పితే భయపడి తక్కువ రేటుకు ఇవ్వటానికి ? కొంపలు కట్టించే శాఖలో కొంపలు కూల్చే వర్క్ ఇన్స్పెక్టర్వి." ఉద్యోగం

ఇప్పించడానికి ఆఫీసర్‌కు లంచం ఇవ్వాలని అబద్దం చెప్పి ఊరిలో ఉన్న పొలంను అమ్ముకొనేలా చేశాడన్న బాధతో కోపంగా అని విసురుగా బ్రాండి షాపుకు వెళ్తున్న సూర్యంకు ఓ మెరుపు లాంటి ఉపాయం తట్టగా యాభైకి మరో యాభై కలిపి హాఫ్ బాటల్ విస్కి తీసుకువచ్చి వెంకటేశంను మాటల్లో ముంచాడు. కిక్కెక్కిన వెంకటేశం "బామ్మర్ది నువ్వంటే నాకు ప్రాణమోయ్, నీకోసం నా ప్రాణమైన ఇస్తాను" మత్తులో తూలుతూ అన్నాడు.

"ప్రాణమెందుకు బావ ప్రేముంటే చాలు. ఔగాని బావ, నువ్వు చాలా గొప్పోడివే కాని, అంత స్ట్రిక్ట్ ఆఫీసర్‌ను ఎలా బుట్టలో వేసుకున్నావో నాకు అర్థమవుతలేదు" మెల్లగా కదిపాడు సూర్యం.

"అదా అంత లడ్డూల మహిమ. ఆ రోజు స్వీటు హౌస్‌లో రెండు లడ్డూలు కొన్నాను గుర్తుందా. అవి మా అత్తమామ తిరుపతి నుండి తెచ్చినవి అని ఆఫీసర్‌కు ఎంతో భక్తితో ప్రేమతో ఇచ్చినాను. దాంతో ఆఫీసర్ సెంటిమెంటల్ గా తెగ ఫీలయ్యిండు. మోఖ జూసి ప్రతిదానికి అడ్డు వస్తున్న ప్రభాకర్ గాన్ని తొలగించుకుందామని వాని మీద ఓ రాయి పడేసిన దాంతో వానికి బదిలి అయ్యింది. నాకు పీడ వొదిలిపోయింది. ఎంత నిజాయితి పరుడైనప్పటికిని సెంటిమెంటుకు చెంచాగిరికి పడిపోయిండు మనిషిని వీక్ పాయింట్ చూసి దెబ్బ కొట్టాలిరా" అని ఇంకా ఏదేదో చెప్తుతు కుర్చిలోనే గుర్రు కొట్టిండు.

---- ---- ----

ఉదయం నీలగిరి చెట్టెక్కి చిక్కుడుకాయ తెంపుతున్న వెంకటేశం కొమ్మ విరిగి క్రింద పడ్డాడు. తలకు పోటురాయి బలంగా తగలడంతో తీవ్రమైన రక్తస్రావం జరిగి స్పృహ తప్పిపోయిండు.

ప్రైవేటు నర్సింగ్‌హోంలో ట్రీట్‌మెంట్ తర్వాత వెంకటేశం స్పృహలోకి వచ్చి మెల్లగా కళ్ళు తెరిచి చూసాడు. చుట్టు భార్య పిల్లలు, బామ్మర్ది, ఆఫీసు స్టాపంత బాస్‌తో సహా బాధ ముఖాలతో ఉన్నారు.

పక్కనే ఉన్న డాక్టర్‌తో వెంకటేశం "నన్ను బ్రతికించినందుకు నేను మీకు చాల ఋణపడి ఉన్నాను సార్" అన్నాడు బాధగా.

"మీరు రుణపడి ఉంది నాగ్గాదు సమయానికి మీ గ్రూపు రక్తం దొరకకపోతే

ఎంతో నీరసంగా ఉన్నాగాని నీకు రక్తం ఇచ్చి బ్రతికించిన మీ కొలిగ్ ప్రభాకర్ గారికి" ప్రభాకర్‌ను చూపిస్తు అన్నాడు డాక్టర్.

గుండెలో ఎవరో రంపంతో కోసినట్లనిపించింది వెంకటేశంకు, కళ్ళు బురదగుంటలయినవి, ఏడుస్తు ప్రభాకర్ చేతులు పట్టుకొని ఈ పాపాత్ముణ్ని క్షమించండి సార్ మీకెంతో అపకారం చేసినగాని అవన్నీ మర్చిపోయి నన్ను బ్రతికించిండ్రు" పక్కనే ఉన్న ఆఫీసర్‌కు చేతులు జోడించి "సార్ ప్రభాకర్‌గారు చాలా నిజాయితీపరుడు ఆయన ట్రాన్స్‌ఫర్ ఆపండి సార్" అంటూ ఏడుస్తు ప్రాదేయ పడ్డాడు.

"ఆయన ట్రాన్స్‌ఫర్ నీ బావమర్ది సూర్యప్రకాశ్ ఎప్పుడో ఆపేసిండయ్యా" అని ఆఫీసర్ అనడంతో వెంకటేశం ఆశ్చర్యపోయి అర్థం కానట్లు చూసాడు.

"నిన్న రాత్రి నీవు మందు తాగిన మత్తులో అన్న మాటలన్ని టేపులో రికార్డు చేసి నాకు వినిపించి నాకండ్లు తెరిపించాడు. సుత్తి కొట్టేవాడు శతృవని తెలుసుకున్నాను. చూడయ్యా, నీవు మంచిపని చేయకున్నా సరే కాని, మంచిని మంచిగానే బ్రతకనివ్వండి చాలు నిన్ను బ్రతికించుకోవడం కోసం నీ బావమర్ది పడిన బాధ అంత ఇంత కాదు ఆయన కోసమైన మంచి వాడుగా జీవించండి" అని వెళ్ళిపోయాడు ఆఫీసర్.

వెంకటేశం సూర్యప్రకాశ్ వంక ఎప్పుడు చూడని ఓ వింతైన చూపు చూసాడు. కృతజ్ఞతతో పాటు శబాష్ బామ్మర్ది అని మెచ్చుకోలుగా ఉంది ఆ చూపు.

❁ ❁ ❁

యమపురిలో ఒక రోజు

రాత్రి తొమ్మిది గంటలు కావస్తుంది. వర్షాకాలం కావటం చేత వర్షం కురిపించడానికి కారు మబ్బులు కమ్ముతున్నాయి. కురిసే ముందు జీవరాసులు తడవకుండ తలదాచుకొనుటకు మేఘాలు ఉరుముతు మెరుస్తు, హెచ్చరిస్తు, కొంత వ్యవధి ఇచ్చాయి. ఈ అనంతకోటి జీవరాసి మీద వరుణునికి ఎందుకో అంత ప్రేమ!

మేఘాలు ఎంత హెచ్చరిస్తున్నప్పటికిని, పని ఒత్తిడి వలన హెచ్చరికలను ఖాతరు చేయకుండ రేడియోను రిపేరు చేయడంలో మునిగిపోయాను.

రేడియో ఆసామి ఉదయం షాపు తెరవగానే వచ్చి, నానా మాటలని వెళ్లాడు. ఆరునెలల్లో ఆరుసార్లు రిపేర్‌కు వచ్చింది ఈ పనిదొంగ రెడియో. వచ్చిన ప్రతిసారి కొత్త పార్టులు వేసి మంచిగా చేసియిత్తున్నాను. మళ్ళీ నెల గడవక ముందె అలుగుతుంది మొండి ఘటం. అది అలుగుట ఆలశ్యం లేదు దాన్ని పట్టుకొని వచ్చి నాషాపు మీద పడి భీభత్సం సృష్టిస్తాడు ముసలోడు. ఇది నాకో కాశ్మీర్ సమస్యలా తయారయింది.

ఏమాటకామాటే చెప్పుకోవాలి అప్పుడప్పుడు పూర్తిగా మంచిగా చేయకుండానే తిరిగి అసామికి ఇచ్చేస్తాను. తప్పు చేస్తున్నవని, అంతరాత్మ హెచ్చరిస్తుంది కాని ఏం చేయను. టివిలు వచ్చినప్పటి నుండి రేడియోను దేకినవారే లేరాయే పొట్టగడుపుకోవాలి కాబట్టి రాజీపడ్తాను. ప్రైవేటు డాక్టర్ల కంటె నేనే నయమనుకొని తృప్తి పడ్తాను.

అయిన అందరివద్ద అట్ల చేయను. అసామి గట్టోడు అయితేనే అలా చేస్తాను. కాని ముసలోని విషయంలో మాత్రం మోసం చేయలేదు. పెద్దమనిషి.... అందులో పాత కాలం మనిషిని మోసం చేయడం పాపమనిపించింది. కాని ఏ విషయంలోనైతే నేను నిజాయితిగా ఉంటానో ఆ విషయంలోనే దోషినైపోతాను.

ఉదయం ముసలోడు డబ్బులు గుంజడానికి వెకిలివేషాలేత్తున్నావు ఎదో గెలికి ఇత్తున్నవు అంటే పాణం చివుక్కుమంది. ముసలోడి లొల్లికి పక్కషాపులోల్లు పనిగట్టుకొని వచ్చి ఎదో వింత చూసినట్టు చూసి నవ్విపోయిరి. గుండెలో కెలికినట్లై

తలకొట్టేసినట్లయింది కూల్ డ్రింక్ తెచ్చి తాగిపిచ్చినంక కూలైండు ముసలోడు.

ఆ ముసలోనికి అదేం రోగమోకాని! మందులు కనిపెట్టినకొద్ది కొత్త కొత్త రోగాలు పుట్టుకు వచ్చినట్లు ఇంటింటికి కలర్‌కలర్ టివిలు కలరా వ్యాధిల సోకిన ఈ కాంపిటేషన్ కంప్యూటర్ యుగంలో పుట్టగొడుగుల్ల పెరుగుతున్న చచ్చుచానల్స్‌లో వచ్చు రోత పాటలను చూసి పిచ్చిగా ఆనందించక ఈ పాతకాలం రేడియోలో వచ్చే పాత పాటల మీద మోజెందుకో ముసలోడికి?

అయినా తప్పునాది ఏదో రోటీన్‌గా ఆరునెలల గ్యారంటి ఇవ్వడం. ఇప్పుడిది పాడకపోతే రేపు నా షాపు తెరవదు. కొత్తది కొనిచ్చినా ఒప్పుకుంటాడోలేదో? రేపు షాపు తెరవక ముందె వచ్చి మెట్ల మీద కూర్చొని నాకోసం ఎదిరి చూస్తుంటాడు. దుబాయి పోయిన భర్తకోసం భార్య ఎదిరి చూసినట్లు ఆ దిక్కుమాలిన పొగాకు చుట్టోటి. అరకిలోమీటరు వరకు వ్యాపిస్తుంది దాని సువాసన పరిమళం.

ఆ భయంతోనే రాత్రంత షాపులో జాగారం చేసైన సరే ఈరేడియోను పలికించాలన్నదే నా ధ్యేయం.... లక్ష్యం.... ఆశయం.... అన్నీను. లేకుంటే అడ్రస్ దొరికిచ్చుకొని ఇంటిగ్గాడ వస్తడు ముసలోడు. నేను సుయ్యో గొయ్యో చూసుకొనుడైతది.

ఆలోచనలు మదిలో మెదులుతుండగానే కరిగిపోయి కరుణించింది దూరదర్శన్ దూత పాత రేడియో. ఒకసారి ఊపిరి గట్టిగా బిగబట్టి శ్వాస వదిలి బ్యాండ్ ఆన్ చేసాను. "నామది నిన్ను పిలిచింది గానమై... వేణు గానమై.... నా ప్రాణమై" అని పాటందుకున్నది. ఆ పాట వింటుంటే నా మనసు పరవసించిపోతుంది. ఎన్టీఆర్ మహమ్మద్ రఫి కళ్ళముందు కదలాడారు. ప్చ్... పాపం కనుమరుగైపోయిన కళామయులు బాధనిపించింది. ఇంటికి తొందరగా పోదామని మనసులో ఎంత ఆత్రంగా ఉన్నా పాట పూర్తిగా వినకుండ వెల్లుటకు మనసు అంగీకరించలేదు.

పాట అయిపోగానే రేడియో కట్టేసి కుర్చిలోంచి లేచి షటర్ కిందికి లాగడానికి ఐరన్ రాడ్ కోసం వెదుకుతుండగా.... ఆకాశానికి చిల్లులు పడ్డట్లు కుండపోత వర్షం మొదలయ్యింది. నా నిర్లక్ష్యనికి వరుణునికి నామీద కోపం వచ్చిందో ఏమో! రాదామరి కొంచెం చనువిత్తే చంకనెక్కుతంటే ఎవరికైన కోపం వస్తది. మళ్లీ కుర్చిలో కూలబడ్డాను.

వర్షం ఎప్పుడు తగ్గుతుందోనని అసహనంతో చిరాగ్గా రోడ్ వైపు చూసాను. నా చూపు వర్షాన్ని దాటేసి మసక మసకగా కనిపిస్తున్న ఆర్గురు వ్యక్తుల మీద పడింది.

వారిని అదే ప్రదేశంలో చాలా రోజుల నుండి చూస్తున్నాను.

కాని వారి గురించి నేనెప్పుడు ఆలోచించలేదు. అందులో ప్రక్కనున్న పాన్ షాపతను ఒకడు. వారు గంటల తరబడి ఏం మాట్లాడుకుంటరు, మనస్పర్థలు రావా? అంత గొప్ప స్నేహమా వారిది? ఈ రోజు కల్సిపోయి రేపు మర్చిపోయే స్నేహాలు ఇప్పటివి. స్నేక్-హోంలు తప్ప నిస్వార్థమైన స్నేహాలున్నాయా ఈరోజుల్లో ? అందులో ఇంతింతగాదు ఇగోయిజం బాధలు.

బిల్డింగ్ నజ్జక్రింద నిలుచున్నవారు వర్షం తుంపర్లకు కొంత తడుస్తున్నట్టున్నారు. కనీసం ప్రక్కనే ఉన్న ఎస్టీడిలోకి పోవచ్చుగద. ఫోన్ చేసేవారు ఏవో రహస్యాలు మాట్లాడుకుంటారు. వారినెందుకు ఇబ్బంది పెట్టుడనో ఏమో! నాషాపులోకి వస్తే ఎవరికి ఏలాంటి ఇబ్బంది ఉండకపోవు. నేనుకూడ సంబరంగ వారి సంభాషణలో పాలుపంచుకొందుంటిని, పిలువన? పిలిస్తే వస్తారో రారో? వస్తే సరెగాని రాకుంటే బాధనిపిస్తది. అయినా నాకెందుకు గాలికిపోయే కంపను తగులపెట్టుకునుడు. నేనసలే సెన్సిటివ్. మా పక్కింటాయన తిట్టినట్లు కలవడ్తేనే రెండ్రోజులదాక మనసు మనసులో లేదు. అయిన వాళ్ళది బలుపు కాకపోతే వర్షం వస్తదని తెలుసుండి కూడ తొందరగా ఇంటికి పోవద్దా? అయ్యో ! రేప్రొద్దున సిఎం మీటింగుండె, కట్టుదిట్టమైన బందోబస్తు ఏట్లేర్పాట్లు జేసుడు? అసలే కల్లోల కరీంనగర్ జిల్లా అని నిద్రహారాలు మాని పోలీసోల్లు పడే హైరానాలాగుంది వారి వరస.

వర్షం కొద్దిగా తగ్గింది. ఇదే అవకాశమనుకొని ఆదర బాదర షాపు మూసేసి రోడెక్కాను. వారక్కడ ఎంతసేపున్నారో గాని, వారి గురించి నా ఆలోచనలు ఇంటిదాక వెంటాడాయి.

ఉదయం ముసలోడికి రేడియో ఇవ్వడంతో అరబ్బులోని అప్పు తీర్చినంత ఆనందం పొందాను. నా ఆనందాన్ని పంచుకోవడానికి దగ్గర స్నేహితులు లేరుకాని, ఉంటే స్వీట్ పార్టీ ఇచ్చేవాన్ని. నిన్నటి వర్షంలోని వారు స్నేహితులైనా బాగుండును.

వారితో స్నేహం చేయాలని మనసు పరితపిస్తోంది. మనసులో ఏదో తెలియని వెలితి ఏర్పడుతుంది. వారి గురించి అనుకుంటుండగానే, ఒకరి తర్వాత ఒకరు చేరుకున్నారు. ఈరోజు విశేషమేమిటోగాని అందులో ఓ ఆజానుబాహుడు స్వీట్ పార్టీ ఇస్తున్నాడు. వారిని అలా చూస్తుంటే నాకు కాలేజి రోజులు గుర్తుకు వస్తున్నాయి.

వారిని పరిచయం చేసుకుందామని కుర్చీలోంచి లేవబోతుంటే మనసులో

ఏదో కీడు శంకించింది. వీడెవడో స్వీటు కోసమే వచ్చిండని అనుకుంటారో ఏమో! రేపు చూసేది వాయిదా వేసుకున్నాను.

ప్రతిరోజు వారు యధావిధిగా కలుసుకుంటూనే ఉన్నారు. నేను రోజు వారిని కలుసుకుందామని అనుకుంటున్నాను. కాని కలవలేక పోతున్నాను. వారి ఆలోచనల్లతోనే రోజులు దొర్లిపోతున్నాయి.

ఈరోజు తప్పకుండ వారిని కలుసుకోవాలని గట్టిగా నిర్ణయించుకొని నామీద నేనే ఒట్టుపెట్టుకున్నాను. వారికి నూరేండ్ల ఆయుష్షు. వారి గురించి అనుకుంటుండగానే మిత్రులంత దిగిండ్రు. ముఖాన్ని అద్దంలో చూసుకున్నాను. ఉదయం నుండి పని చేయడం వలన చెమటతో జిడ్డుగా తయారయింది. కొంచెం దూరంలోనున్న లిబర్టి హోటల్‌కు పోయి వాష్ బేసిన్‌లో ముఖం ఫ్రెష్ చేసుకున్నాను. హోటల్ యజమాని ఏమనుకుంటాడోనని ఓ టీ త్రాగాను. మెరుపు లాంటి ఆలోచనతో ప్రక్కనున్న కళాపూర్ణ స్టూడియోకి పోయి తల దువ్వుకొని చక్కగా మేకప్ చేసుకొని వచ్చి వారిని ఓసారి చూసి మనసులో భగత్‌సింగ్, వీరశివాజి, ప్రకాశంపంతులు మరెందరో ధైర్యవంతులను గుర్తుచేసుకొని ముందుకు నడిచాను.

నడిచేది నడవంగానే చెమటలు పట్టినాయి. కాళ్ళు చేతులు వణుకుతున్నాయి. ధైర్యం రాక మళ్ళి షాపులోకి వచ్చి చతికిల పడ్డాను. ఎందుకిట్లవుతుంది ? ఇన్‌ఫీరియారిటి కాంప్లెక్సేమో! బిల్డింగు కాంప్లెక్సుల్లేవు గాని ఇన్‌ఫీరియారిటి కాంప్లెక్స్ అయితే బోలెడంత ఉంది. వ్యక్తిత్వమే శత్రువై చెడపెడ వాయిస్తు ఓరే మోహన్ నీపేరు మొహమాటమని మార్చుకోరా అని బండబూతులు తిడితే భరించలేక భయలుదేరాను బందిపోటు వీరప్పన్‌లా.

వాళ్ళ దగ్గరకు చేరి 'నమస్కారం సార్' అని అందామనుకున్నాను, కరంటు పోయింది. చిమ్మని చీకటి. ఎట్ల? మందలిత్తె పిచ్చోడనుకుంటరో ఏమో? బాగుండది. కరంటు వచ్చినంక వస్తాను అనుకొని వెనుకకు తిరిగి రెండు అడుగులు వేసిన... ఢాంఢాం తుపాకి పేలిన శబ్దం. అందులో ఒకతను కెవ్వుమని అరిచి క్రిందపడిపోయిండు. నేను క్రింద పడిపోయిన భయానికి. తుపాకి మరో రెండు సార్లు గర్జించింది.

నేను బ్రతికే ఉన్నాన? చనిపోయిన్న ? అనుమానం వచ్చి చేతిని కదిపిన, కదిలింది బ్రతికే ఉన్నాను. గుండె ఆగిపోతున్నట్టయింది. తుపాకి శబ్దం ఆగిపోయింది.

కరంటు వచ్చింది. గబడ గబడ బూట్ల చప్పుడు. లేచి పరుగందుకున్నాను. ఏదో బలంగా పడింది మీద, ఏమిటా అని తిరిగి చూసాను. 'ప్పో...ప్పో...పోలీసు' గుండె వేగం పెరిగింది. నోరెండి పోయింది. శరీరమంత తడుముతుండు మరో పోలీసు. ఏదో చెప్పాలని నోరు తెరిచిన. ఏం చెప్పాలో తోచలేదు. నాలుగు బలంగ అంటిచ్చి తీసుకుపోయి లాకప్‌లో పెట్టిండ్రు. నాతో పాటు మరో ఇద్దర్ని.

పోలీస్టేషనంత ఆగమాగం. అంబులెన్సంటుండ్రు హాస్పిటలంటుండ్రు ఎస్పీ అంటుండ్రు ఎక్స్ట్రిమిస్టు అంటుండ్రు. నాకేమి అర్థమైతలేదు. కాని వారి అరకొర మాటల్లో ఒకటి మాత్రం అర్థమయింది. కాల్పులు జరిపింది నక్సలైట్లని. మరి, నన్నెందుకు పట్టుకొచ్చిండ్రు? నక్సలైటని పట్టుకొచ్చిండ్రేంది:? వామ్మో! ఆలోచిస్తేనే భయంకరంగా ఉంది. ప్రక్కనున్న ఇద్దర్ని చూస్తే వారిది దాదాపు నాలాంటి పరిస్థితే. వారిని ఎప్పుడు చూడలేదు. అమ్మో, వీళ్ళే నక్సలైట్లేమో! గట్టిగా కండ్లు మూసుకున్నాను.

తాపకోసారి సెంట్రి పంట చేనులో కావలున్నట్టు పిట్టలను అదిలించినట్టు అరుస్తుండు వారి భాషలో మధ్యమధ్యలో మావద్దకు వచ్చి చూసుకుంటు పోతుండు. వచ్చినప్పుడల్ల గుండె ఝల్లుమంటుంది. ఎటన్న తీసుకుపోయి చంపేస్తరో ఏమో! దుఃఖం పొంగుకొచ్చింది ఇల్లు గుర్తుకు వచ్చింది. నేను ఇంటికి పోయేదాక పిల్లలు అన్నం తినరు ఆమెకు ఈ రోజు ఒక్కపొద్దు తినడానికి ఏమన్న తెస్తడేమోనని ఎదిరి చూస్తుంది. ఏం తీసుకుపోవాలి? నా చావు కబురా?

పాపం వాల్లెమయిండ్రో, కెవ్వుమని అరిచినతను చచ్చిండో, బత్కిండో? వాళ్ళు పరిచయమైనగాని, నేను మంచోన్నె అని చెప్పుదురో ఏమో! 'ఛీ' ఇంకా వాళ్ళను గుర్తు జేసుకునుడా! వాళ్ల జేయవట్టే గద నాకీ గతి పట్టింది. 'ఛ' వాళ్ళేం జేసిండ్రు నాదురదృష్టం గాని, అయినా స్పందించే వాడికి సమస్యలు కరువా? స్పందించేవాడు రోజు చస్తడు రోజు పుడ్తడు స్పందించని వాడు ఎప్పటికి చావడు. అసలు ప్రాణముంటేగద చావడానికి. కళ్ళల్లో తెల్లారింది కల్లోల జిల్లాలో పల్లెలాగ.

లాకప్ నుండి బయటకు తీసిండ్రు. ప్రహరిగోడ అవతల గుంపులు గుంపులుగా జనం. పరీక్షగా చూసాను గుంపులో ఏడుస్తు నా భార్య పిల్లలు.

'ఏమి కాదు ఎడ్వకుండని' ఏడుస్తు చేయి సైగ జేసాను.

మా గల్లి లీడరొచ్చిండు. కొండంత ధైర్యమొచ్చింది. పట్టుకుని ఏడ్వాలనిపించింది. కాని దగ్గరకు వచ్చి పదివేలు తెప్పించుకో పైరో చేసి విడిపిస్తాను."

అంటే ప్రాణం సగం చచ్చింది. పదివేలుంటే పాత రేడియోల మీద బత్కుతాన? ఎట్లైతట్లాయే అనుకున్న గుండె దిట్రం చేసుకున్న.

సర్రున జీపు వచ్చి ఆగింది సెంట్రి 'తం... తుం...' అని అరిచి కట్టె సరిసినట్టు బొమ్మై నిల్చుండు. పెద్దసారో ఏమో జీపు దిగి లోపలకు వెళ్ళిపోయిండు. ఓ పోలీసాయన వచ్చి పరీక్షగా చూసి "మిమ్మల్నందర్ని సార్ రమ్మంటుండు" అన్నాడు. ఆయన కొంచెం ఏర్పాటే నాకు. టేపురికార్డర్ రిపేర్ కోసం వచ్చిండోసారి. నా భాధ చెప్పి ఆదుకొమ్మంట అనుకున్నాను. కాని "ఏం చూస్తున్నవ్ నడువు బే" అని మెడలు వంచి రెండు గుద్దులు గుద్దిండు వీపు మీద. 'అవ్వ' అని మూలిగిన. కళ్ళల్లో నీళ్ళు తిరిగినాయి. రిపేర్కు వచ్చిననప్పుడు పైసలు గట్టిగ అడిగింటి ఆ కోపమో ఏమో!

పెద్దసారు దగ్గరకు పోయేసరికి సగం ప్రాణముంది. పెద్దసారు పరీక్షగా మా ముఖాలను జూత్తుండు. నేను మూలకున్న రోకటి బండను జూత్తున్న నా బ్రతుకు ఆ బండమీద ఆధారపడి ఉంది. వొంటికి సున్నమో! ఇంటికి శవమో! ఏదో ఒకటి, కలలో కూడ ఊహించని సంఘటన ఇది. జీవించి ఉంటే జీవితంలో మరిచిపోలేని రోజు ఇది.

"రాత్రి పూట రోడ్లమీద ఏం పనోయ్ మీకు పొండి వెల్లిపోండి ఇంకోసారి కనిపిస్తే మంచిగుండది" అన్నాడు సారు.

ఆశ్చర్యం ఆనందం కలిపి నోట్లో పెట్టినట్లయింది. మళ్ళి గుండె వేగం పెరిగింది. ముగింపు సరిగా లేని సినిమాలా అయింది. ఆయన ఫోటో ఇత్తే మంచిగుండు. ఇంట్లో పెట్టుకుని రోజు దండం పెట్టుకుందుంటి అనుకున్నాను. దండం పెట్టి బయటకు వస్తుండగా గల్లి లీడర్ ఎదురయ్యిండు. గుంజుకుపోయి ఈని సంగతి సారుతో చెప్పుదామా? అనిపించింది. పిల్లి కూనోలె నన్నే చూస్తుండు. పోన్తియ్ ఓటడ్గరాడా? అప్పుడు ఈని మానందీత్త అనుకొని మా వాళ్ల దగ్గరకు వచ్చినాను. ఒకర్నొకరం చూసుకుని కళ్ళతోనే మాట్లాడుకున్నాం. బాబును పాపను ఎత్తుకొని కదిలినాము.

ఎవరో అంటుండ్రు "ఎవర్ని నమ్మచ్చేటట్టు లేదని" తిరిగి చూసిన మా పక్క షాపోడు నన్నే చూస్తుండు. ఒళ్ళు మండింది. 'ఔర నక్సలైటునే అయితేందిరా' అందామనిపించింది. పోన్తియ్ ఎవరి పాపం వారికే తగులుద్ది అనుకుని దారొంటి నడుస్తుంటే తెలిసిన వాళ్ళు ఎదురైతే సిగ్గనిపించి తల క్రిందికి వేసి. నడుస్తున్నాను.

ఔను నేనెందుకు తలదించుకోవాలి. నేనేం నేరం చేసిన? నేను ఏ నేరము

చేయలేదని నా మనసుకు తెలుసు. చేయనని నా భార్యకు తెలుసు. చేసినట్లైతే నా అంతరాత్మే నన్ను శిక్షిస్తుంది. మరి తలెందుకు దించుకోవాలి. తలదించుకుంటే తరిమి తరిమి కొడ్తరు కొందరు పిచ్చోళ్ళు.

తల పైకెత్తినడుస్తున్నాను. మావాడలోకి వచ్చినాము. కొందరు గోడల మీద నుండి చూస్తుంట్రు. అదో రకమైన వింత చూపు. క్రూర జంతువును చూసినట్లు అందరికి తెలిసినట్లుంది గుసగుసలు పెడుతుంట్రు. చెవులు కొరుక్కుంటుంట్రు నొప్పి పెట్టేలా. చెడును చర్చించుకున్నంతగ మంచిని పది మైకులపెట్టి అరిచిన విన్పించుకోరు ఈ వెర్రి మనుషులు. అయ్యో ఏమైంది అని అడిగితే వీరి ముల్లె ఏమన్నా పోతదా? కింద పడ్డ మనిషిని చూసి ఎంజాయ్ చేయడం తప్ప కనీసం సానుభూతి చూపడం కూడా వీరి చేత కాదు.

ఇంటికి చేరుకోగానే వారికేమైంది? అసలు వాళ్ళు ఎవరు? అడుగుదామని ఆమె ముఖంలోకి చూసాను. ఆమె జాలిగా నన్నే చూస్తుంది. ఆమె కళ్ళు కురిపించడానికి సిద్దంగా ఉన్న కారు మేఘాల్లా కన్నీళ్ళతో నిండి ఉన్నవి. ఆమెను చూస్తే నాకు దుఃఖం ఎగదన్నుకు వస్తోంది.

బాబు టీవి పెట్టిండేమో! వార్తలన్నున్నాయి. రాత్రి సంఘటనే చెబుతున్నట్టుంది. చెవులు తాటాకులు చేసుకొని చూసాము.

"నిన్న రాత్రి కరీంనగర్ జిల్లాలో టార్గెట్ అనుకొని నక్సలైట్లు జరిపిన కాల్పుల్లో కొందరు యువకులు గాయపడ్డారు. అందులో ఒకరు ప్రాణాపాయ స్థితిలో ఉండగా నిమ్స్‌కు తరలించి చికిత్స చేయుచుండగా చనిపోయాడు. ఆయన వృత్తి రీత్యా ప్రభుత్వ ఉద్యోగి అయినప్పటికిని, తన మిత్ర బృందంతో కలిసి సమాజాన్ని పీడిస్తున్న అతి భయంకరమైన ఎయిడ్స్ మహమ్మారి, మరెన్నో సమస్యలపై స్పందిస్తూ ప్రోగ్రాంల ద్వారా వారి కలంతో, గళంతో జనజాగృతం చేసారు. ఆయన మారణవార్తతో ఆ ప్రాంత ప్రజల్లో విషాదం అలుముకుంది. ఇప్పుడే అందిన వార్త.... అతన్ని చూసుటకు ఆయన కుటుంబ సభ్యులు, సమీప బంధువులు జీపులో వస్తుండగా మార్గమధ్యంలో జీపుకు లారీ ఢీకొని ఘోర ప్రమాధం జరిగింది. జీపులోని వారంత అక్కడికక్కడే మరణించారు. ఒక్క సంవత్సరం పసిపాప మాత్రం బ్రతికున్నట్లు మా విలేఖరి తెలిపారు."

"అబ్బ... గుండె విలవిల కొట్టుకుంటుంది. ఆమెనైతె బోరున విలపిస్తుంది.

మమ్మల్ని చూసి పిల్లలు ఏడుస్తుంద్రు. ఇల్లు శ్మాశనంలా తయారైంది. సమాజానికి సేవ చేసేవారు ఎక్కడో నూటికో కోటికో ఒక్కరు పుడుతారు. అలాంటి వారు ఇలా చనిపోవడమేమిటి? ఈ పరిస్థితిని మార్చే నాథుడే లేడా? అయినా నేనేమి చేయగలను సగటు మనిషిని. ఈరోజుల్లో స్పందించడం కూడా తప్పేనేమో! నేను కూడా మర మనిషిగానే మారిపోతా........

యాక్సిడెంటు జరిగిన సంఘటన స్థలాన్ని, శవాలను చూపిస్తుంద్రు టివిలో ఆ దృశ్యంలో ఒక శవాన్ని చూసి నా కళ్ళు అక్కడే నిలిచిపోయాయి. 'అతను... అతను.... రేడియో ముసలయ్య. కట్టలు తెంచుకున్న దుఃఖం ఒక్కసారిగా గొంతులో గడ్డకట్టినట్లై... తాతా అని అరవబోయాను.........

కానీ, నోరు పెకలడంలేదు మూతబడిపోతుంది. పోనీ....

కన్నీల్లు రావడంలేదు ఇంకిపోతున్నవి పోనీ....

మెదడు మొద్దుబారి పోతుంది.... పోనీ.....

గుండె బండలా మారిపోతుంది.... పోనీ....

శరీరం స్పర్శ కోల్పోతుంది..... పోనీ.....

పోనీ.... పోనీ.... పోతే పోనీ.... గుండె బండగానే మారిపోనీ.......

కానీ ... కానీ... ఐతే కానీ.... అంతా యాంత్రిక జీవనం కానీ......

పోయింది పక్కోడి ప్రాణం నాకెందుకు ???

నాకెందుకు నాకెందుకు అనే శబ్దం నరనరాన జీర్ణించుకు...

పోనీ.... పోనీ..... పోతే పోనీ....

❀ ❀ ❀

పడగ నీడలో పావురాలు

"ప్రకాశ్"

"సర్"

"నీవు, ఇంకో జవాను పోయి ఈమె మరిదిని పట్టుకురాండ్రి" వెక్కి వెక్కి ఏడుస్తున్న ఆమె వైపు చూపిస్తూ అన్నాడు ఎస్.ఐ. సుదర్శన్‌గౌడ్.

మంచిదన్నట్లు తలూపి సెల్యూట్ చేసి బయటకు వస్తున్న ప్రకాశ్‌కు శేఖర్ ఎదురయ్యాడు.

"శేఖర్ పిటిషన్ ఎంక్వయిరీకి వస్తావా? ఆమె మరిదిని పట్టుకు రావాలి" అన్నాడు ప్రకాశ్.

"ఎంధుకు రాను పద" అన్నాడు శేఖర్

బయటకు వచ్చి సైకిళ్ళు తీస్తుండగా ఫిర్యాదుదారి మల్లమ్మ వచ్చి "సారూ మీకు దండం పెడతా, తప్పకుండా పట్టుకురాండ్రి, ఇడిసి పెట్టకుండ్రి" అంటూ ఏబై రూపాయలు ప్రకాశ్ కానిస్టేబుల్‌కు ఇవ్వబోయింది.

"అరరె... పైసలెందుకమ్మా... పట్టుకు వస్తాం గదా... ఉండు..." అన్నాడు.

"సారూ... పట్టుకు వచ్చినంక గట్టిగ తన్నుండ్రి ఇవ్వయితే తీసుకోండ్రి" అంది.

"ఏమ్మా ఏబై రూపాయలేనా ఇద్దరం జవాన్లం పోతున్నాం ఇంకో ఏబై ఇవ్వు" అంటూ బేరమాడాడు శేఖర్.

"లేవు సారూ గివ్వే ఉన్నయ్. మీరైతే పట్టుకురాండ్రి ఎవల్లున్న చేబదులు అడ్కచ్చిత్తా"

ప్రకాశ్ ఓసారి శేఖర్ వంక చూసి అయిష్టంగానే ఏబై రూపాయలు తీసుకుని "సరేగాని, నీ మరిదికి నీకు గొడవేంటి?" అన్నాడు.

"మా మరిది పోషిగాడు పత్తాలాట ఆడుకుంటూ పన్జేత్తలేడు. పన్జెయకపోతే ఎట్లరా అని, నా మొగుడు రాత్తిరి అన్నందుకు నా మొగున్ని కొట్టిండు. తలకు ఇంత పెద్ద గాయమైంది సారూ."

"అంటే మీ మరిది మీరు పొత్తుల్నే ఉంటరా?" అన్నాడు ప్రకాశ్.

"అవునయ్యా... ఆడు చిన్నగుండంగనే మా అత్తమామ సచ్చిపోయింద్రు. అప్పట్నుండి వాన్ని సాదితే నా మొగున్నే కొట్టేటోడయిండు" చెప్తూ ఏడ్వసాగింది మల్లమ్మ.

"మరి నీ మొగుడేడి?" అన్నాడు శేఖర్.

"ఆడుట్టి పిసోడు సారూ... పోలీసులంటే భయం. దవాఖానుకు పోదమన్నా రాలేదాడు"

"సరే... ఉండమ్మా పట్టుకత్తాం..." అని సైకిళ్ళు తీసారు ప్రకాశ్, శేఖర్.

*** *** ***

"ఇదే సార్ పోషిగాని ఇల్లు" సుంకరి అనగానే కానిస్టేబుల్లు సైకిల్లు ఆపి స్టాండు వేసి "పిలువు" అన్నారు.

"పోషిగా... ఓరి పోషిగా... పిలిచాడు సుంకరి.

ఆ పిలుపుతో ఇంటిని ఆనుకుని ఉన్న పశువుల దొడ్డిలో మక్కబూరు మీద పడుకున్న రాజయ్య మెల్లగా లేచి, "ఎవలయ్యా...?" అంటూ వచ్చాడు.

"నీ తమ్ముడు పోషిగాన్ని పట్టుకపోవుటానికి పోలీసోల్లు వచ్చింద్రు. ఏడి వాడు" అన్నాడు సుంకరి.

"మా పోషిగాన్న...? ఎందుకు...? వాడేం జేసిండు...?" తటపటాయిస్తూ అడిగాడు రాజయ్య.

"నిన్ను కొట్టిండటగదరా... నీ పెళ్ళం కేసు పెట్టింది." అన్నాడు శేఖర్.

"ఆడు నన్నెందుకు కొట్టిండయ్యా...? అది ఉట్టి పిసది సారూ... ఆడు నన్నేమన్లేదు..." భయంతో వణుకుతూ అన్నాడు రాజయ్య.

"ఏమయ్యా... నిన్ను కొట్టంది నీ తలకు ఆ దెబ్బెట్ల తగిలింది?" రాజయ్య తలకు ఉన్న గాయం వైపు చూపిస్తూ అన్నాడు ప్రకాశ్.

తన తలకు గాయమైందన్న సంగతి కూడా మర్చిపోయిన రాజయ్య ప్రకాశ్ అనడంతో ఉలిక్కి పడి కుడిచేతితో గాయాన్ని తడుముకొని, "ఇదా...? ఇది సారూ... ఏదో రాత్రి చిన్న గిలగిల అయ్యింది. నన్ను నూకేసినందుకు నేనే గోడకు ఇర్సుకు పడ్డ. ఆడు మంచోడే సారూ... ఏదో రాత్తిరి కల్లుబొట్టు తాగినట్టున్నడు తప్పయింది సారూ ఆన్ని పట్టుకపోకుండ్రి" అంటూ ప్రాధేయ పడుతూ ప్రకాశ్, శేఖర్‌ల కాళ్ళు పట్టుకోబోయాడు రాజయ్య.

ఊహించని ఆ సంఘటనకు ఆశ్చర్యపోయాడు ప్రకాశ్. అది అన్నదమ్ముల అనుబంధమో, అతను తమ్ముని మీద పెంచుకున్న అనురాగమో కానీ, తనను గాయపర్చిన తమ్ముడిని కాపాడుకోవడం కోసం రాజయ్య పడుతున్న తాపత్రయం, బాధ ప్రకాశ్‌ని కదిలించింది.

"సూడు రాజయ్య తాగి కొట్టిన, తాగక కొట్టిన తప్పు తప్పేకదా? ఏమన్నా చెప్పుకునేదుంటే వచ్చి అమీనుసాబుకు చెప్పుకోండ్రి. వాడైతే ఏడున్నాడో చెప్పు అన్నాడు" ప్రకాశ్.

"వాన్నేంది ప్రకాశ్ బుదిరికిచ్చేది ఇంట్లో దాక్కున్నాడేమో చూద్దాం పదా" చిరాకుగా అని కదిలాడు శేఖర్.

"సారూ... మీకు దండం పెడతా వాన్నేమనకుండ్రి... నన్ను దీసుకపోండ్రి నేనత్తా సారూ స్టేషనుకు" ఏడుస్తూ మరోసారి కాళ్ళమీద పడ్డాడు రాజయ్య.

"చూడు రాజయ్య... సరే నీ తమ్మున్ని పట్టుకుపోము. కాని ఒకసారి వాన్ని చూపించు" అన్నాడు ప్రకాశ్.

"అయ్యా... వాడెందుకయ్యా వాడుట్టి అమాయకుడు. మిమ్ములను జూత్తెనే వాడు గజగజ వణుకుతడు."

"రాజయ్య! పట్టుకు రమ్మన్నది అమీనుసాబు... నీవేమో ఇడ్సిపెట్టుమంటున్నవు. సరే... ఇడ్సిపెడ్తం... కానీ, కనీసం వాన్ని గద్దరాయించక పోతే ఎట్లా? వాన్ని చూపించు గద్రాయించి బుద్ధి చెప్పి, ఇంకోసారి లొల్లిబెట్టుకోవద్దు అని భయం జెప్పుతాం నా మాటనమ్ము. లేదంటే వాన్ని పట్టుకపోతం. నవ్వు జెప్పనంత మాత్రాన రేపు దొరకడ?" అన్నాడు ప్రకాశ్.

రాజయ్య ప్రకాశ్, శేఖర్ ముఖాల్లోకి పరీక్షగా చూసాడు. ప్రకాశ్ మంచివాడుగా అనిపించింది.

"చూపించు రాజయ్యా... తమ్ముని క్షేమం కోరే అన్నగా ఇంత ప్రాధేయ పడుతున్నావు? మరి, ఆ తమ్ముడు ఎంతటి ప్రబుద్దుడో చూద్దామని... అంతే నామాట నమ్ము" భరోసా ఇచ్చాడు ప్రకాశ్.

బరోస కల్గినంక మెల్లగా ఓరగా తెరచియున్న తలుపులు తోసుకొని ఇంట్లోకి నడిచాడు రాజయ్య, వెనక కానిస్టేబుల్లు సుంకరి.

ఇల్లంత పరీక్షించి చూశారు. పోషిగాడు ఎక్కడా కనిపించలేదు. రాజయ్య ఆరేండ్ల కొడుకు చెప్పులమీద తట్టు కప్పుతున్నాడు పిల్లిలాగ.

"పోషీ... పోషీ... ఎక్కడున్నావురా? సార్లు మంచోల్లురా, బయటకచ్చి సార్ల కాళ్ళమీద బడు, పైనున్న అటకవైపు చూస్తూ పిలిచాడు రాజయ్య.

మూడోసారి పిలుపుతో అటుకు మీద దాక్కున్న పోషిగాడు మెల్లగా దిగాడు. దిగుతుండగానే...

"దిగు... దిగి సారు తప్పయిందని సార్ల కాళ్ళమీద వడు..." అని తమ్ముని చేతి పట్టాడు రాజయ్య.

పోషిగాడు భయంతో వణుకుతూ "తప్పయింది సారూ..." అంటూ కాళ్ళు పట్టుకోబోయాడు. కాళ్ళమీద పడబోతున్న పోషిగానికి ప్రకాశ్ దూరం జరిగి, "ఏయ్... లే...లేవ్.. నువు నా కాళ్ళు మొక్కుడు కాదు తప్పైందని మీ అన్న కాళ్ళ మీద పడు." పోషిగాని మొఖంలోకి ఒక క్షణం పరిశీలనగా చూసి, "చూసినవా... నువ్వు నీ అన్నను కొట్టినా గాని, నిన్ను మాకు పట్టించుటానికి నీ అన్న ఒప్పుకోలేదు అది నీ అన్న నీ మీద పెంచుకున్న ప్రేమరా... కానీ, ఆ ప్రేమను పంచుకున్న నీవు ప్రేమను తుంచినవు. ప్రతిఫలంగా గాయపర్చినావు. నీ అన్నావదిన చిన్ననాటి నుండి నిన్ను కొడుకులాగ పెంచితే, ఇదేనా వారిపై చూపించే కృతజ్ఞత. ఇంకోసారి పనిచేయక గొడవ జేత్తివంటే జేలుకు పంపుతాం. నీ వదినె అక్కడ వూళ్లే ఉండవచ్చు బ్రతిమిలాడి తీసుకురా... మంచిగుండు..." అని మరోసారి గద్దరించి ప్రకాశ్ బయటకు వస్తుండగా, గోడ మూలకు భయంతో జింకలాగ ఒదిగివున్న రాజయ్య కొడుకును చూసి, చిన్నయ్యను రక్షించు కొనుటకు, చిన్నయ్య చెప్పులపై తట్టు కప్పిన సంఘటన గుర్తుకు వచ్చి, ప్రకాశ్ నవ్వుకుని ఆ బుజ్జిగాడి బుగ్గ గిల్లి రూపాయి ఇచ్చి, "ఏమన్న కొనుక్కోరా చంటోడా" అని దర్వాజ దాటుతున్న ప్రకాశ్‌కు రాజయ్య గాయం గుర్తుకు వచ్చి, జేబులోంచి ఏభై రూపాయలు తీసి, "రాజయ్యా... దవాఖానకు పోయి సూది వేయించుకో, లేకపోతే నొప్పి పెడ్తది." అని ఇవ్వబోయాడు.

"సారూ... వద్దు సారూ... నాకు నొప్పి లేదు. పొద్దుగాల నల్లాలం కట్టిన"

"తీసుకోకపోతే... పోషిగాన్ని పట్టుకు పోతం" నవ్వుతూ అన్నాడు ప్రకాశ్.

చేసేదేమిలేక తీసుకున్నాడు రాజయ్య. వెంటనే శేఖర్ మొఖం బీరిపోయింది. సైకిల్ స్టాండు తీసి ఎక్కారు ప్రకాశ్, శేఖర్. దారిలో మనసులో దాచుకున్న బాధనంతా వెళ్లగక్కాడు శేఖర్. "అమీన్‌సాబు పట్టుకు రమ్మంటే విడిచి పెట్టి వస్తావా? ఇపుడు పోయినంక అమీనుసాబుతోని ఏమని జెప్తవు. ఇడిసిపెడితే ఇడిసిపెడితివి. కాని వాని దగ్గర ఏమీ తీసుకోకపోతివి. ఫిర్యాదిచ్చిన ఏభై రూపాయలు కూడా వానికే ఇత్తవా? నేనకున్న... ఇది యాభై పట్టుకు వత్తే వాడో నూరు తర్వాత ఫిర్యాది మల్లమ్మ ఇంకో యాభై ఇత్తది మొత్తం రెండొందలయితే చేరో నూరు తీసుకోవచ్చనుకున్నా. ఇక నీయటువంటోడు బాగానే డూటి జేత్తడు. ఇటువంటోడు పోలీసులకు రావద్దు. దేశసేవ జేయాలి. అసలు తెలిసి తెలిసి నీతో వచ్చుడు నాది బుద్ధి తక్కువ పని. అమీన్‌సాబ్‌తోని చెప్పినంక నీ సంగతి."

బొంగుటీగలా దారిపొడువునా వదురుతూనే ఉన్నాడు. ఆయన వాక్ప్రవాహానికి ప్రకాశ్ అడ్డు చెప్పలేదు. పోలీస్ స్టేషన్ రాగానే ప్రకాశ్ కంటే రెండడుగులు ముందుగానే శేఖర్ పోయి జరిగిన కథంతా పొల్లువోకుండా చెప్పాడు శేఖర్. పైసల విషయం తప్ప. అమీన్‌సాబ్ ప్రకాశ్ వైపు చూసి నవ్వి, సరే రెస్టు తీసుకుపోండ్రి అన్నాడు.

ఎస్సయ్ ప్రకాశ్‌ను మందలిస్తాడనుకుంటే ఏమనకుండా పైగా నవ్వి, ఊరుకున్నందుకు శేఖర్ అవమానంగా భావించి, ఉక్రోషంతో మొఖం మార్చుకున్నాడు. ప్రకాశ్ వెనకాలే స్టేషన్ వరండా దాటినంక మొదలు పెట్టాడు. "ఛీ, ఛీ, పోలీసు డిపార్ట్‌మెంట్‌లో అంతా వేస్టుగాళ్లు భర్తీ అవుతుండ్రు. ఇటువంటి వాళ్ళు జేయవట్టే పోలీసు డిపార్ట్‌మెంట్ పుచ్చుపట్టి పోతుంది. ప్రజల్లో పోలీసులంటే భయం భక్తి లేకుండా పోతుంది." అల్లు పిట్టలా అదురుతున్న శేఖర్‌ను చూసి, ఉబికివస్తున్న నవ్వును ఆపుకోలేక పైకే నవ్వేశాడు ప్రకాశ్.

*** *** ***

ప్రకాశ్ డ్యూటీకి వెళ్ళుటకు డ్రెస్ వేసుకుంటుండగా రాజయ్య వచ్చాడు. చేతి సంచిలో కోడిపెట్ట వుంది. "ఏం రాజయ్య ఏం పనిమీద వచ్చినవు? పోషిగాడు మంచిగ పని జేత్తుండా?" చిరునవ్వుతో పలకరించాడు ప్రకాశ్. "ఆ... మంచిగనే పని జేత్తుండు సార్.... కో...సు...కు...ం...టా...ర...ని... కోడిపిల్లని తీసుకువచ్చిన సారు" సగం మింగేస్తూ అన్నాడు రాజయ్య.

"భలే వాడివి రాజయ్యా కోడిపిల్ల ఎందుకు?"

"గట్టనద్దు సార్... ఏదో పేదోడి ప్రేమ కాదనకుండ్రి" కొంచెం గారాబంగా అన్నాడు రాజయ్య.

ప్రకాశ్ నవ్వి, "పేదోడు ప్రేమ జూపించినా... కోపం కురిపించినా... మోతాదులో వుండదు సుమా! సరే ఉండని కానీ.. దాన్ని కోసుకున్న రోజు నువ్వు తప్పకుండా మా యింటికి భోజనానికి రావాలి అట్లయితే ఉంచు." అంతే గారాబంతో అన్నాడు ప్రకాశ్.

"సరే... తప్పకుండా వస్తా ఇక పోయత్తా సారు" కోడిని గుల్లకిందవేసి వెళ్ళిపోయాడు రాజయ్య. ఆ విధంగా కృతజ్ఞతకు మారుపేరైన రాజయ్య, ప్రకాశ్ పరిచయం స్నేహంగా మారింది. ప్రకాశ్, రాజయ్యలు కలిసినపుడు గంటల తరబడి మాట్లాడుకునేవారు. ప్రకాశ్‌కి పోషిగాడు ఎదురయితే మాత్రం కిందికి మొఖం వేసేవాడు. కోడిపెట్టను కోసుటకు మాత్రం ప్రకాశ్ కు మనసు అంగీకరించలేదు. పేదోడి ప్రేమను పెంచుకోవాలి కాని, చంపుకోకూడదు అని బలంగా నిశ్చయించుకున్నాడు. పండగలపుడు రాజయ్యను ప్రకాశ్ పిలుచుకువెళ్ళి భోజనం చేసేవాడు. కానీ కోడిపెట్టను మాత్రం కోయలేదు.

*** *** ***

సెలవు మీద స్వంత గ్రామానికి వెళ్ళొచ్చి డ్యూటీలో జాయినవుటకు పోలీస్ స్టేషన్‌కు వెళుతున్న ప్రకాశ్‌కు పిడుగులాంటి వార్త వినబడింది.

రాజయ్య చనిపోయాడట....

ప్రకాశ్ పక్షవాతం వచ్చినవాడిలా కాళ్ళు చేతులు మొద్దుబారి పోయి కింద పడిపోయాడు. ఏడ్వడానికి కూడా నోరు పెగలడం లేదు. కొంచెం సేపటికి శరీరాన్నంతా బిగబట్టుకుని నడక నేర్చుకుంటున్న పిల్లాడిలా తప్పటడుగులు వేసుకుంటూ రాజయ్య ఇంటివైపు నడిచాడు. రాజయ్య ఏదో పని మీద ప్రక్క గ్రామంలో ఉన్న చిన్నవ్వ దగ్గరికి పోయాడు. రాత్రిపూట అన్నలు బూటకపు ఎన్నికలను బహిష్కరించాలని గ్రామస్థులందరిని సమావేశ పరిచి, గ్రామ కూడలివద్ద మీటింగ్ పెట్టారు. అందులో అందిరితోపాటు రాజయ్య కూడా ఉన్నాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి రాగా పోలీసులకు, నక్సలైట్లకు చాలా సేపు కాల్పులు జరిగాయి. ఆ కాల్పుల్లో గడ్డివాములో ప్రాణభయంతో బితుకు బితుకు మంటూ దాక్కున్న రాజయ్యను

గురితప్పిన పోలీసు గుండ్లు బలితీసుకున్నాయి.

రాజయ్య ఇంటి ముందర వందలాది మంది గుమిగూడారు. అన్నెం పున్నెం ఎరుగని అమాయకుడైన రాజయ్య అకారణంగా మరణించినందుకు ఎందరో శోక సముద్రంలో మునిగిపోయారు. అడుగులో అడుగు వేస్తూ వచ్చిన ప్రకాశ్ ఆ దృశ్యం చూసి, నోరుతెరిచాడు. కాని మాట రావడం లేదు. శవం మీద బట్ట కప్పబడి ఉంది. రాజయ్య తమ్ముడు, భార్య కొడుకు మీద బడి ఏడుస్తున్నారు. బంధువులు ఏడుస్తూనే వారిని ఓదారుస్తున్నారు. ప్రకాశ్‌ను చూసి, అక్కడి వారు గుసగుసలు పెట్టుకోసాగారు. అందులో ఎన్నికల్లో నిలుచున్న అభ్యర్థి "ఏం... ఇంకెందుకచ్చినవు... ఇంకేం మిగిలిందని అచ్చినవు... అన్యాయంగా ఓ అమాయకున్ని పొట్టన బెట్టుకున్నారు గదా మీ పోలీసోల్లు" అని ప్రకాశ్‌ను నానా విధంగా దుర్భషలాడ సాగాడు.

ప్రకాశ్ అవేమి పట్టించుకోకుండా రాజయ్య మొఖమును చివరిసారిగా చూడాలని తహతహతో ముందుకు నడవసాగాడు. ప్రకాశ్‌ను చూసిన పోషిగాడు. "మా అన్న సచ్చిపోయిండు సారూ...! మమ్మల్ని దిక్కులేని వాళ్ళను జేసిపోయిండు సారూ...! మీరున్నా గాని ఆ వూరికి పోకపోవునో ఏమో" అని విలపించుకుంటూ ప్రకాశ్‌ను కౌగిలించుకుని బోరున ఏడ్వ సాగాడు బిగ్గరగా, అప్పటి వరకు రాని దుఃఖం ప్రకాశ్‌కు ఎగదన్నుకు వచ్చింది. వెక్కి వెక్కి ఏడ్వ సాగాడు. వారి ఏడ్పులతో అక్కడ వున్న ప్రతి ఒక్కరూ చలించిపోయి, వారితో శ్రుతి కలిపారు. ఆ అర్తనాదాలతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగింది. దుర్భషలాడిన అభ్యర్థి మాత్రం ముందువరుసలో ఉన్నోడు మంది చాటుకు వెళ్ళాడు.

*** *** ***

రోజులు గడుస్తున్న కొద్ది రాజయ్య కుటుంబములో అలుముకున్న నిరాశ, నిస్పృహలు విడిచి వెళ్ళడం లేదు. రాజయ్య తమ్ముడు, భార్య, కొడుకు రాజయ్య జ్ఞాపకాలతో పేషెంట్లుగా తయారయ్యారు. ప్రకాశ్ వీలు చిక్కినప్పుడల్లా రాజయ్య ఇంటికి వచ్చి పోషయ్యను, రాజయ్య భార్యను, కొడుకును ఓదార్చడం వలన రాజయ్య ఆలోచనల నుండి కొద్ది కొద్దిగా బయటపడి తేరుకున్నారు. కొద్ది రోజులకు ప్రకాశ్ ఓదార్పుతో చాలా వరకు కోలుకున్నారు. నెల రోజుల తర్వాత మంచం పట్టిన పోషయ్య లేచి, పక్కింటి బాల్‌తాత దగ్గరకు పోయి మాట్లాడ సాగాడు. బడికి పోయాడనుకున్న రాజయ్య కొడుకు బుజ్జిగాడు "చిన్నయ్యా...! చిన్నయ్యా...! అంటూ పరిగెత్తుకు వచ్చి "చిన్నయ్య మన సారూ... మన సారూ..." పరుగెత్తుకొచ్చిన దమ్ముతో అసపోత్తూ

నీళ్ళు మింగుతూ చెప్పాడు.

"ఆ... ఏమయిందిరా మన సారూ..." గాబరపడుతూ అడిగాడు పోషయ్య.

"మన సారూ... మన సారూ... సచ్చిపోయిండట" ముక్కు ఎగ బీలుస్తూ చెప్పాడు.

"ఆ... మన సారూ... సచ్చిపోయిండా... ఎట్లరా... అయ్యో... సారూ..." ఏడ్చుకుంటూ ప్రకాశ్ ఇంటికి పరిగెత్తాడు పోచయ్య... వెనకాల బుజ్జిగాడు.

ముక్కలు ముక్కలయిన ప్రకాశ్ శవాన్ని చాపలో తాళ్లతో కట్టి పడుకోబెట్టారు. పరిగెత్తుకొచ్చిన పోచయ్య, "సారూ..." అంటూ ప్రకాశ్ మీద బడి బోరున విలపించసాగాడు. అప్పటికే ఏడ్చి, ఏడ్చి ప్రకాశ్ భార్య స్పృహ తప్పింది. అక్కడకు వచ్చిన ఎన్నికల్లో నిల్చున్న అభ్యర్థి లేని బాధను తెచ్చుకుంటూ ఎస్.ఐ. దగ్గరికి పోయి, "ఎట్లా జరిగింది సార్ ఈ ఘోరం" అన్నాడు.

"మారుమూల గ్రామలకు వెళ్లి గ్రామస్తులను సమావేశ పరుస్తూ, ఎన్నికల్లో ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని చెప్పి, కాలినడకనే తిరిగి వస్తుండగా, తీవ్రవాదులు పేల్చిన మందుపాతరకు ప్రకాశ్ బలయ్యాడు." గుడ్ల నిండా నిండిన కన్నీళ్ళతో అన్నాడు ఎస్.ఐ.

"సార్... ఈ పరిస్థితిలో కొంప ముంచి ఎన్నికలు వాయిదా వేయరు గదా?" అనుమానంగా అడిగాడు అభ్యర్థి.

అనుకోకుండా వచ్చిన ఆ ప్రశ్నకు ఎస్.ఐ. అభ్యర్థిని తేరిపార గొంగళి పురుగును చూసినట్లు చూసి "పోలీసులు, ప్రజలు ఎంతమంది చనిపోయినా ఎన్నికలు వాయిదా వేయ్యరులేండి. మీ అభ్యర్థులు చనిపోతే తప్ప" సూటిగా అనేసి "శేఖర్... శవాన్ని జీపులో పెట్టే ఏర్పాట్లు చూడు" అన్నాడు.

ఆ మాటతో ఏడుస్తున్న పోచయ్య ఉలిక్కిపడ్డట్టు లేచి " శవాన్ని ఎక్కడికి తీసుకుపోవడానికి వీళ్ళేదు సార్. ఇక్కడే దహనం చేసుకుంటాం..." అతని మాటను అక్కడున్న ఆడవాళ్లంతా బలపరుస్తూ, "అవున్సార్ మంచి మనసున్న ప్రకాశ్ సార్‌ను ఇక్కడే దహనం చేసి, మా గుండెల్లో దాచుకుంటాం. ఈ శవాన్ని తీసుకుపోవడానికి మేం ఒప్పుకోం." అన్నారు. అందులో రాజయ్య భార్య మల్లమ్మ గూడా "అవున్సార్, మేం ఒప్పుకోం..." వేడుకోలుగా అంది, దుఃఖంతో కంఠం బొంగురుపోగా.

వారు ప్రకాశ్ మీద పెంచుకున్న ప్రేమకు చూపిస్తున్న అభిమానానికి శేఖర్

చలించిపోయాడు. ప్రకాశ్ డిపార్ట్‌మెంట్‌లోనే గొప్పవ్యక్తి. ఇంతమంది మనసుల్లో స్థానం పొందిన ప్రకాశ్ మరణించలేదు. ప్రకాశ్‌కు మరణం లేదు కూడా. వీరందరి గుండెల్లో ప్రకాశ్ అజరామరంగా జీవించే ఉంటాడు. ప్రకాశ్ వెళ్లింది పై లోకాలకు కాదు. ప్రజల హృదయాల్లోకి. సగటు మనుషుల హృదయాల్లో శాశ్వత స్థానాన్ని పొందిన ఇతన్ని స్మశానానికి తరలించడం ఎవరి తరం? ఈ తరం ఉన్నంత వరకూ ఇతను జీవించే ఉంటాడు. మరణం ప్రాణానికే కాని, పాశానికి కాదు. చెడ్డవాడుగా జీవించడం కన్నా మంచివాడుగా మరణించడం మిన్న. ఇక నుండి నేను ప్రకాశ్ బాటలోనే నడుస్తాను. ప్రకాశ్ నాలోనే ప్రకాశిస్తాడు. మరణించడం సహజం. కానీ మరణించిన ప్రతివారూ ప్రజల హృదయాల్లో స్థిరస్థాయిగా నిలువలేరు. ఒక మరణం మరొకరిలో చలనం రేపి, మరో చరణం మొదలయ్యింది. శేఖర్ హృదయం బరువెక్కింది.

వారి అభ్యర్థనకు ఎస్.ఐ. "చూడండమ్మా... మీకెలా జెప్పాలో నాకర్థం కావడం లేదు. ప్రకాశ్ తల్లిదండ్రులు, బంధువులు వస్తే నిర్ణయం వాళ్ళకే వదిలేసే వాళ్ళం... కానీ... కానీ... విధి మరోసారి వక్రీకరించింది. ప్రకాశ్ మరణించాడని వార్త విన్న ప్రకాశ్ తల్లి గు...ం...డె... ఆ...గి... చ...ని...పో...యి...ం...ది.. అందుకే ప్రకాశ్ బంధువులు ఇక్కడకు రాలేక పోయారు. ప్రకాశ్ భార్యనేమో స్పృహ తప్పి వున్నది" ఎస్.ఐ. గాద్గద స్వరంతో.... "పోచయ్య, పరిస్థితిని అర్థం చేసుకో... మీరు కావాలనుకుంటే మీకు వెహికిల్ అరేంజ్ చేస్తాను. మాతో పాటు మీరు కూడా రావచ్చు..." అన్నాడు.

ప్రకాశ్ కన్నతల్లి చనిపోయిందని తెల్సిన ప్రజలు ఏడ్వడానికి కూడా కన్నీటి చుక్కరాక బీరిపోయి మొద్దుబారి పోయారు. అంతలో బీరచెట్టు క్రింద నున్న కోడి పెట్టను తరుముతున్న జంగవిల్లి రాజయ్య కొడుకు బుజ్జిగాడి కంటపడింది. తరుముతున్న జంగవిల్లి బారినుండి పేదోడి ప్రేమను రక్షించుకోవాలని పరుగెత్తసాగాడు బుజ్జిగాడు. అక్కడ ఉన్నవారికి మాత్రం వాడు పరిగెత్తుతున్నదెందుకో అర్థం కాలేదు... అయినా వాడు పరుగెత్తుతూనే ఉన్నాడు పేదోడి ప్రేమను రక్షించుకోవడానికి...

కర్తవ్యం కన్నులు మూసుకుని పేల్చిన తుపాకి గుండ్లు గురితప్పి ఓ అమాయకున్ని.... సిద్ధాంతం శృతిమించి గాడి తప్పి బ్లాస్టింగ్‌కై బద్దలై పేలి మరో కర్తవ్య దీక్షాపరున్ని బలితీసుకోగా, అమాయకుల మరణంతో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల గోలలో గెలిచిన అభ్యర్థి రంగు రంగుల త్రివర్ణ జెండా ఎగురువేయగా... ఇద్దరు ఆడవాళ్ళు మాత్రం శాంతికి చిహ్నంగా తెల్ల వస్త్రాలు ధరించి నిరసన తెలిపారు. కారణం లేని మరణాలు ఆగాలని...

❀ ❀ ❀

అభిప్రాయాలు

నల్లాల లక్ష్మీరాజం గారిని మొట్టమొదట చూసినప్పుడు ఉపాధ్యాయుడు కావచ్చు అనుకున్నాను. కాని కానిస్టేబుల్‌గా పరిచయం అయ్యాడు. గానకోకిల కళానికేతన్ జగిత్యాల వారు ప్రచురించిన జగిత్యాల ప్రాంత కవుల అంతర్మథనం గేయ సంపుటి తేది : 25-3-2001 రోజున రాయికల్‌లో జరిగే ఆవిష్కరణోత్సవానికి యల్.రమణ మాజీ యం.పి., జువ్వాడి రత్నాకర్‌రావు యం.ఎల్.ఎ., పలువురు ప్రముఖులతో పాటు నన్ను ఆహ్వానించగా వెళ్లినాను. ఆ పుస్తకం సమీక్షత బాధ్యత నాపై పెట్టినారు. అందులో అప్పటి రాయికల్ యస్.ఐ. వెంకటేశ్వర్లు గారితో పాటు లక్ష్మీరాజం గారు రాసిన కవితల్ని చూసి ఆశ్చర్యపోయాను. పోలీసుల్లో కవులు కూడా ఉన్నారా ! అని ముచ్చటేసింది. ఆరోజు యస్.ఐ. వెంకటేశ్వర్లు గారికి, లక్ష్మీరాజం గారికి, మిగత కవులందరికి ఘనంగా పౌర సన్మానం జరిగింది. తరువాత నేను లక్ష్మీరాజం కలుసుకున్నప్పుడు ఎన్నో సాహిత్య విషయాలు మాట్లాడుకొనేవాళ్ళం. కాని లక్ష్మీరాజం చక్కని కవితలే కాదు, కథలు కూడా రాస్తారని, నాతో ఎప్పుడు అనలేదు. తెలిసిన తర్వాత చాలా సంబరపడ్డాను. ఈ కథలనిండా మన తెలంగాణా వాడుక భాష మన సంస్కృతి, సాంప్రదాయాల్ని చిత్రించాడు. ఏదైనా కథా వస్తువు నా మనసులో రూపు దిద్దుకుంటే, బాగుంది అనుకోని రాసి ఉంచుకొనేవాన్ని, కాని కథ రాయాలంటే నాకు భయం వేసేది. “పెరుమాళ్ళు నీవు కథలు రాయాలయ్యా! అని గీట్ల జనార్ధన్‌రెడ్డి మాజీ యం.ఎల్.సి. గారు పదే పదే అంటే మరింత భయం వేసేది. ధైర్యం చాలక రాసినది చించిపరేసేవాన్ని” ఈ సోదంత ఎందుకంటే నేను కథా రచయితను కాను. మంచి పాఠకున్ని అన్నదే నా విశ్వాసం. బి.యస్. రాములు గారి మాటల్లో చెప్పాలంటే, ఏ రచయితకైన కవిత్వం రాయడం సాహిత్యంలో ఒక ప్రారంభదశ. తెలుగులో చాలామంది కవులు కవిత దగ్గరే ఆగిపోతున్నారు. అనగా ప్రాథమిక విద్యాభ్యాసం దగ్గరే ఆగిపోతున్నారు. కథా, నవలా తదితర ప్రక్రియల్లోకి ఎదిగినప్పుడే కళాశాలకు వెళ్ళినట్టు.

మన లక్ష్మీరాజం ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేసుకోని కళాశాలలో అడుగుపెట్టినారు. కళాశాల విద్యాభ్యాసం పూర్తి చేసుకోని యూనివర్సిటీ విద్యాభ్యాసం పూర్తి చేయాలని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

మీ
వేముల పెరుమాళ్ళు
“తెలంగాణా జాతీయాలు” గ్రంథకర్త
మాజీ మండలాధ్యక్షులు, రాయికల్.

మాకు నచ్చిన కథ మావూరి ముచ్చట్లు

పల్లెల్లో, గూడాల్లో నివసించే వారు మాట్లాడే భాషను అచ్చంగా తన "మావూరి ముచ్చట్లు" కథలో పేర్కొన్నారు రచయిత లక్ష్మిరాజం గారు. కథలో బాల్ తాత "అన్ని పిల్తే నేను నూతిలో దూకి సత్తా" అంటాడు ఒకచోట. "ఆ ఇంటికి అగ్గినీళ్లు బందుపెడ్దాం" అని మరోచోట, సోపతి అంటే మద్దతు "శాంతమ్మకు సోపతి మరో నలుగురు ఆడవాళ్లు తయారైంద్రు" అని లక్ష్మిరాజం గారు ఈ కథలో అంటాడు. ముఖ్యంగా తెలంగాణా పల్లెల్లో ప్రతినిత్యం మనల్ని పలకరించే వాడుక భాషను తన కథలో అచ్చుగుద్దినట్లు రచయిత ప్రస్తావించారు. వాటిలో కొన్ని... "ముచ్చట్లు పెట్టుకోవడానికి, ఒట్టి ఔలగానిలా వున్నావు. కరెంటు బందు పెట్టి, ఒట్టి కండ్లమంట మనిషి, మతులబు, పల్లికాయలు, ఇజ్జతి పోలేదా, గింత పాపమా, దునియా కరాబైంది."

లక్ష్మిరాజం గారు తన కథలో, వదంతులంటే మనషులు ఎంత ఇష్టపడతారో చాలా చక్కగా చెప్పారు. ఈ వాక్యంలో చూడండి. "ఊరంత పొగసూరినట్లు, ముచ్చట్లే ముచ్చట్లు, ముచ్చట్ల పండుగోలే" కులంలో అనైతికతను జుగుప్సాకరమైన ఉన్మాధాన్ని, అగ్రకుల నీచత్వాన్ని, కథ చివరలో "అక్రమ సంబంధానికి అడ్డు రాని కులం పెండ్లి చేసుకోవటానికి అడ్డు వత్తుందా?" అంటూ తీవ్రంగా దుయ్యబట్టారు. కథా విస్తీర్ణం ఎక్కువనిపించినప్పటికి, వస్తురీత్యా తప్పదు. పల్లెల్లోని కుల ఆధిపత్య ధోరణిని తూర్పారబట్టిన ఈ కథను రాసిన లక్ష్మిరాజం గారికి ప్రచురించిన నేటినిజం పత్రికకు మా అభినందనలు.

సుందరయ్య గ్రంథాలయ
A C No. ....
హైదరాబాద్ - 500 044.

డి. సుబ్బారావు
ఎ.సి.సి. కాలనీ, మంచిర్యాల,
జిల్లా : ఆదిలాబాద్.

(నేటి నిజం దినపత్రికలో శుక్రవారం 7-6-2002 రోజు మావూరి ముచ్చట్లు కథకు ప్రచురించిన ఉత్తరాలలో ఓ ఉత్తరం.)

ప్రముఖ స్త్రీవాద రచయిత ఓల్గా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న
యువ రచయిత నల్లాల లక్ష్మీరాజం చిత్రంలో సామాజిక తత్త్వవేత్త
బి.ఎస్. రాములు, రచయితలు కె.వి. నరేందర్, అన్నవరం దేవేందర్
(తేది : 28-8-2000)

సబ్-కలెక్టర్ సందీప్ కుమార్ సుల్తానియా చే సన్మానించబడుతున్న
యువ కథా రచయిత నల్లాల లక్ష్మీరాజం చిత్రంలో హైకోర్టు న్యాయమూర్తి బి.యస్.
ప్రకాష్‌రావు మరియు జగిత్యాల ఎస్పి వై. నాగిరెడ్డి (తేది : 5-9-2000)

హైకోర్టు న్యాయమూర్తి బి.యస్. ప్రకాష్‌రావు కరకములచే ఉత్తమ కథా పురస్కారాన్ని
అందుకుంటున్న యువ కథా రచయిత నల్లాల లక్ష్మీరాజం చిత్రంలో
జగిత్యాల ఎఎస్పి వై. నాగిరెడ్డి మరియు సబ్ కలెక్టర్ సందీప్ కుమార్ సుల్తానియా
తేది : 5-9-2000

తేది : 25-3-2001 రోజున జగిత్యాల ప్రాంత యువ కవులు
రచించిన గేయ సంపుటి అంతర్మథనం పుస్తక ఆవిష్కరణ మహోత్సవములో యువ
కవి నల్లాల లక్ష్మీరాజంను సన్మానిస్తున్న రాయికల్ మాజీ మండలాధ్యక్షులు వేముల
పెరుమాళ్ళు చిత్రంలో సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎ. వెంకటేశ్వర్లు తదితరులు.

ప్రముఖ రచయిత దాశరథి రంగాచార్య చే సన్మానించ బడుతున్న యువ కథా రచయిత నల్లాల లక్ష్మిరాజం చిత్రంలో టి.వి. రచయిత చంద్రశేఖర్ ఆజాద్ మరియు అన్నవరం దేవేందర్. (తేది : 28-8-2001)

తేది : 26-11-2002 రోజున భారతీయ దళిత సాహిత్య అకాడమి వారు నిర్వహించిన నేషనల్ దళిత్ రైటర్స్ కాన్ఫరెన్స్ న్యూఢిల్లీ తల్‌కటోర స్టేడియంలో జాతీయ అధ్యక్షుడు డా॥ సుమానాక్షర్ చేతుల మీదుగా డా॥ అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డు - 2002 ను అందుకుంటున్న యువ కథా రచయిత నల్లాల లక్ష్మిరాజం

With Best Compliments from

మగ్గిడి వెంకటనర్సయ్య
Advocate
రాష్ట్ర కార్యదర్శి A.P.A.Y.S
ఇనెం 1-10-246,
కళానగర్, మెట్‌పల్లి
ఫోన్ 225307

జి. జవహర్‌లాల్ నాయక్
Add . Asst. Eng neer
ఇనెం. 4-1-31/1,
వాణినగర్ జగిత్యాల
ఫోన్ 225298

కె. ఆనంద్
Add Asst Eng neer
N P D C.L. Sarangapur
ఇనెం. UL-95 C కాలనీ
రామగుండం
ఫోన్ 255629

బొల్లం విజయ్
(కో-సబ్ రిజిష్ట్రార్, సిరిసిల్ల)
యస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు
ఇనెం. 1-5-163/18,
భాగ్యనగర్, జగిత్యాల.
ఫోన్ : 222494

పారిపెల్లి రాజమల్లయ్య
జిల్లా ఆర్గనైజింగ్
సెక్రెటరి A P A Y.S.
ధర్మపురి.

నకుమల్ల లక్ష్మీనారాయణ
Advocate
మండలి కన్వీనర్ A.P.A.Y S
బాలాజీ నగర్, జగిత్యాల
ఫోన్ : 225897

మద్దెల నారాయణ
M Sc B Ed
Head Master
యస్సీ వెల్ఫేర్ అసోసియేషన్
మండలి కన్వీనర్ జగిత్యాల
ఫోన్ 231133

జి. చిట్టిబాబు
టీచర్
అంబేడ్కర్ నగర్,
జగిత్యాల

కాయితి శ్రీనివాస్
ఫార్మాసిస్ట్
ఇనెం 1-6-24 అంబేడ్కర్
నగర్ జగిత్యాల ఫోన్
225331

With Best Compliments from .



ఎండబెట్ల గాబ్రెల్
మండల మాజీ ఉపాధ్యక్షులు
సారంగాపూర్
గ్రా॥ అర్పపెల్లి,
ఫోన్ · 278868

కనుక ప్రభాకర్
M.P.T.C తుంగూర్
గ్రా॥ కొల్వాయి,
మం సారంగాపూర్

మొలిగె శ్రీనివాస్
సర్పంచ్
గ్రా॥ తక్కళ్లపెల్లి, మం
కథలాపూర్,
ఫోన్ : 270727

మల్యాల పోచయ్య
సర్పంచ్
గ్రా॥ ముత్యంపేట,
మం॥ మల్యాల
ఫోన్ 271378

జనుప హన్మాండ్లు
సర్పంచ్
బిజెపి దళితమోర్చ జిల్లా ఉపాధ్యక్షులు
గ్రా॥ మ్యాడంపెల్లి మం॥ మల్యాల
ఫోన్ 289025

చెరుకు జాన్
సర్పంచ్
లక్ష్మీపూర్,
మం॥ జగిత్యాల
ఫోన్ 277172

బండ శంకర్
యూత్ కాంగ్రెస్ పట్టణ
అధ్యక్షులు
మహాలక్ష్మీనగర్ జగిత్యాల
ఫోన్ 224136



మెడపట్ల గంగాధర్
ఉప సర్పంచ్
టిడిపి నాయకులు
అనంతారం
మం॥ జగిత్యాల

అప్పం స్వామి
V.S.S చైర్మన్
కాంగ్రెస్ నాయకులు
గ్రా॥ అర్పపల్లి
మం॥ సారంగాపూర్
ఫోన్ 278868

A C. No. 81910

With Best Compliments from :

శ్రీమతి ఏదుల్ల రాధా సతీష్
సర్పంచ్
గ్రా॥ తక్కళ్లపెల్లి,
మం॥ జగిత్యాల.



ఏదుల్ల సతీష్
మండల కోశాధికారి
తెలుగుదేశం పార్టీ
గ్రా॥ తక్కళ్లపెల్లి మం॥ జగిత్యాల
సెల్ 9440438935

రొడ్డ కాంతయ్య
సర్పంచ్
కొల్వాయి,
మం సారంగాపూర్

చిక్యాల రాజేశ్వరి
సర్పంచ్
గ్రా॥ ఇబ్రహింనగర్,
మం॥ గొల్లపెల్లి
ఫోన్ 281126



చిక్యాల రాజనర్సు
కాంగ్రెస్ పార్టీ నాయకులు
గ్రా॥ ఇబ్రహింనగర్
మం॥ గొల్లపెల్లి
ఫోన్ 281126

శ్రీనివాస్
సర్పంచ్
అంతర్గాం,
మం॥ జగిత్యాల.

శ్రీమతి గాదం లక్ష్మి లింగయ్య
సర్పంచ్
గ్రా॥ మల్లన్నపేట,
మం గొల్లపెల్లి



గాదం లింగయ్య
టిడిపి నాయకులు
గ్రా॥ మల్లన్నపేట
మం॥ గొల్లపెల్లి
ఫోన్ · 281110

మాలెపు సుధాకర్
సర్పంచ్
రంగపేట,
మం సారంగాపూర్.

With Best Compliments from :

బడుగు గంగారాం
సనిటరీ జవాన్
మున్సిపల్ కార్యాలయము
జగిత్యాల.
సెల్ : 9848295889

చెనెల్లి లక్ష్మీనారాయణ
P.C.
గ్రా॥ నంది మేడారం,
మం॥ ధర్మారం.



వేంగంటి అశోక్
P.C.
ఇ.నెం. 5-3-93,
ఇందిరానగర్,
మెట్‌పల్లి.



బోదసపు సతీష్
గ్రా॥ లింగాపూర్,
మం॥ జగిత్యాల.



డా॥ వెంకట్ నలువాల
B.A., D.C.A., C.P.F.N.
గ్రా॥ సుద్దపెల్లి,
మం॥ పెగడపెల్లి.
ఫోన్ : 281064



ఏలుగు రవిందర్
P.C.
గ్రా॥ రేగడి మద్దికుంట,
మం॥ సుల్తానాబాద్.

సొల్లు రవీందర్
వసుంధర ఎలక్ట్రికల్స్
తహసీల్ చౌరస్తా,
జగిత్యాల.

కండ్లె లింగయ్య
ఇ.నెం. 1-4-57,
అంబేడ్కర్ నగర్,
కోరుట్ల. ఫోన్ : 255274



నల్లాల లింగయ్య
విద్యా కమిటి చైర్మెన్
తక్కళ్లపెల్లి,
మం॥ జగిత్యాల.

With Best Compliments from :

DAMERA NARSAIAH

C.I. of Pol ce

DHARMAPURI

With Best Compliments from :

BHIMANATHINI SHANKAR

M.D.

JAGTIAL.

With Best Compliments from :

✆ : 231088

NAVEENA HOSPITAL

JAGTIAL-505 327.

Dr. N. NARAYANA M.D

With Best
Compliments from :



Prop : **G. NANDAIAH & BROS**

SRI LAXMI COMMUNICATION

SRI LAXMI TENT HOUSE

YAWAR ROAD, JAGTIAL.

With Best Compliments from :

V. VENU GOPAL

B.A B L.

ADVOCATE

JAGTIAL.

With Best Compliments from :



MALLEPELLY RAJESH

B.A.

TAKKALLAPELLY,

Mdl : Jagtial, Dist : Karimnagar.

©: 273526 Cell : 9440132776

విద్య. వినయం.! విజ్ఞానం.!!

బ్రిలియంట్ కాన్వెంట్ స్కూల్

అనంతారం (రొడ్డాం)

మం॥ జగిత్యాల, జి॥ కరీంనగర్.

ఇంగ్లీష్ మీడియం మరియు తెలుగు మీడియం

నర్సరీ నుండి 5వ తరగతి వరకు (ఇ/మీ),

శిశు నుండి 5వ తరగతి వరకు (తె/మీ)

మా ప్రత్యేకతలు :

* అనుభవజ్ఞులైన కేరళ టీచర్లచే విద్యా బోధన
* విద్యార్థులకు ప్రాపంచిక విజ్ఞానం నందు ప్రత్యేక దృష్టి
* ప్రతిరోజు పిల్లలచే వార్తలు చదివించడం.
* గ్రంథాలయం సాంస్కృతిక కార్యక్రమములు, వ్యాయామ శిక్షణ.
* ఆటల యందు శిక్షణ
* ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ
* పరిసర ప్రాంతముల నుండి వచ్చే విద్యార్థుల కొరకు జీపు/ వ్యాన్ సౌకర్యం కలదు.
* హాస్టల్ వసతి కలదు.
* పరిశుభ్రమైన వాతావరణం
* అతి తక్కువ ఫీజుతో ఉత్తమ విద్యను అందించడం
* విద్యలో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి
* ఉత్తమ విద్యార్థులను గురుకుల నవోదయ ప్రవేశ పరీక్షలకు హాజరు కావించడం.
* వికలాంగులకు ఫీజులో 50% రాయితి

మేనేజ్‌మెంట్

ఎ. నర్సయ్య, **యం. రవి**

DMLT (M.A)

ఓ దేవుడా !!!

ఓ దేవుడా !!!
సోదరులమై పుట్టి కులం పేరుతో వేరుపడ్డాం
ఎక్కువతక్కువని కొట్టుకు చస్తున్నాం
మతం మత్తులో మాడిపోతున్నాం
ఈ అసమానతలు నీకు ఆనందమా?
ఈ రక్తపుటేరులు నీకు సంతోషమా?
ఇది తప్పని, ఏనాడూ మాకు చెప్పక పోతివి
అయిన..., నీవెందుకు చెప్పుతావులే
నీవే పెద్ద కులమత శాడిస్టువి
కులానికో దేవుడివై, మతానికో రూపుడవై
అగరువత్తులు, టెంకాయలతో
ఆనందపడుచుంటివి
సాధు జంతువుల బలితో సంతోషపడుచుంటివి
మనిషికి మనిషికి మధ్య చిచ్చుపెట్టి
మారణహోమం చూస్తున్నా నీకు
కులమాతాల రొచ్చులో నిత్యం నలుగుతున్నా
మా ఇదే శాపం
మా ఒక్కొక్క కన్నీటి చుక్క ఏరులై పారి
ఏరులు కుంటలై, కుంటలు చెరువులై
చెరువులు సముద్రాలై, ఆ సముద్రంలో
అలలు ఉప్పొంగి, ఉప్పెనలై, పెనుతుఫానులై
ఆ భీభత్సకర పెనుతుఫానులో
ఈ కులాల గోడలతో, నిర్మించబడిన మతాల మేడలు
పేకమేడలై కుప్పకూలి పోవును గాక
కూలి కొట్టుకపోవును గాక పోవును
అప్పుడు భారతమాత ఆనందభాష్పాలు రాల్చును

(అలిశెట్టి సంస్మరణ సభలో వినిపించిన కవిత)

విశాల సాహితి బి.ఎస్. రాములు

కథా పురస్కార గ్రహీతలు

నవీన్	జీవితకాల కృషికి	1998
భూపాల్	అంబల్ల బండ కథల సంపుటికి	1998
ఆడెపు లక్ష్మీపతి	నాలుగు దృశ్యాలు కథల సంపుటికి	1998
కాలువ మల్లయ్య	మా కథలు కథల సంపుటికి	1999
ముదిగంటి సుజాతారెడ్డి	విసుర్రాయి కథల సంపుటికి	1999
శాంతి నారాయణ	పల్లేరు ముళ్ళు కథల సంపుటికి	1999
కె.వి. నరేందర్	అమ్మ, యుద్ధం, బురదలో జాబిల్లి	1999
ఓల్గా	ప్రయోగం, రాజకీయ కథలు	2000
ఎండ్లూరి సుధాకర్	మల్లెమొగ్గల గొడుగు కథలు	2000
ఎ. అప్పలనాయుడు	ప్రత్యామ్నాయం కథలు	2000
వి. చంద్రశేఖరరావు	లెనిన్ ప్లేస్ కథలు	2000
నాగప్పగారి సుందరరాజు	మాదిగోడు, మావూరి మైసమ్మ కథలు	2000
గంటేడ గౌరనాయుడు	ఏటిపాట కథలు	2000
బోయ జంగయ్య	బోజ కథలు	2001
అంబల్ల జనార్ధన్	బొంబాయి కథలు	2001
కుప్పిలి పద్మ	ముక్త కథలు	2001
సింగమనేని నారాయణ	సింగమనేని కథలు	2001
పి. చంద్	భూనిర్వాసితులు కథలు, శేషగిరినవల	2001
పెద్దింటి అశోక్‌కుమార్	వలస బతుకులు కథలు, ఎడారి మంటలు నవల	2001

విశాల సాహిత్య అకాడమి

మా ఈ ప్రచురణలతో పాటు హైదరాబాద్ బుక్ ట్రస్ట్, విశాలాంధ్ర, ప్రజాశక్తి ప్రచురణలు మావద్ద లభిస్తాయి.

1.	బహుజనతత్వం (బీసి, ఎస్సీ, ఎస్టీల సిద్ధాంతాలు కార్యాచరణ)	- బి.ఎస్. రాములు	250-00
2.	నేనెవరు గతితర్క తత్వదర్శన భూమిక	- బి.ఎస్. రాములు	60-00
3.	గతితర్కం - అంబేద్కరిజం-మార్క్సిజం	- బి.ఎస్. రాములు	30-00
4.	బహుజనతత్వాలు-బిసి, ఎస్‌సి,ఎస్‌టీల పాటలు	- సం।బి ఎస్ రాములు	30-00
5.	ఒద్నాల సూర్య కవితలు	- ఒద్నాల సూర్య	25-00
6.	కిర్రు చెప్పులు-కథల సంపుటి	- దార్ల రామచంద్ర	30-00
7.	గ్లోబలైజేషన్ నేపథ్యంలో వేపచెట్టు (తెలంగాణ కథలు)	- బి ఎస్.రాములు	50-00
8.	ప్రేమంటే ఏమిటి?	- బి.ఎస్. రాములు	20-00
9.	ప్రవహించేపాట ఆం.ప్ర. దళితపాటలు	- సం। బి.ఎస్.రాములు	50-00
10.	తిరుగు ప్రయాణం కథల సంపుటి	- నల్లాల లక్ష్మిరాజం	30-00
11.	స్మృతి - కథల సంపుటి	- బి.ఎస్.రాములు	40-00
12.	కథల బడి - కథా సాహిత్య అలంకారశాస్త్రం	- బి.ఎస్ రాములు	50-00
13.	జన్మభూమి - నాటికలు-పాటలు	- కె సీతారాములు	30-00
14	వినుర్రాయి - కథల సంపుటి	- డా. ముదిగంటి సుజాతారెడ్డి	30-00
15	అమ్మ - కథలసంపుటి	- కె.వి. నరేందర్	30-00
16.	మమతలు మానవ సంబంధాలు	- బి.ఎస్.రాములు కథలు	40-00
17.	ఆధునిక కథాసరిత్సాగరం కరీంనగర్ జిల్లా కథలు		
	మొదటి సంపుటి	- సం॥ బి ఎస్.రాములు	30-00
	రెండవ సంపుటి	- వనమాల చంద్రశేఖర్	50-00
18.	భూ నిర్వాసితులు - కథల సంపుటి	- పి. చంద్	25-00
19.	బి.ఎస్.రాములు 50వ జన్మదిన స్వర్ణోత్సవ సంచిక		50-00
20.	జ్ఞానం పుట్టుక	- బి.ఎస్.రాములు	15-00
21.	వలస బతుకులు-కథల సంపుటి	- పెద్దింటి అశోక్‌కుమార్	30-00
22.	అనాగరికగేయం - కవితా సంపుటి	- మునిమడుగుల రాజారావు	20-00
23.	అంకురం - కవితా సంపుటి	- గోపగాని రవీందర్	20-0
24	కన్నీటి గాథలు - కవితా సంపుటి	- ఎర్ర శ్రీ	15-00
25.	మనకోసం - నాటికలు పాటలు	- కె. సీతారాములు	40-00
26	కన్యాశుల్కంను ఇప్పుడు ఎలా చూడాలి	- బి.ఎస్.రాములు	5-00
27	భారతీయ సాహిత్యం - తెలుగు కథలు	- సం॥ బి ఎస్.రాములు	50-00

త్వరలో రూపు దిద్దుకోనున్న ...

ఆధునిక సాహిత్య చరిత్ర పునర్ మూల్యాంకనం 1850-2002

(ట్రెండ్స్), ధృక్పథాలు (ప్రాంతాలు, ప్రక్రియలు, సామాజిక పరిణామాలతో తులనాత్మక అధ్యయనము)

A C. No. 81910

THIRUGU PRAYANAM- SHORT STORIES IN TELUGU BY NALLALA LAXMI RAJAM

తిరుగు ప్రయాణం

కథల సంపుటి



VISHALA SAHITI PUBLICATIONS